21-5Pg1exHMNWJQEf.qxd:21-5Pg1exHMNWJQEf.qxd 01/01/01 7:45 AM Page 1

మహిళ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-5-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 109 పేజీలు: 12 వెల: 6.50

గాజాలో మారణహోమం: 60 మంది పైగా మృతి
9లో

వక్ఫ్‌సవరణ చట్టంపై 3 అంశాలపైనే విచారణ!

# త్వరలో తెలుగు వర్సిటీ


మంగళవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం దృశ్యం

## హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీని ఎపికి తరలించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం

## స్టడీ సెంటర్ల ఏర్పాటుకు ఓపెన్ వర్సిటీకి అనుమతి

## న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

## రూ. 30వేల కోట్ల పెట్టుబడులు, 35 వేల ఉద్యోగాల కల్పనకు కేబినెట్ ఆమోదం

## రైతుకు గిట్టుబాటు ధరపై కేబినెట్ సబ్‌కమిటీ నిరంతర పర్యవేక్షణ: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధి పర్చేదిశలో తీసుకునేనిర్ణయాన్ని అమలుచేసే దిశలో కార్యాచరణ ఉండాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో పలు అంశాలపై చర్చించారు. సచివాలయంలో మొదటి బ్లాక్‌లో మంగళవారం జరిగినసమావేశంలో మొత్తం 24 అంశాలపై చర్చ జరిగింది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో ఎపిఐఐసికి ఉచితంగా 615 ఎకరాల భూ కేటాయింపునకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారిశ్రామిక పార్కు ఏర్పాటుకోసం ఎపిఐఐసికి భూ కేటాయింపు చేసేప్రతిపాదనకు మంత్రివర్గం అమోదం తెలిపింది. సత్యసాయి జిల్లా తాడిమర్రిలో అదానీ పవర్‌కు 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రోపవర్ ప్రాజెక్టుకు, కడప జిల్లాలోని కొండాపురంలో 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటుకు భూ కేటాయింపునకు నిర్ణయం తీసుకున్నారు. ఎకరా 5 లక్షల రూపాయల చొప్పున భూ కేటాయింపునకు నిర్ణయించారు. 2260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల నియామక నిర్ణయానికి ర్యాటిఫై చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఎపికి తరలించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎపిలోని విద్యార్థులకు కోచింగ్ ఇచ్చేందుకు స్టడీ సెంటర్ల ఏర్పాటుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి అనుమతి ఇచ్చారు. అమరావతిలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా లీగల్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపారు. ఎండీయూ వాహనాలను రద్దు చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యం ఇతర సరుకులు ఇచ్చే ప్రతిపాదనకు కేబినెట్‌లో చర్చించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద సిటీసైడ్ డెవలప్మెంట్ కోసం 500 ఎకరాలు కేటాయించేలా జీఓఎం చేసిన సిఫార్సుకు కేబినెట్ అమోదం తెలిపింది. ఎపి లెదర్ >>2


మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు పార్థసారధి, నాదెండ్ల మనోహర్

# విద్యాభివృద్ధికి పెద్దపీట

## రాజమహేంద్రవరంలో తెలుగు వర్సిటీ, ఏలూరు వద్ద ఓపెన్ వర్సిటీ

## ప్రజా పంపిణీ వ్యవస్థలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు మూసివేత

## కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు నాదెండ్ల, పార్థసారధి

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటవుతుందని రాష్ట్ర సమాచారశాఖా మంత్రి కొలుసుపార్థసారధి, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌లు తెలిపారు, ఎపి ప్రచార,ప్రసార మాధ్యమాల సమాచార సమావేశ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడతూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ చట్టం, 1985 లోని సెక్షన్ 3(2) ప్రకారం ఆంధ్రప్రదేశ్లోని రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికై నోటిఫికేషన్ జారీచేసేందుకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పిందని వివరించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ చట్టం, 1985 (1985 చట్టంనం.27) లోని సెక్షన్ 3(2) ప్రకారం, ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేయబడింది, తద్వారా ఈ విషయంలో గతంలో జారీ చేసిన ఆదేశాలను భర్తీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాని కార్యకలాపాలను ప్రారంభించడానికి వీలు కల్పిస్తుంది.
ప్రధానంగా తెలుగు భాష మరియు సాహిత్యం మరియు ఇతర లక్ష్యాలను అభ్యసించడానికి విద్యార్థుల అవసరాలను తీర్చడానికి ఎపిలో ఉన్న 3 కేంద్రాలను నిర్వహించడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అనే పేరు, ఉప శీర్షికతో ఒక తెలుగు విశ్వవిద్యాలయం ఉండాలని రాష్ట్రం కోరుతోందన్నారు. తెలుగు భాషా సాహిత్యం మరియు సంస్కృతిలో ఉన్నత స్థాయి పరిశోధనా కేంద్రంగా పని చేస్తుంది. ఏలూరు సమీపంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర >>2

# ఎపిఐసెట్‌లో 95.86% ఉత్తీర్ణత

## క్వాలిఫైయర్స్‌లో బాలికలదే హవా

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎపిఐసెట్2025 ఫలితాలు విడుదలయ్యాయి. ఐసెట్ పరీక్ష 34,131 మంది విద్యార్థులు రాయగా 32,719 మంది క్వాలిఫై అయ్యారు. ఈ పరీక్షలో 95.86శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఐసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. విద్యార్థుల ఉజ్వల విద్య భవిష్యత్తుకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఐసెట్‌కు మొత్తంగా 37,572మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో 94 పరీక్ష కేంద్రాల్లో మే 7న ఐసెట్ నిర్వహించగా.. 34,131మంది పరీక్షకు హాజరయ్యారు. ఐసెట్‌లో 32,719మంది క్వాలిఫైఅయ్యారు. వీరిలో 15,176మంది అబ్బాయిలు, 17,543మంది అమ్మాయిలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్.వాట్సప్ గవర్నెన్స్ నం. 9552300009లో అందుబాటులో ఉన్నాయి. మనోజ్ మేకా (విశాఖ) అత్యధిక మార్కులతో ఒకటో ర్యాంకు సాధించగా.. ఆ తర్వాత ర్యాంకుల్లో ద్వారకచర్ల సందీప్ రెడ్డి (వైఎస్‌ఆర్ కడప), ఎస్. కృష్ణసాయి (ఎన్‌టీఆర్ జిల్లా), వల్లూరి సాయిరాం సాత్విక్ (హైదరాబాద్), రేవూరి మాధుర్య (గుంటూరు), షేక్ బషీరున్నీషా (అనకాపల్లి), వి. అజయ్ కుమార్ (తిరుపతి), భీశెట్టి హరి వెంకటప్రసాద్ (తూర్పు గోదావరి), ఎస్. గణేశ్‌రెడ్డి (విశాఖ), మహేంద్ర సాయి చామా (తిరుపతి) సాధించారు.


మంగళవారం హోస్పేటలో హక్కుదారులకు భూమి పట్టాలు వితరణ చేస్తున్న రాహుల్‌గాంధీ, కర్ణాటక సిఎం సిద్దరామయ్య, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, డిసిఎం డి.కె.శివకుమార్‌లు

# 6వ గ్యారెంటీగా భూపట్టాల పంపిణీ

## హోస్పేట సమర్పణ సంకల్ప సమావేశంలో రాహుల్‌గాంధీ

**బళ్లారి, మే20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినసందర్భంగా విజయనగర జిల్లా హోస్పేటలో సమర్పణ సంకల్ప సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐసిసి అధినేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిసిఎం డి.కె.శివకుమార్‌లుహాజరయ్యారు. బళ్లారి, విజయనగర, కొప్పళ, దావణగెరె జిల్లాల నుంచి లక్షలాది సంఖ్యలో ప్రజలు హాజరుకావడం విశేషం. ఈ సమావేశంలో మాట్లాడిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రాష్ట్రంలో పంచగ్యారంటీ యోజనలను సమర్థవంతంగా ఆచరణలోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 6వ గ్యారంటీ యోజనగా భూ హక్కును కల్పించే భూమిగ్యారంటీని జారీలోకి తెచ్చిందన్నారు. సుమారు లక్షమందికి భూహక్కుదారులకు ఈ సమావేశంలో వారి పేరిట పట్టాలుగా చేసి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే >>2

# అన్యమత ఉద్యోగులకు వీఆర్‌ఎస్

## రూ.5లక్షలు అదనంగా చెల్లించేందుకు ఆమోదం

## ఆ 29మందిని సాగనంపేందుకు టిటిడి నిర్ణయం

## రూ. 10కోట్లతో అనంతవరం వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి


మంగళవారం అన్నమయ్యభవనంలో ధర్మకర్తలమండలి సమావేశం దృశ్యం

**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో తిరుమల,తిరుపతిలోని పలు కీలకవిభాగాల్లో పనిచేస్తున్న హిందూయేతర (అన్యమతస్తుల)ఉద్యోగులను స్వచ్ఛంద పదవీవిరమణ చేయించాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ప్రాథమికంగా గుర్తించిన ఉద్యోగులు గాక ప్రధానంగా పద్ధతి మార్చుకోని అన్యమతం ఆచరిస్తున్న 29మంది ఉద్యోగులను స్వచ్ఛంద పదవీవిరమణ చేయాలని, దీనికి అంగీకరించే వారికి అదనంగా 5లక్షలరూపాయలు చెల్లించడానికి నిర్ణయించారు. ఇందుకు అంగీకరించని వారిని అలా వీఆర్‌ఎస్ ఇవ్వకుంటే రానున్న బోర్డు సమావేశంలో చర్చించి తదుపరి చర్యలు తీసుకునేందుకు అడుగేయనున్నారు.అంతేగాక ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునుండి అందే ఆదేశాల మేరకు తగిన నిర్ణయం ఉంటుందనేది టిటిడి అధికారుల వెల్లడించారు. మంగళవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, దేవాదాయశాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.తిరుమల,తిరుపతిలోనేగాక ఇతర ప్రాంతాల్లోని టిటిడికి చెందిన పలు విభాగాల్లో సుమారు 300మందివరకు అన్యమతస్తులు సేవలందిస్తున్నారనేది సమాచారం. గతంలో విజిలెన్స్ విభాగం అందించిన నివేదికలు. అయితే ఇందులో ప్రధానంగా 29మందిని గుర్తించిన టిటిడి అధికారులు ఆ దిశగా వారిని సాగనంపేందుకు తుదినిర్ణయం తీసుకున్నారు.ఆయా ఉద్యోగులను ఏకంగా ఇళ్లకే పంపించాలని బోర్డు సంచలన నిర్ణయం తీసుకుని ఆమోదించింది. ఇక భక్తుల సేవలో తిరుమలలో వ్యాపారాలు చేసుకుంటున్న హోటళ్లు,ఫాస్ట్‌పుడ్ కేంద్రాల నిర్వాహకులు ఆహారపదార్థాలు నాణ్యత లేకుండా తయారుచేస్తూ వడ్డిస్తున్నారనే భక్తులఫిర్యాదులపైకూడా టిటిడి బోర్డు స్పందించింది. లక్షమంది వరకు రోజువారీగా తిరుమలకు వస్తున్న భక్తులు చాలావరకు కొండపై హోటళ్లు, ఫాస్ట్‌పుడ్ కేంద్రాల్లో తయారుచేసి వడ్డించే ఆహారపదార్థాలు స్వీకరిస్తున్నారు. ఏదో ఒకరోజు ఇలా వచ్చాంకదా అని యాత్రికులు కూడా ధరలతో సంబంధం లేకుండా ఇష్టమొచ్చిన, నచ్చిన ఆహారపదార్థాలు భోంచేస్తున్నారు. యాత్రికులు ఒకపూట భోంచేసి వెళ్లిన వాళ్లు మళ్లీ ఏడాదికో, రెండేళ్లకో తిరుమలకు వస్తారు. ఇక్కడ యాత్రికులకు రుచికరంగా, నాణ్యతతో ఆహార పదార్థాలు, తినుబండారాలు తయారుచేయాలనేది టిటిడిఅదనపు ఇఒ వెంకయ్య చౌదరి తీసుకున్న కీలక నిర్ణయం. ఆ దిశగా ఉత్తరభారతదేశ ఆహారపదార్థాలైన చైనీస్‌వంటకాలను కూడా నిషేధించారు. కొండపై హోటళ్లలో నూడిల్స్, గోబీ, చైనీస్ వంటకాలు లేకుండా ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు తిరుమలలో హోటళ్లు నాణ్యతగా ఉన్న ఆహారపదార్థాలు వడ్డించేలా, రుచిగా శుచిగా ఉండేలా చూడాలని సూచించారు. హోటళ్ళలో వండిన అల్పాహారం ఇడ్లీ,దోస,పూరీలు, పులిహోర, లెమన్‌రైస్, వడలు, సాంబారు తదితర >>2

# రోహింగ్యాల వలసలతో నిరుద్యోగం

## అంతర్గత భద్రతకు ప్రమాదం: డి.సిఎం పవన్



**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** సరిహద్దుల్లో సైనికులు ఎంత భద్రంగా దేశాన్ని రక్షిస్తున్నారో, దేశం లోపల అంతర్గత భద్రతలో పోలీసుశాఖ కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండటం కీలకమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. దీనిపైనే రాష్ట్ర పోలీసులను, పరిపాలన సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తూ లేఖ రాశానన్నారు.దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదుల సున్నితమైన లక్ష్యం అని గతంలో జరిగిన కిరాతక దాడుల్లో తేలింది. కోయంబత్తూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడులు తల్చుకుంటే ఇప్పటికీ గుండె తరుక్కుపోతుందని చెప్పారు. సరిహద్దుల్లో భద్రతా సిబ్బంది ఎంత అప్రమత్తంగా ఉంటారో, రాష్ట్ర పోలీసులుకూడా అంతర్గత భద్రతపై అంతే సీరియస్‌గా దృష్టి సారించాలని స్పష్టం చేశారు. మంగళవారం ఉపముఖ్యమంత్రి పవన్ విజయవాడ విమానాశ్రయంలో జాతీయమీడియాతో మాట్లాడారు.



# త్వరలో విజయవాడ - బెంగళూరు మధ్య వందేభారత్ రైలు

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రయాణికులకు ఇండియన్ రైల్వే.. గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలో విజయవాడ - బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడిపేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే ప్రతిపాదనలను సిద్ధం చేసింది. షెడ్యూల్‌తోపాటు ప్రయాణ సమయం తొమ్మిది గంటలుగా రైల్వే శాఖ నిర్ణయించింది. దీంతో ప్రయాణికులకు దాదాపు మూడు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది.. ఈ వందే భారత్ రైలు బెంగళూరు వెళ్లేవారితో పాటు తిరుపతి వెళ్లే ప్రజలకూ ఉపయోగపడనుంది. మొత్తం 8 బోగీల్లో 7 ఏసీ ఛైర్‌కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్ ఉండనున్నాయి. విజయవాడ - బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20711) మంగళవారం మినహా వారానికి ఆరు రోజులు రాకపోకలు సాగించనుంది. ఈ రైలు విజయవాడలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరి తెనాలి 5.39, ఒంగోలు 6.28, నెల్లూరు >>2

# రాష్ట్రంలో విలువల్లేని పాలన

## యధేచ్ఛగా సాగుతున్న కేసులు, అరెస్టుల పర్వం

## ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాజీ సిఎం జగన్



**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిది:** రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని మనం రాక్షస యుగంలో ఉన్నామని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు.చంద్రబాబు పాలనలో రాజకీయాల నైతికంగా పతనం అయ్యాయని స్పష్టం చేశారు. చంద్రబాబు పరిపాలనలో యథేచ్ఛగా కేసులు, అరెస్టుల పర్వం కొనసాగుతోందన్నారు. వాటికి భయపడాల్సిన అవసరం లేదని.. అలాంటి వారే ఇప్పుడు రాజకీయాలు చేయగలరని, రాజకీయాల్లో మనుగడ కొనసాగించగలరని ఆయన తెలిపారు. కోనసీమ జిల్లా రామచంద్రాపురం మున్సిపాలిటీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మున్సిపాలిటీ, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండలం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి)కి చెందిన వైఎస్సార్సీ ప్రజాప్రతినిధులతో వైయస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీ అందరితో ఈరోజు సమావేశంకావడం ఎంతో సంతోషకరం. ఎలాంటి పరిస్థితుల మధ్య మనం ప్రయాణం చేస్తున్నామో నాకంటే మీకే బాగా తెలుసు. మనం రాక్షసయుగంలోఉన్నాం. కలియుగంలో అంటే చంద్రబాబు యుగంలో రాజకీయాలు చేయాలంటే.. కేసులు వేసినా భయపడొద్దు. జైళ్లకు పంపినా, చంద్రబాబు నిన్ను ఎదుర్కొంటాం అని గట్టిగా అంటేనే, అలా ఉండగలిగినప్పుడే రాజకీయాల్లో ఉండగలం. రాజకీయాలు చేయగలం. అదే ఈ కలియుగంలో మనం నేర్చుకుంటున్న పాఠం. ఆ విధంగా ఈరోజు రాజకీయాలు తయారయ్యాయి. నాడు ఏనాడూ గతి తప్పలేదున్నారు.చంద్రబాబు ఈరోజు చేస్తున్న రాజకీయంలో కనీసం ఒక శాతం కూడా మనం చేయలేదు. ఏ ఒక్కరినీ ఇబ్బందిపెట్టే ప్రయత్నంచేయలేదు. నాడు స్థానిక ఎన్నికల్లో >>2


మంగళవారం షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులతో మంత్రి లోకేష్

# స్కూలు పరీక్షలా! అసెంబ్లీలో ప్రశ్నలా?

## ఏది కష్టం?: ప్రశ్నించిన విద్యార్థులు

## ఆసక్తికరమైన జవాబిచ్చిన మంత్రి లోకేష్

## చంద్రబాబు స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి

## ఉన్నత స్థానం చేరాలంటే కష్టపడి పనిచేయాలి

**విజయవాడ,మే20, ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులేప్పుడు చురుకుగా,చలాకీగా ఆలోచించాలని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో పదోతరగతి ఉత్తమ విద్యార్థులకు సత్కార కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సరదా ప్రశ్నలకు మంత్రి లోకేష్ ఉత్సాహంగా సమాధానాలిచ్చారు. మీకు స్కూలులోపరీక్షలు కష్టంగా ఉండేవా, అసెంబ్లీలో సభ్యులు అడిగే ప్రశ్నలు కష్టమా అని చీరాలకు చెందిన సంతోష్ ప్రశ్నించగా, >>2

21-5pg2exHMNWJQE.qxd:21-5pg2exHMNWJQE.qxd 01/01/01 7:47 AM Page 1



## తిరువూరు మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు కీలక ఆదేశాలు

**విజయవాడ,మే20,ప్రభాతవార్త ప్రతినిధి:** తిరువూరు మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అరగంటలో భద్రతా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. డిసిపి స్థాయి అధికారితో కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని సూచించింది. తిరువూరు మున్సిపల్ ఎన్నికపై వైసిపి హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. వైసిపి కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని పేర్కొంది. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు అరగంటలో డిసిపి స్థాయి అధికారితో వైసిపి కౌన్సిలర్లకు భద్రత కల్పించడమే కాదు, తక్షణమే ప్రశాంత ఎన్నికలకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది.



సరస్వతీ పుష్కరాల సందర్భంగా తెలంగాణలోని కాళేశ్వరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

## నేటినుండి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వద్ద పిసిసి ఛీఫ్ షర్మిల ఆమరణ దీక్ష

**విజయవాడ, మే 20, ప్రభాతవార్త :** విశాఖ ఉక్కుఫ్యాక్టరీ వద్ద ఎపిసిసి ప్రెసిడెంట్ షర్మిలమ్మ నేడు చేపడుతున్న ఆమరణ దీక్షకు మద్దతు పలకాలని ఎపిసిసి పత్రికాముఖంగా పౌరసమాజం, వివిధ రంగాల ప్రజలను కోరింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో ఇప్పటికే తొలగించిన 2వేల మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పర్మినెంట్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 8నెలల జీతాలు చెల్లించాలని తాము పలుమార్లు రాష్ట్ర ముఖ్య మంత్రికి తీసుకొచ్చినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో తాము ఈ దీక్ష చేపడుతున్నట్లు ఎపిసిసి ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజి తెలిపారు.

## టిడిపి మహానాడుకు 19 కమిటీల ఏర్పాటు

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మహానాడు నిర్వహణకు తెలుగుదేశం పార్టీ 19 కమిటీలను నియమించింది. పార్టీలోని ముఖ్య నేతలతో కమిటీని ఏర్పాటు చేసింది. పల్లా శ్రీనివాస్, బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో ఆహ్వాన కమిటీ నారా లోకేశ్ నేతృత్వంలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. యనమల ఆధ్వర్యంలో తీర్మానాలు, అచ్చెన్న నేతృత్వంలో వసతి ఏర్పాటు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో సభ నిర్వహణ, బీసీ జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో భోజనాల కమిటీలను ఏర్పాటుచేశారు. ఒక్కో కమిటీలో 10నుంచి 20మందినేతలకు చోటు కల్పించారు. కడప వేదికగా ఈనెల 27,28, 29 తేదీల్లోమహానాడు నిర్వహించనున్నారు.

## ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులకు సిఎం ఘన నివాళి

**విజయవాడ,మే20,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్ర కేసరి, దివంగత సిఎం టంగుటూరి ప్రకాశం పంతులకు నివాళి అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు సిఎం చంద్రబాబు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. నిరుపేద కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో ప్రముఖ వ్యక్తిగావెలుగొంది ఆంధ్రకేసరిగా కీర్తిప్రతిష్ఠలు పొందిన ఆ మహనీయుడు మనందరికీ స్ఫూర్తి ప్రదాత. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని బ్రిటీష్ తుపాకీకి గుండెను చూపిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేం. టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగం ఆదర్శవంతం. ఆయనకుమరొక్కమారు ఘననివాళి ఘటిస్తున్నాను అని సిఎం చంద్రబాబు తెలిపారు.




మంగళవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో సిసిఐ వార్షికోత్సవాలలో పాల్గొన్న కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

# విద్యాభివృద్ధికి పెద్దపీట

>> ఉన్నత విద్యా శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పిందని వివరించారు. ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం ద్వారా, ప్రభుత్వం ఉన్నత విద్య. జీవితాంతం నేర్చుకునే అవకాశాలను మరింత సమ్మిళితమైన మరియు జ్ఞానవంతమైన సమాజాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుంది. ఈ చొరవతో నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులోకి రావడమే కాకుండా విభిన్న వర్గాల అవసరాలను తీరుస్తుంది మరియు రాష్ట్రంలోని రాష్ట్ర లేదా ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో సులభంగా ప్రవేశం లేని విద్యార్థులను శక్తివంతం చేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70 అధ్యయన కేంద్రాలను నిర్వహించడానికి, తద్వారా ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థుల విస్తృత విద్యా ప్రయోజనాలకు సేవ చేయడానికి, ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటుచేస్తున్నది. హైకోర్టులో వివిధ కేటగిరీ లలో 245 పోస్టుల కల్పనకు న్యాయ శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని నిలిపివేస్తున్నామని మంత్రి నాదెండ్ల సమావేశంలో వివరించారు. గతంలో మాదిరిగానే చౌక ధర దుకాణాల ద్వారా నేరుగా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించేందుకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు పౌర సరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రేషన్ కార్డుదారులు ఇచ్చిన ఫీడ్బ్యాక్ ప్రకారం 25 మంది నిత్యావసర సరుకులు అందకపోవడం, 26 మంది ఆపరేటర్లు అధిక ధరలు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు చేశారు. ఈ నిర్ణయం వలన ప్రభుత్వానికి రూ.353.81 కోట్లు ఆదా అవుతాయి. దీపం 2 పథకం క్రింద మొదటి ఫేజ్ లో దాదాపు 99,700 మంది లబ్దిపొందాయ ఉచిత గ్యాస్ సిలిండర్ సౌకర్యాన్ని వినియోగించుకోవడం జరిగింది. దీపం2 ఫేజ్ టూ అమల్లో భాగంగా ఇప్పటికే దాదాపు 70 లక్షల మంది ఉచిత గ్యాస్ సిలిండర్ కోసమై బుక్ చేసుకోవడం జరిగింది. ఫేజ్3 లో ముందుగానే గ్యాస్ రాయితీ సొమ్మును లబ్దిదారులు ఖాతాలో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ పాల్గొన్నారు.

# త్వరలో తెలుగు వర్సిటీ

>> ఫుట్ వేర్ పాలసీ 4.0కి కేబినెట్ ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదించిన 11 సంస్థలకు సంబంధించిన పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం లభించింది. 30 వేల కోట్ల వరకూ పెట్టుబడులు, 35 వేల ఉద్యోగాల కల్పనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేబినెట్‌లో రైతుల సమస్యలపై సుదీర్ఘ చర్చజరిగింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది వివిధ పంటల దిగుబడులు పెరిగాయని అధికారులు వివరించారు. అంతర్జాతీయ పరిణామాలు, దేశవిదేశాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా వివిధ పంటల ధరలపై ప్రభావం పడిందని మంత్రివర్గం అభిప్రాయపడింది. మిర్చి, పొగాకు, ఆక్వా, కోకో, చెరుకు, మామిడి వంటి పంట ఉత్పత్తుల ధరలు తగ్గడానికి గల కారణాలు అధికారిక నివేదికలను అనుసరించి వ్యవసాయమంత్రి అచ్చెన్ననాయుడు వెల్లడించారు. ఇందులో ప్రధానంగా పొగాకు ధర పతనం కావడంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర వచ్చేలా చూసి, రైతుల్లో అధికారులు నమ్మకం నింపాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురాకుండా చూడాలని స్పష్టం చేశారు. పొగాకును నాణ్యత ఆధారంగా క్వింటాల్‌కు రూ.12,500కు కంపెనీలు కొనుగోలు చేయాలి. రైతుల ఇళ్లల్లోనూ, పొలాల్లోనూ ఎక్కడా పొగాకు నిల్వలు కొనుగోళ్లు జరగకుండా మిగిలిపోకూడదని.. తక్షణం కంపెనీలు కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు చేసి అవసరమైతే గోడౌన్లలో నిల్వ ఉంచుకోవాలని సూచించారు. కొనుగోళ్లు ఏస్థాయిలో జరుపుతున్నారు, ఎంతమేర ధర చెల్లిస్తున్నారు... అనే నివేదిక సోమవారం కల్లా ఇవ్వాలని ఆదేశించారు. అత్యధిక ధరలు ఆశ చూపించి రైతులు పొగాకు సాగు చేసేలా చేస్తున్న కంపెనీలు, తీరా పంట చేతికి వచ్చేసరికి అమాంతం ధరలు తగ్గించడం సరికాదన్నారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యను అధిగమించాలంటే బైబ్యాక్ పాలసీ ఉత్తమమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అలాగే క్రాప్ రీషెడ్యూల్ చేయాలని, దీనికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. కోకో పంట గిట్టుబాటు ధరపైనా మంత్రిమండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. కోకో గింజలను కిలోకు రూ.500 ధరకు తగ్గకుండా కొనుగోలు చేయాలని మాండలీజ్ సంస్థకు సూచించారు. రైతుల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వ్యవసాయ దిగుబడులు, గిట్టుబాటు ధరలు, నిత్యావసరాల ధరలపై ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ నిర్ణయించింది. రైతులకు గిట్టుబాటు ధర దక్కేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీ నిరంతర పర్యవేక్షణ చేయనుంది. కేబినెట్ సమావేశంలో 45 నిమిషాలు వ్యవసాయరంగం, అన్నదాతల కష్టాలు, మార్కెటింగ్‌పై చర్చ జరిగింది. రైతులకు స్వాంతన చేకూరేలా, క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించేలా ప్రభుత్వ చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇటీవల 6వ ఎస్ఐపిబి సమావేశంలో 19 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటికి సంబంధించి రూ. 33 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**లిక్కరు స్కామ్ ఎవ్వరు మాట్లాడ వద్దు**

మద్యం కుంభకోణం దర్యాప్తులో ఎవరు మాట్లాడవద్దని.. అనవసరంగా మాట్లాడితే మరో రకంగా వెళ్తుందని మంత్రులకు సీఎం తెలిపారు. సిట్ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తోందని... వాళ్ళ పని వాళ్లని చూసుకోనివ్వాలన్నారు. మద్యం కుంభకోణంపై పత్రికల్లో వచ్చిన వార్తలు చూసి ఎవరు మాట్లాడవద్దని సిఎం స్పష్టం చేశారు.

వచ్చే కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తి అవుతున్న సందర్భంగా సాధించిన విజయాలు, ప్రజలు మనోభావాలపై చర్చిద్దామని సీఎం అన్నారు. పంటలకు ఈ సారి ధరలు తగ్గాయని.. మానిటర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైజాగ్ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడటంపై మంత్రి స్వామిని సీఎం ప్రశ్నించారు. అలా జరగకుండా చూడాలని సీఎం కోరారు. రేషన్ సరఫరాకు ఎండీయూ వాహనాలను కేబినెట్ రద్దు చేసింది. వీటిపై తీసుకున్న రుణాలను ప్రభుత్వం చెల్లించి వాహనాల యజమానులకు ఇచ్చేయాలని నిర్ణయించింది. బియ్యం ఇచ్చే రోజు మినహా మిగతా రోజుల్లో వాళ్ళే వాడుకుంటున్నారని... ఇకపై రేషన్ బియ్యం రేషన్ దుకాణాల్లోనే ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. వికలాంగులు, సీనియర్ సిటిజన్స్‌కు ఇంటికి వెళ్ళి బియ్యం ఇవ్వాలని సిఎం ఆదేశించారు. రేషన్ స్థానంలో నగదు ఇస్తే ఎలా ఉంటుంది అనే అంశంపై కూడా కేబినెట్‌లో చర్చకు వచ్చింది. విశాఖ డిప్యూటీ మేయర్‌తో పాటు పలు చోట్ల ఛైర్మన్,ఉప ఛైర్మన్ ఎన్నిక వాయిదా సరికాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంత్రి వర్గ సమావేశం అనంతరం తాజా రాజకీయ అంశాలపై మంత్రులతో చంద్రబాబు చర్చించారు. బియ్యం ఇచ్చే రోజు తప్ప రేషన్ వాహనాల వల్ల ఉపయోగం లేదని మంత్రులు అభిప్రాయపడ్డారు. వికలాంగులు, వృద్ధులకు ఇళ్ళ వద్దనే రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మిగిలిన వారికి రేషన్ దుకాణాల ద్వారానే ఇకపై బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. వాహనాల ద్వారా రేషన్ సరఫరా వల్ల స్మగ్లింగ్‌కు అవకాశం ఇస్తూ పథకం దుర్వినియోగం జరుగుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దుకాణంలో ఎప్పుడు కావాలంటే అప్పుడు రేషన్ తీసుకునే అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు.

## వందేభారత్ రైలు

>> 7.43, తిరుపతి 9.45, చిత్తూరు 10.27, కాట్పాడి 11.13, కృష్ణరాజపురం 13.38, ఎస్ఎంవీటీ బెంగళూరు 14.15 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో అదే రోజు (20712) బెంగళూరులో మధ్యాహ్నం 14.45 గంటలకు ప్రారంభమై కృష్ణరాజపురం 14.58, కాట్పాడి 17.23, చిత్తూరు 17.49, తిరుపతి 18.55, నెల్లూరు 20.18, ఒంగోలు 21.29, తెనాలి 22.42, విజయవాడ రాత్రి 23.45 గంటలకు చేరుకోనుంది.

# విలువల్లేని పాలన

>> అన్నీ మనం గెల్చాం. కేవలం రెండు మున్సిపాలిటీల్లో మనం ఓడిపోయాం. తాడిపత్రి మున్సిపాలిటీలో మనకు 16 మంది కౌన్సిలర్లు ఉంటే, టిడిపికి 18 మంది ఉన్నారు. ఇద్దరిని లాగుదామని, మన ఎమ్మెల్యే అంటే, నేను వద్దన్నాను. ఎమ్మెల్యేను హౌజ్ అరెస్టు చేయించి, ఛైర్మన్ ఎన్నిక నిర్వహించాను. అదీ మనం చేసిన విలువలతో కూడిన రాజకీయం. జగనన్నకు చెబుతాం అని కార్యక్రమం పేరుతో ఒక నెంబర్ ఇచ్చాను. దానికి ఎవరు ఫోన్ చేసినా, వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాం. అలాగే స్పందన అనే కార్యక్రమం వారం వారం నిర్వహించాం. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాం. కలెక్టర్లు, మండల స్థాయిలో కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా, నేరుగా సిఎంఒ ఫాలోఅప్ చేసేది. అప్పుడు ఎక్కువ సమస్యలు టిడిపి వారివే పరిష్కారమయ్యాయి. పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందన్నారు. ఆరోజు కులం, మతం, రాజకీయం చూడకుండా మనం పాలించాం. అదే ఈరోజు పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ఈరోజు తిరువూరు చూసినా, ఎక్కడైనా అదే రాజకీయం. తిరువూరులో 20 మంది కౌన్సిలర్లలో 17 మంది వైయస్సార్సీకి చెందిన వారు. టిడిపి నుంచి ముగ్గురే ఉన్నా, బలవంతంగా లాగే ప్రయత్నం చేస్తున్నారు. 5గురిని లాగారు. అయినా ఆ ఎన్నికలో మనమే గెలవాలి. ఎందుకంటే మన బలం 12. టిడిపికి కేవలం 8 మంది మాత్రమే ఉన్నారు. టిడిపికి బలం లేకపోయినా, పదవి కోసం దారుణంగా వ్యవహరిస్తున్నారు. అదికూడా జరగకుండా పోలీసుల సహాయంతో ఎన్నిక జరగకుండా చూస్తున్నారు. మన నాయకులను హౌజ్ అరెస్టు చేశారు. టిడిపి వారందరినీ రోడ్ల మీదకు వదిలారు. ఈరోజు కోర్టులో హౌజ్ మోషన్ మూవ్ చేశాం. పోలీసు బందోబస్తు కోరాం. ఎన్నికల జరగకుండా చూస్తున్నారు. నరసారావుపేటలో మొత్తం 17 గెల్చాం. కానీ వారిలో కొందరిని లాక్కున్నారు. దీంతో మనకు 13 మంది సభ్యులుఉండగా, టిడిపికి కేవలం ముగ్గురే ఉన్నారు. ఒకరు చనిపోయరు. కోరం లేకపోయినా గెల్చామని ప్రకటించుకున్నారు. కారంపూడిలో మొత్తం 14 వైయస్సార్సీ గెలిస్తే, ఆరుగురిని లాగారు. అయినా అక్కడ మన బలం 8 కాగా, టిడిపికి ఆరుగురు మాత్రమే ఉన్నారు. అయినా అక్కడా కోరం లేకపోయినా గెల్చినట్లు ప్రకటించారు. చివరకు కుప్పంలోనూ అదే పరిస్థితి. కుప్పం మున్సిపాలిటీ, రామకుప్పంలోనూ అదే పరిస్థితి. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరిలో వైయస్సార్సీ 9 గెలిస్తే, టిడిపి 1 మాత్రమే గెల్చింది. అయినా ఛైర్మన్ ఎన్నికలో అక్రమాలు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ఎందుకీ రాజకీయాలు? సిఎం స్థాయిలోనే అక్రమాలు చేస్తే ఎలా? ఒక పార్టీ మీద గెల్చినప్పుడు, వారిని లాక్కోవడం ఏమిటి? సిఎంగా ఉన్న వ్యక్తే ప్రజాస్వామ్యాన్ని కాపాడకపోవడం, పోలీసులను పెట్టి భయపెట్టడం ఏమిటి? మన పార్టీ నుంచి ముగ్గురిని లాక్కున్నారు. అయినా మనకు ఇంకా ఆరుగురు ఉన్నారు. మనదే మెజారిటీ. ఎన్నిక పెడితే మనమే గెలుస్తాం. అయినా దౌర్జన్యం చేసి, కోరం లేదని చెప్పి, ఎన్నిక గెల్చే ప్రయత్నం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం, యలమంచిలి. అక్కడ వైయస్సార్సీ 14. టిడిపి 4గెల్చింది. ఒకరిని లాక్కున్నారు. మిగతావారు గట్టిగా నిలబడడంతో, ఏంచేయలేక వదిలేశారు. మామూలుగా ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఏడాది తర్వాత కొంత వస్తుంది. కానీ, చంద్రబాబు ప్రభుత్వానికి ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకత చాలా తీవ్ర స్థాయిలో ఉంది. ప్రజలు ఆయన్ను తీవ్రంగా ద్వేషిస్తున్నారు. కారణం, ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చాడు. జగన్ ఇచ్చినవన్నీ ఇవ్వడమే కాకుండా, ఇంకా మూడు ఎక్కువ ఇస్తానన్నాడు. కానీ, ఏదీ నిలబెట్టుకోలేదు. ఇప్పటికీ సంవత్సరం అయిపోయింది. అందుకే ఆయన ప్రభుత్వంపై అంత వ్యతిరేకత వచ్చిందని జగన్ అన్నారు. ఎవరు మాట్లాడినా,గొంతు విప్పినా, వారి గొంతు నొక్కుతున్నారు. మ్యానుఫ్యాక్చర్ విట్నెస్ సృష్టిస్తున్నారు. అంటే నేరంతో ఒక మనిషికి సంబంధం ఉండదు. వారు ఏం చేస్తున్నారంటే.. వారికి సంబంధించిన ఒక వ్యక్తిని ఏర్పాటు చేస్తున్నారు. ఆయన్ను అప్రూవర్ అంటున్నారు. ఆయనతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడిస్తున్నారు. ఒక మ్యానుఫ్యాక్చర్ ఎవిడెన్స్ క్రియేట్ చేస్తున్నారు. ఆ మనిషితో, ఈ మనిషి పేరు చెప్పిస్తున్నారు. ఈ మనిషిని అరెస్టు చేస్తున్నారు. చరిత్రలో గతంలో ఏనాడూ ఇలాంటివి జరగలేదు. ఒక తప్పుడు సంప్రదాయానికి ఈ పెద్దమనిషి చంద్రబాబునాయుడు ఈరోజు బీజం వేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో పాత కేసులు తిరగ తోడుతున్నారు. మన ఎమ్మెల్యే అభ్యర్థిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. చురుగ్గా పని చేస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులను ఇరికిస్తున్నారు. ఎవ్వరినీ వదిలి పెట్టకుండా తప్పుడు కేసులు పెడుతున్నారు. కచ్చితంగా ప్రజలు ఇందుకు తగిన గుణపాఠం చెబుతారన్నారు అన్నారు.

# స్కూలు పరీక్షలా! అసెంబ్లీలో ప్రశ్నలా?

>> పరీక్షలు రాయడం, అసెంబ్లీలో సమాధానాలు చెప్పడం రెండూ కష్టమైనవే. అయితే అసెంబ్లీ ప్రశ్నలను ఎదుర్కోవడం పూర్తిగా భిన్నమైనది. ప్రతిపక్షం సభలో లేకపోయినప్పటికీ అధికారపక్షం సభ్యులు ప్రతిపక్షం కంటే కష్టమైన ప్రశ్నలు అడుగుతున్నారని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిరోజూ తనకు మూడు ప్రశ్నలు వచ్చాయని, వాటికి సమాధానం చెప్పేందుకు ఎంతో ప్రిపేర్ కావాల్సి ఉంటుందని తెలిపారు. స్కూల్ డేస్‌లో నేను లాస్ట్ బెంచి అని, తమది అల్లరి బ్యాచ్ అని సరదాగా సమాధానమిచ్చారు. మీకు ఇష్టమైన కొటేషన్ ఏమిటని ఒక విద్యార్థి ప్రశ్నించగా చంద్రబాబుగారి "డేర్ టు డ్రీమ్... స్ట్రైవ్ టు ఎచీవ్" అనే కోట్ తమకు ఇష్టమైనదని చెప్పారు. రాజకీయాల్లో ఎవరి నుంచి స్ఫూర్తి పొందారని మరో విద్యార్థి అడిగిన ప్రశ్నకు లోకేష్ సమాధానమిస్తూ..."ఓటమి తర్వాత 2005లో చంద్రబాబుగారితో హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్‌కి వెళ్లాను... బాబుగారిని చూడగానే ఆయన గౌరవార్థం అక్కడ ఉన్న 5వేలమంది లేచినిలబడ్డారు. రాజకీయాల్లో మంచిచేస్తే ప్రజల్లో గౌరవం ఎల్లప్పుడూ ఉంటుందని తెలుసుకున్నా. ఆనాడే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నా"నని చెప్పారు. మీరు అదృష్టాన్ని నమ్ముతారా, హార్డ్ వర్క్‌ను నమ్ముతారా అన్న ఓ విద్యార్థి ప్రశ్నకు లోకేష్ సమాధానమిస్తూ... జీవితంలో ఉన్నతస్థానాలకు చేరాలంటే కష్టపడి పనిచేయడం ఒక్కటే మార్గం, కష్టానికి ప్రత్యామ్నాయం లేదు, ఈ విషయంలో నేను చంద్రబాబునాయుడు, నరేంద్రమోడీ ద్వారా ప్రేరణ పొందాను. 226రోజుల యువగళం పాదయాత్రలో ఎంతో నేర్చుకున్నానని చెప్పారు. ప్యాసివ్ నుంచి యాక్టివ్ లెర్నింగ్ కు! ఈ సందర్భంగా ప్రభుత్వ స్కూళ్లలో నెలకొన్న సమస్యలపై విద్యార్థుల నుంచి మంత్రి లోకేష్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. శ్రీకాకుళానికి చెందిన రౌతు హారిక మాట్లాడుతూ... వందరోజుల యాక్షన్ ప్లాన్ తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని తెలిపింది. కేవలం విద్యాభ్యాసం మాత్రమే కాకుండా లైబ్రరీకి, ప్రాక్టికల్ లెర్నింగ్ కు సమయం కేటాయించాలని కోరింది. దీనికి లోకేష్ సమాధానమిస్తూ... దీనిపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించాం, ప్యాసివ్ లెర్నింగ్ నుంచి యాక్టివ్ లెర్నింగ్‌కు తేవాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.

పల్నాడు జిల్లా ఒప్పిచర్లకు చెందిన పావని మాట్లాడతూ... తమ గ్రామంలో రోడ్డు సరిగా లేదని, టీచర్లు, విద్యార్థులు స్కూలుకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని చెప్పగా, వెంటనే రోడ్డు వేయించే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. తమ స్కూలులో లైబ్రరీ, ల్యాబ్, ప్లేగ్రౌండ్ సౌకర్యం కల్పించాలని ఆమె కోరింది. సాత్విక అనే విద్యార్థినిమాట్లాడుతూ... తాము మంచి మార్కులు సాధించడానికి డిజిటల్ క్లాస్‌రూమ్స్ బాగా ఉపయోగపడ్డాయని తెలిపింది. ఒకేషనల్ విద్యార్థులకు ల్యాబ్‌ఫెసిలిటీస్ పెంచాలనికోరింది. అనంతపురం జిల్లా అమరాపురానికి చెందిన అక్షిత మాట్లాడుతూ... కెజిబివి స్కూళ్లలో అమలుచేస్తున్న పంచతంత్ర విధానం బాగుందని తెలిపింది. సౌకర్యాలు మెరుగుపర్చి గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించాలని విజ్ఞప్తిచేసింది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు అందించే వెజిటబుల్ బిర్యానీతో పాటు రాగిజావ సరిగా ఉండటం లేదని పలువురు విద్యార్థులు మంత్రి దృష్టికి తెచ్చారు.

## వారం - వర్జ్యం

తేది : 21-05-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
నవమి రా.3.20
శతభిషం సా.6.53
వర్జ్యం రా.9.36-10.17
దు.ఉ.11.39-మ.12.31
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** కొత్తపనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో మీమాటకు విలువ పెరుగుతుంది.

**వృషభం :** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు.

**మిథునం:** కుటుంబంలో వివాదాలు ఏర్పడిన పరిష్కరించుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం:** ముఖ్యమైన పనులలో జాప్యం పెరిగినా నిదానంగా పూర్తిచేస్తారు. ఋణ బాధలు తప్పవు. అనారోగ్య సూచనలు.

**సింహం:** చిరకాల మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కన్య :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు. వాహనయోగం.

**తుల :** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**వృశ్చికం:** భాగస్వామ్య వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. సన్నిహితులు నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రయాణాలు.

**కుంభం:** ఆర్థికపరిస్థితి మెరుగు పడుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దైవదర్శనాలు.

**మీనం :** కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. నూతన వస్తులాభాలు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అన్యమత ఉద్యోగులకు వీఆర్ఎస్

>> వాటికి కనీసం మూతలు ఉండటం లేదనేది కూడా ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో మంగళవారం బోర్డు సమావేశంలో పెద్ద హోటళ్ళు, జనతాక్యాంటీన్లకు టెండర్లు పిలిచి నాణ్యమైన, సరసమైన ధరలకే ఆహారం విక్రయించాలనే బ్రాండెడ్ హోటళ్లకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇక తిరుమలలో విశ్రాంత భవనాల పేర్ల మార్పులో ఇద్దరు దాతలు మాత్రం స్పందించలేదని, దీంతో ఈ విశ్రాంతి గృహాల పేర్లను టిటిడి మార్పుచేయాలని కూడా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్‌నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామాలయంలో భక్తులకు అన్నదానం సేవలను మరింత పెంచాలని నిర్ణయించారు. గుంటూరు జిల్లా తుళ్లూరుమండలం అనంతవరంలోని టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధిచేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 10కోట్ల రూపాయలు కేటాయింపుకు ఆమోదించారు. తమిళనాడులో శ్రీవారి నామావళిని రీమిక్స్‌చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డీడీ నెక్స్ట్‌లెవల్ చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు. తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలకు గాను అదనంగా 71కోట్ల రూపాయలు అందించేందుకు ఆమోదం తెలిపారు. స్విమ్స్‌లో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకం కోసం అనుమతి. ఈ బోర్డు సమావేశంలో బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్‌రెడ్డి, సుచిత్ర ఎల్లా, ప్రశాంతిరెడ్డి, జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎన్.నర్సిరెడ్డి, జ్యోతులనెహ్రూ, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, మునికోటేశ్వరరావు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపి మద్యం కేసులో నిందితుల రిమాండ్ పొడిగింపు

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మద్యం కేసులో నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. జూన్ 3 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విధించిన రిమాండ్ గడువు ఇవాల్టితో ముగియడంతో నిందితులను సీఐడీ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం రిమాండ్‌ను పొడిగించింది. ఈ కేసులో కీలక నిందితుల రాజ్ కెసిరెడ్డి, గోవిందప్ప బాలాజీ, చాణక్య, దిలీప్, సజ్జల శ్రీధర్‌రెడ్డి ధనుంజయ్‌రెడ్డి కృష్ణమోహన్ విజయవాడలోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ రోజు వారు బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు, వారి రిమాండ్‌ను పొడిగించింది.

## వల్లభనేని వంశీ పిటిషన్‌పై విచారణ వచ్చే వారానికి వాయిదా

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కు నిరాశ ఎదురైంది. అక్రమ మైనింగ్ కేసులో తనపై పీటీ వారెంట్ దాఖల చేయకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిగింది. అయితే దిగువ కోర్టు పిటీ వారెంట్ అనుమతించినా వచ్చే గురువారం వారెంట్‌కు అమలు చేయబోమని కోర్టుకి తెలిపింది రాష్ట్ర ప్రభుత్వం ఇక, వల్లభనేని వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ జరగగా వంశీ మోహన్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వచ్చేగురువారానికి వాయిదా వేసింది ఏపీ హైకోర్టు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని రెండు రోజులు కస్టడీ కోరుతూ హనుమాన్ జంక్షన్ పోలీసులు నూజివీడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## 22 నుంచి సిఎం మూడు రోజుల ఢిల్లీ పర్యటన

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి :** ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 22వ తేదీ ఢిల్లీ వెళుతున్నారు. 23న పలువురు కేంద్ర మంత్రులను సిఎం కలవనున్నారు. అదే విధంగా రాష్ట్రానికి పెట్టుబడులకు సంబంధించి పలువురు పారిశ్రామిక వేత్తలతో కూడా సిఎం భేటీ అవ్వనున్నారు. 24వ తేదీ ఉదయం 9.30 గంటలకు భారత్ మండపంలో జరిగే నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం పాల్గొంటారు. అదే రోజు రాత్రి తిరుగు ప్రయాణమై అమరావతి చేరుకుంటారు.

# భూపట్టాల పంపిణి

>> తాండాలుగా ఉన్న గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని తెలిపిన ఆయన, ఎన్నికల సమయంలో ఐదు గ్యారంటీ యోజనల హామీ ఇచ్చి ప్రజలకు ఆచరణలోకి తీసుకొచ్చామన్నారు. ఇప్పుడు భూహక్కును కల్పిస్తూ వారి పేరిట పట్టాలు చేసి 6వ గ్యారంటీని జారీలోకి తెచ్చామన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది సొంతంగా నివసిస్తున్న భూమితోపాటు సాగు చేస్తున్న భూమికి ఎటువంటి యాజమాన్య హక్కులు లేవు. దీనిని గమనించి తాను అటువంటి వారికి హక్కు పత్రాలు ఇవ్వాల్సిందిగా సూచించినట్లు, ఆ మేరకు నేడు 1 లక్ష మందికి పైగా లబ్ధిదారులకు భూ యాజమాన్య హక్కు పత్రాలు ఇస్తూ 2 వేల తాండాలు, హట్టి ప్రాంతాలను రెవెన్యూ గ్రామాలుగా అధికారికంగా ప్రకటించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో దేశంలో కర్ణాటకలో ఎవరూ కూడా భూహక్కు లేని వారు ఉండకూడని రాష్ట్రంగా కర్ణాటక ఉంటుందని, ప్రతిఒక్కరికీ వారు అనుభవిస్తున్న భూ యాజమాన్యహక్కు దక్కాలని చెప్పారు. రాష్ట్రంలో ఇంకా 500 రెవెన్యూ గ్రామాలను ప్రకటించాల్సి ఉన్నదని తెలిపిన ఆయన, 50 వేల మందికి భూహక్కు పత్రాలను ఇవ్వాల్సి ఉన్నదన్నారు. వచ్చే ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని తాను ప్రభుత్వానికి చెప్పినట్లు రాహుల్‌గాంధీ తెలిపారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ భూమి హక్కుల పత్రాలు లేకుండా ఉండకూడదన్నదే మా ఉద్దేశ్యం మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ ఆశయం మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ గ్యారంటీని 6వ గ్యారంటీగా జారీలోకి తెచ్చింద.

ఈ గ్యారంటీ జనపర, నిరుపేదలపరంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు తాము ఐదు గ్యారంటీలను ప్రకటించినప్పుడు ప్రధాని మోదీతోపాటు బీజేపీ నాయకులు ఈ గ్యారంటీలను జారీలోకి తీసుకురావడం కుదరదని ఎద్దేవా చేశారని, అయితే ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఐదు గ్యారంటీలను విజయవంతంగా జారీ చేశామన్నారు. లక్షలాది కుటుంబాల మహిళలఖాతాలకు గృహలక్ష్మిద్వారా డబ్బు జమ చేస్తూ మాట నిలబెట్టుకున్నా మన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జనపర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, అందుకు ఉదాహరణ 5 గ్యారంటీ యోజనలు జారీ చేస్తుండడమేనని ప్రజల హర్షధ్వానాల మధ్య చెప్పారు. బిజెపి వారు పదేపదే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తుండడం హాబీగా పెట్టుకున్నారని, ప్రభుత్వం చేస్తున్న పనులను చూసి మాట్లాడాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, డీసీఎం డి.కె.శివకుమార్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

21-05Pg3exHMNWJQEPRL.qxd:21-05Pg3exHMNWJQEPRL.qxd 01/01/01 7:41 AM Page 1



## బందరు చరిత్ర తిరగరాసేలా
# మసులా బీచ్ ఫెస్టివల్
### ఏర్పాట్లపై చర్చించిన మంత్రులు కందుల దుర్గేష్, కొల్లురవీంద్ర


మసుల బీచ్ ఫెస్టివల్‌పై సమీక్షిస్తున్న మంత్రులు దుర్గేష్,రవీంద్ర

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** బందరు చరిత్ర తిరగ రాసేలా మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్ నిర్ణయించారు. కేబినెట్ సమావేశం అనంతరం మంగళవారం వెలగపూడి సెక్రటేరియట్ 2వ బ్లాక్ లోని మంత్రి కందుల దుర్గేష్ పేషీలో ఈ మేరకు ఇరువురు మంత్రులు భేటీ అయ్యారు. జూన్ 68 తేదీల్లో మచిలీపట్నం మంగినపూడి మసూల బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై చర్చించారు. మంగినపూడి బీచ్ అత్యద్భుతమైన పర్యాటక ప్రాంతమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా లక్షలాది సంఖ్యలో తరలివచ్చే సందర్శకులకు తెలిసేలా రాష్ట్ర పర్యాటక రంగానికి తగిన ప్రాచుర్యం కల్పించాలని సూచించారు. అంతేగాక రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించాలని కోరారు. ఇసుక తిన్నెలపై ఉత్సవాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

ఉత్సవాల్లో ఏర్పాటు చేసే స్వాగత తోరణాలు మొదలుకొని సాంస్కృతిక, కళా వైభవాన్ని స్ఫురించేలా, పర్యాటక ప్రాంతాల గొప్పతనం తెలిసేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. మసుల బీచ్ ఫెస్టివల్ కు తరలివచ్చే లక్షలాది ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవాల రేఖా చిత్రపటాన్ని పరిశీలించిన మంత్రి దుర్గేష్ ఉత్సవాల్లో ఏర్పాటు చేసే బందోబస్తు, ప్రదర్శనశాలలు, ఫుడ్ కోర్టులు, పార్కింగ్, క్రీడల నిర్వహణ, పారిశుద్ధం, జనసమూహ నిర్వహణ, తాగునీటి ఏర్పాట్లు, వైద్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై తనదైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా మసుల ఫెస్టివల్ కు సంబంధించిన ప్రోమో వీడియోలను మంత్రి దుర్గేష్ ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర సమాధానమిస్తూ ఉత్సవాల్లో భాగంగా పర్యాటకుల వినోదం కోసం జాతీయ క్రీడలైన బీచ్ కబడ్డీ, కయాకింగ్ జల క్రీడలు, హెలీ రైడ్, పారా గ్లైడింగ్, నీటిలో గ్లైడింగ్, స్కూబా డైవింగ్, స్పీడ్ బోట్లు తదితర సాహస క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ సినీ కళకారులు, సంగీత దర్శకులతో సంగీత విభావరి నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా బీచ్ ఫెస్టివల్ విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ సూచించనట్లుగా పర్యాటక రంగానికి తగిన ప్రాచుర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ పాల్గొన్నారు.

## క్రీడల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టాలి
### శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు కర్రసాము క్రీడాకారులకు అభినందన

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రీడల్లో ఏపీని అగ్రగామిగా నిలబెట్టి రాష్ట్ర దేశ కీర్తి ప్రతిష్టతలను ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో సిలంబమ్ క్రీడాకారులు శాప్ ఛైర్మన్ ను సోమవరాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిలంబమ్ క్రీడాకారులు మాట్లాడుతూ ఏలూరు జిల్లా కలిదిండిలో ఏప్రిల్ 30వ తేదీన జరిగిన స్టేట్ లెవల్ సిలంబమ్ ఛాంపియన్‌షిప్ -2025 పోటీల్లో వారు సాధించిన విజయాలు పతకాల గురించి శాప్ ఛైర్మన్ కు వివరించారు. ఎస్వీఆర్కే ఇండియన్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 73 గోల్డ్ మెడల్స్ 16 సిల్వర్ మెడల్స్ 5 బ్రాంజ్ మెడల్‌స సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా వారిని శాప్ ఛైర్మన్ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని తమకు కావాల్సిన క్రీడాసదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అత్యధిక పతకాలు సాధించి రాష్ట్ర దేశ గౌరవాన్ని పెంచాలని ప్రోత్సహించారు.

## రాష్ట్రం మీదుగా తిరిగే భువనేశ్వర్- యశ్వంతపూర్ ప్రత్యేక రైళ్లు జూన్ వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,మే 20,ప్రభాతవార్త** రాష్ట్రం మీదుగా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్-భువనేశ్వర్ మద్య తిరుగుతున్న వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జూన్ ఆఖరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. భువనేశ్వర్ నుంచి యశ్వంత్‌పూర్‌కు ప్రతి శనివారం బయలుదేరే నెంబర్ 02811ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 24నుంచి జూన్ 28వరకు, యశ్వంత్‌పూర్ నుంచి భువనేశ్వర్‌కు ప్రతి సోమవారం బయలుదేరే నెంబర్ 02812ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 26నుంచి జూన్ 30వరకు పొడిగించామన్నారు. ఈ రైళ్లు మార్గమద్యలో ఖుర్దారోడ్, బర్హాంపూర్, పలస, శ్రీకాకుళం, విజయనగరం, కొత్తవలన, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, గంటూరు, నరసరావు పేట, మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల, డోన్, ధర్మవరం, సత్య సాయి ప్రశాంతి నిలయం (పుట్టపర్తి), హిందూపురం స్టేషన్లలో నిలుస్తాయి.

## ప్రజల జీవితాల్ని మెరుగుపరచాలనే మీ తపన స్ఫూర్తిదాయకం..
### సిఎం చంద్రబాబును ప్రశంసించిన బిల్‌గేట్స్


బిల్ గేట్స్, చంద్రబాబు

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధునిక సాంకేతికత, నూతన ఆవిష్కరణలతో పాలనను బలోపేతం చేయడం, మరింత సులభతరంగా సేవల్ని అందించి ప్రజా జీవితాల్ని మెరుగుపరచాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు తపన, కృషి స్ఫూర్తిదాయకమని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, బిల్-మెలిందా గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ కొనియాడారు. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన వంటికీలక రంగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి గేట్స్ ఫౌండేషన్ - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌కే కాక భారత్‌తో పాటు అల్ప, మధ్యాదాయ దేశాలకూ ఎంతో ఉపయోగపడనుందని తెలిపారు. కీలక రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తక్కువ ఖర్చుతో పరిష్కార మార్గాలు కనుగొనడం ప్రజలకు సులభతరంగా ఆయా సేవల్ని అందించే అంశాలపై ఈ ఏడాది మార్చిలో ఢిల్లీ వేదికగా చంద్రబాబు బిల్‌గేట్స్ చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇరువురి సమక్షంలో పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని చంద్రబాబును అభినందిస్తూ ఇటీవల గేట్స్ లేఖ రాశారు. నేను భవిష్యత్తులో ఏపీలో పర్యటించే నాటికి ఈ ఒప్పందంలోని లక్ష్యాన్ని సాధించడం ద్వారా అద్భుతమైన ఫలితాలు సాకారం కానున్నాయి. మెడ్‌టెక్ మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి మీరు చూపుతున్న శ్రద్ధతో పేదలకు అత్యంత నాణ్యత కలిగిన పరికరాలు తక్కువ ధరకు అందుబాటులోకి వస్తాయి అని లేఖలో బిల్ గేట్స్ పేర్కొన్నారు.

హెల్త్ రికార్డుల డిజిట లైజేషన్ ఏఐ అసిస్టెడ్ క్లినికల్ డెసిషన్ మేకింగ్ ద్వారా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయాలనే మీ ప్రణాళికలు ఆసక్తికరంగా అనిపించాయి. గర్భిణులు, చిన్నపిల్లల ఆరోగ్య రక్షణకు మల్టీ పుల్ మైక్రోన్యూట్రియంట్ సప్లిమెంట్లు తదితరాలు ఎలా ఉపయోగపడతాయో చర్చించినందుకు ఆనందంగా ఉంది.

## మనలోని పౌరుషం.. వీరత్వం ఎన్నటికీ చల్లబడకూడదు
### - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్


కీరవాణిని సత్కరిస్తున్న పవన్ కల్యాణ్

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** మనలోని పౌరుషం.. వీరత్వం ఎన్నటికీ చల్లబడిపోకూడదు అని డి.సీ.ఎం,పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అన్నారు.ప్రతి ఒక్కరినీ తట్టిలేపే సలసల మరిగే నీలోని రక్తమే. అని పాటకు సంగీత, సాహిత్యాలతో ప్రాణం పోశారు సంగీత దర్శకుడు కీరవాణి అంటూ ప్రశంసించారు. పవన్ కళ్యాణ్‌మనలోని పౌరుషం.. వీరత్వం ఎన్నటికీ చల్లబడిపోకూడదు అని ప్రతి ఒక్కరినీ తట్టిలేపే సలసల మరిగే నీలోని రక్తమే.., అని పాటకు సంగీత, సాహిత్యాలతో ప్రాణం పోశారు సంగీత దర్శకుడుకీరవాణి. "హరిహర వీరమల్లు" చిత్రంలో ఈ గీతం వినిపిస్తుంది.ఈ చిత్రానికి సంగీతాన్ని అందించిన కీరవాణిని పవన్ కల్యాణ్ స్వయంగా అభినందించి,సత్కరించారు.ఈ సందర్భంగా పవన్ ఉద్వేగంగా మాట్లాడుతూ నేటి పరిస్థితులలో మనందరిలో వీరత్వం చేవజారిపోకూడదని పాటలో చర్నాకోలతో చెప్పినట్లు అనిపించింది. ఈ పాటను 21వ తేదీన అందరికీ విన్పించబోతున్నామన్నారు. హరిహర వీరమల్లు చిత్రానికి కీరవాణి అందించిన నేపథ్య సంగీతం ఆ చిత్ర కథలోని భావోద్వేగాలను శిఖర స్థాయికి తీసుకువెళ్తాయి. ఈ సినిమా కోసం ఎంత తపన చెంది స్వరాలు అందించారో స్వయంగా చూశాను. 'వీరమల్లుకి ప్రాణం పోశారు అంటే అతిశయోక్తి కాదు.' మొదటిసారి మీతో చేస్తున్నాను అంటే... అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. అందుకు తగ్గట్టు ఉండాలి కద్గా అనడం కీరవాణి లో అంకిత భావాన్ని తెలియచేస్తోంది. ఈ రోజు ఉదయం ఆస్కార్ గ్రహీత కీరవాణి గారిని కలిసి సాగించిన సంభాషణ ఎంతో సంతోషాన్ని కలిగించింది. సంగీత దర్శకులు చక్రవర్తి గారి దగ్గర శిష్యరికం నుంచి సరస్వతి పుత్రులైన వేటూరి సుందర రామమూర్తి సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి వరకూ తనకున్న అనుబంధాన్ని, సంగీత సాహిత్యాల గురించి చెబుతుంటే సమయం తెలియలేదు. కీరవాణి దగ్గర ఉన్న వయొలిన్లు చూసి వాటి గురించి మాట్లాడుకొంటున్నప్పుడు నేను వయొలిన్ నేర్చుకోవడం, జంట స్వరాల వరకూ నేర్చుకొని వదిలేయడం గుర్తు చేసుకున్నాను. చిదంబరనాథన్ గారు ఇచ్చిన వయొలిన్ ను ఎంత భద్రంగా దాచుకున్నారో చూపించారు కీరవాణి గారు. తెలుగు కథలను ప్రేమించే కీరవాణి గారు తనకు అమితంగా నచ్చిన 32 కథలను ఒక సంకలనంలా చేసుకొన్నారు. వాటిని నాకు బహూకరించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. అందులో కీరవాణి రాసిన రెండు కథలు కూడా ఉన్నాయి. ఆయన సరిగమలతో బాణీలు కూర్చే కూర్పరి మాత్రమే కాదు... చక్కటి తెలుగు పదాలతో గీతాలు అల్లగల నేర్పరి కూడా. తన పదాలతో గీత రచయితలకు మార్గం వేస్తారు.

## గ్రామాల్లో అభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు సహకరించాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


గిరిజన కాలనీలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుధీర్‌రెడ్డి

**తొట్టంబేడు,మే 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గం పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందిందని గ్రామాల అభివృద్ధికి ప్రతి పారిశ్రామిక వెత్త సహకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తొట్టంబేడు మండలంలోని పెద్ద కన్నలి పంచాయతీ గిరిజన కాలనీలో గ్రీన్‌ప్యానెల్ సిఎస్ఆర్ ఫండ్స్‌లో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసారు. దీనిని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏర్పాట్లను కన్నలి ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షించారు. సభలో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయన్నారు. తొట్టంబేడు మండలం చెన్నై-విశాఖ కారిడార్‌లో ఉండటంతో పరిశ్రమలు వెలుస్తున్నాయన్నారు. పరిశ్రామిక వెత్తలు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్నారు. అలాగే ఆయా పరిశ్రమల పరిసరాల్లో ఉన్న నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమలు వస్తునాయంటే గ్రామాల్లోని ప్రజలు తమ పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తా యనే ఆశతో ఉంటా రన్నారు. కాబట్టి పారిశ్రామిక వెత్తలు సాధ్యమైనంత వరకు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. శ్రీకాళహస్తి నియోజక వర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చి దిద్దుటకు 2014-2019 అప్పటి శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రణాళిక రూపొందించి భారీ పరిశ్రమలను సాధించారన్నారు. ఏర్పేడు మండలంలోని విమానాశ్రయం సమీపంలోనూ, తొట్టంబేడు మండలంలోని కన్నలి, లింగమనాడుపల్లి పరిసరాల్లో భారీ పరిశ్రమలు వెలిసాయన్నారు. పరిశ్రమలకు అవసరమైన నీరు, విద్యుత్ సరఫరాతోపాటు పారిశ్రామి వెత్తలకు చేయూత ఇవ్వటంలో డిక్సన్, టిసిఎల్, గ్రీన్ ప్యానల్, విద్యాపరంగా ఏర్పేడులో కేంద్ర విద్యాసంస్థలు ఐఐటి, ఐసర్‌లను సాధించి నియోజకవర్గ పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసారన్నారు. గ్రీన్ ప్యానెల్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి పారిశ్రామిక వేత్త గ్రామాల అభివృద్ధికి సహకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు.1994లో ఇక్కడ మొట్టమొదటి భారీ పరిశ్రమను గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద 'లాంకో పరిశ్రమ'తో శ్రీకారం చుట్టారన్నారు.

## నాజిల్ మొరాయించడంతోనే రాకెట్ ఫెయిలైందా?
### రాకెట్ విఫలమవడానికి కారణాలను అన్వేషిస్తున్న ఇస్రో

**శ్రీహరికోట (తడ), మే 20 ప్రభాతవార్త** శ్రీహరికోట నుంచి ఈ నెల 18న ప్రయోగించిన పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ విఫలమవడానికి కారణాలను అన్వేషిస్తూనే ఉన్నారు. ప్రత్యేకించి మూడవ దశలో నాజిల్ పనితీరుపై కొందరిలో అనుమానాలున్నాయి. రెండు దశలు సక్రమంగా జరిగిన తర్వాత మూడవ దశలో తలెత్తిన సాంకేతిక అవరోధం వల్ల రాకెట్ ఫెయిలైందని ఇస్రో గుర్తించింది. అయితే ఈ మూడవ దశలోని నాజిల్ పనితీరు మీద కొన్ని సందేహాలున్నాయి. రెండవ దశ నుంచి మూడవ దశకు ఘన ఇంధన మోటారు అంటుకునే సమయంలో కొంత ఆలస్యమైనా రాకెట్ వడివడిగా దూసుకెళ్లలేదు. ఘన ఇంధన కర్మాగారం (స్ప్రాబ్) శ్రీహరికోటలోనే నిర్మించి ఉన్నారు. ఇప్పటికి ఎన్నో ఘన ఇందన మోటార్లను తయారు చేసి విజయవంతంగా పిఎస్ఎల్‌వి రాకెట్లను ప్రయోగించి ఉన్నారు. ఘన ఇంధన దశ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉండటమే కాకుండా శ్రీహరికోటలోని స్ప్రాబ్‌లో పనిచేసే వారు ఎక్కువగానే ఉంటారు. అత్యంత క్లిష్టమైన ఈ దశలో ఇంధనం సమకూర్చడానికి శాస్త్రవేత్తలు అలవాటుగా మార్చుకున్నారు. షార్‌లోని ఘన ఇంధన కర్మాగారం వలన ఆ మోటార్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఇటువంటి అత్యంత కీలకమైన స్ప్రాబ్‌లో ప్రస్తుతం పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్‌లోని ఘన ఇంధన దశను కూడా ఏర్పాటు చేశారు. ఈ దశ సక్రమంగా పనిచేయకపోవడమే రాకెల్ ఫెయిలవడానికి ఒక కారణం కాగా, ఆ దశలోని నాజిల్ సరిగ్గా అంటుకోకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషిస్తున్నారు. అయితే ఇస్రో శాస్త్రవేత్తలు దీన్ని ఇప్పటికీ ధ్రువీకరించలేదు.

## తిరువూరులో నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక వాయిదా

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** తిరువూరులో పట్టణంలో నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఉద్రిక్తతతో కూడిన వాతావరణం నెలకొంది.ఈ క్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక మరో సారి వాయిదా పడింది. టీడీపీ నాయకులను, కార్యకర్తల మధ్య నగర పంచాయతీ ఎన్ని వ్యవహారంలో వివాదం చోటు చేసుకుంది. వైకాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ .ఎంఎల్‌సీ అరుణ్‌కుమార్‌లు తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నికను అడ్డుకునేందుకు అనుచరగణంతో విజయవాడ నుంచి తిరువూరు వచ్చారంటూ టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తూ వారిని అడ్డుకునే ప్రయత్నం చేసారు. వారిని వైకాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రెండు పక్షాల నాయకులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకుంది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. రేపూడి వద్ద దేవినేని అవినాష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మైలవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే పోలీస్‌స్టేషన్‌కు తరలించే క్రమంలో అవినాష్‌పై టీడీపీ కార్యకర్తలు దాడికి యత్నించారనే అభియోగం.ఈ క్రమంలో పోలీసులు దేవినేని అవినాష్, మొండితోక అరుణ్‌కుమార్‌లను పోలీసుస్టేషన్ తీసుకుని వెళ్ళారు.తరువాత వారిని విజయవాడకు పంపించేసారు.ఈ క్రమలోతిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడం అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో కే.మాధురి ప్రకటించారు.

# తిరుమల సమాచారం

## టిటిడి ఆలయాల అభివృద్ధికి సమగ్ర బృహత్ ప్రణాళిక
### -తిరుమల ఆలయ భద్రతకు యాంటీడ్రోన్‌టెక్నాలజీ - టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** సనాతన హిందూ ధర్మాన్ని విస్తృతంగా వ్యాప్తిచేసేందుకు, ప్రజల్లో ముఖ్యంగా యువతలో ఆధ్యాత్మిక భక్తిభావం పెంపొందించేలా రాష్ట్రంలోని పలు టిటిడి ఆలయాల అభివృద్ధికి సమగ్ర బృహత్ ప్రణాళిక తయారుచేస్తున్నట్లు టిటిడి ఇఒ జె.శ్యామలరావు వెల్లడించారు. ఇందుకు నిపుణులైన ఆర్కిటెక్‌లనుండి సాంకేతిక,ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన ధర్మకర్తలమండలి సమావేశంలో చర్చించి ఆమోదించిన వివరాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి మీడియాకు వెల్లడించారు. టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయం, రాష్ట్రరాజధాని అమరావతిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, తిరుపతి జిల్లాలోని నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, కడపజిల్లా ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికోసం సమగ్ర బృహత్ ప్రణాళిక తయారుచేసేందుకు ప్రతిపాదనలు ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించనున్నారు. తిరుమల క్షేత్రంలో మరోప్రసిద్ధ ఆలయం బాల ఆంజనేయస్వామి, పాపవినాశనం పుణ్యతీర్థాల సందర్శనకు వస్తున్న భక్తుల సంఖ్య పెరగడంతో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌళిక సదుపాయాలు మరింత పెంచనున్నారు. ఇటీవల భారత్, పాక్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల నడుమ ప్రపంచ ప్రసిద్ధ హిందూ ఆలయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి మరింత భద్రత పెంచాలని నిర్ణయించారు.

## అంజనాద్రిలో 22న హనుమజ్జయంతి ఉత్సవాలు
### - ఆకాశగంగలోని బాలాంజనేయునికి ప్రత్యేక అభిషేకం



**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని తిరుమల ఆకాశగంగ ప్రాంతంలో మరో దివ్యపుణ్యక్షేత్రం బాలాంజనేయస్వామికి ఈనెల 22న హనుమజ్జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. బాల ఆంజనేయస్వామి పుట్టుక ఆకాశగంగ ప్రాంతంలోనే అని చారిత్రక ఆధారాలతో ,పురాణాల్లో పేర్కొనబడింది. తిరుమల తిరుపతి దేవస్థానం కూడా బాల ఆంజనేయస్వామి జన్మస్థలం గుర్తించి ఐదు సంవత్సరాలుగా ఇక్కడే జయంతి ఉత్సవాలు నిర్వహిస్తోంది. 22వతేదీ గురువారం రోజు పలు రకాల విశేష ఉత్సవాలు, ప్రత్యేక అభిషేకాలు జరిపించనున్నారు. అంజనాద్రిలోని ఆకాశగంగ ఆలయం, జపాలి తీర్థంలోని హనుమాన్ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఆకాశగంగలోని అంజనాద్రి ఆలయం, జపాలి ఆంజనేయాస్వామి ఆలయాలకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. వేదపండితులు ఆంజనేయసహస్రనామార్చన, మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి, అంజనాదేవికి అభిషేకం నిర్వహించనున్నారు. రేపు ఉదయం 11గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు తిరుమల నుండి 7వమైలుకు ఉచిత రవాణా సౌకర్యం,తిరిగి తిరుమల చేరడానికి కూడా కల్పిస్తోంది. ఆరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంజనాద్రిని టిటిడి సర్వాంగసుందరంగా ముస్తాబుచేస్తోంది.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి



**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని తెలంగాణ ఎంఎల్‌సి దయానందగుప్త, సినీనటి, మిస్‌వరల్డ్ మానసవారణాసి, ఏపి జైళ్ళశాఖ డిజి అంనీకుమార్ దంపతులు మంగళావారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. దేవుడ్ని దర్శించుకుంటే మనసు ఎంతో ఉల్లాసంగా ఉంటుందన్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీగోశాలకు 10 జంబో ఎయిర్‌కూలర్లు



**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని టిటిడి ఎస్వీగోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైన జంబో ఎయిర్ కూలర్లను అందించారు. మంగళవారం ఉదయం టిటిడి బోర్డుసభ్యుడు రంగశ్రీ ,జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, హేమకుమార్, మనోజ్‌తో కలసి ఈ ఎయిర్‌కూలర్లను అందించారు. అక్కడే ఉన్న అగరబత్తీల తయారీ కేంద్రాన్ని గోశాలను పరిశీలించారు. గోవులకు చల్లదనం కోసం వీటిని అందించడం జరిగిందన్నారు.

## వైఖానస ఆగమ సలహా కమిటీ నియామకం

**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆలయంలో నిత్యకైంకర్యాలు, సేవలు నిర్వహించేందుకు వీలుగా నూతన వైఖానస ఆగమ సలహాకమిటీని మంగళవారం టిటిడి బోర్డు నియమించింది. ఐదుగురు సభ్యులతో కూడిన కొత్త వైఖానస సలహా కమిటీలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు ఏఎస్ కృష్ణ శేషాచలందీక్షితులు, ఎస్వీ వేదవిశ్వవిద్యాలయం వైఖానసం ఆగమవిభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పరాశరం భవనారాయణాచార్యులు, చెన్నైకి చెందిన పికె వరదన్‌భట్టాచార్యార్, గోవిందరాజస్వామి ఆలయంలోని సంభావన అర్చకుడు ఏ.అనంతశయనదీక్షితులు, మాజీ అర్చకుడు ఏ.ఖద్రీనరసింహాచార్యులు నూతన ఆగమ సలహాకమిటీలో సభ్యులు.

## పిడుగుపాటుకు ఆవులు మృతి



**శ్రీరంగరాజపురం, మే 20 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లి పంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట గ్రామ పరిసరాల్లో మంగళవారం పిడుగు పడటంతో రెండు ఆవులు మృతి చెందాయి. కృష్ణమూర్తి అనే రైతుకు చెందిన ఆవులపై పిడుగు పడటంతో రెండు ఆవులు ఒకేసారి మృతి చెందాయి. శ్రీరంగరాజ పురం మండలంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. పొలంకు సమీపంలోని చింతచెట్టుకు ఆవును కట్టి రైతు కృష్ణమూర్తి ప్రక్కనే వున్న షెడ్డులోకి వెళ్ళాడు. కొంత సేపటికి పెద్ద శబ్దంతో ఆ స్థలంలో పిడుగు పడటంతో రెండు ఆవులు ఒకేసారి మృత్యువాత పడ్డాయి. కృష్ణమూర్తి సైతం అక్కడిక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. కొద్దిసేపు అనంతరం పరిసరాల్లో వున్న ప్రజల అరుపులతో మెలకువలోకి వచ్చిన కృష్ణమూర్తి తన పాడి ఆవులు మృతి చెందడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఆవులతో పాలు పోసి జీవనాధారం చేస్తున్న తమకు అన్యాయం జరిగిందని రైతు భార్య తులసీ ఆవేదన వ్యక్తం చేసింది. కృష్ణమూర్తిని చికిత్స నిమిత్తం ఆరిమాకులపల్లి పిహెచ్‌సికి తీసుకెళ్ళి చికిత్స అందించారు.

వార్త

జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం మాత్రమే. ఏ సమస్యలూ లేని జీవితం ఉండదు.

-రస్కిన్

# అ 'మర్యాద'కు అంతేది?


ఏలినవారు ఎలా ఉన్నా అధికార దర్పం అను భవిస్తూ ప్రభుత్వ మర్యాదలు పాటించాల్సిన వారు ప్రోటోకాల్స్ పాటించడానికి కూడా ఇష్టపడుట లేదు. సాధారణ జనజీవనంలో పెద్దల్ని గౌరవించని వారిని పెద్దంతర చిన్నంతరం తెలియ కుండా పిల్లచేష్టలు చేస్తున్నారని తట్టిపడేస్తాం. మరి కానీ సాక్షాత్తూ ఈ దేశ అత్యున్నత సర్వోన్నత న్యాయస్థానా ధిపతి ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌కి ప్రోటో కాల్ పాటించడానికి మహారాష్ట్ర డిజిపి కానీ, సిఎస్‌గానీ ముంబై పోలీసు కమిషనర్ కానీ హాజరుకాలేదు. దాంతో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారిగా శ్రీ బి.ఆర్ గవాయ్ సొంత రాష్ట్రం మహారాష్ట్రకు వెళ్లారు. మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఆ సందర్భంగా జరిగిన సభలో ఈ ప్రస్తా వన తెచ్చారు. న్యాయమూర్తులకు ప్రోటోకాల్ విషయం లో 'అమర్యాద' కలిగితే సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికా రాలు కల్పిస్తున్న ఆర్టికల్ 142 కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఈ అధికరణం కింద ఏ వ్యక్తినైనా తమ ముందు హాజరు కమ్మని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇవ్వచ్చు. ప్రజాస్వామ్యంలో మూడు ప్రధాన స్తంభాలుగా వ్యవహరించే న్యాయవ్యవస్థ, శాసనసభా, కార్యనిర్వాహక వ్యవస్థలు సమాన గౌరవాలు పొందుతున్నప్పుడు అందు లో భాగస్వాములైన వారు ఒకరినొకరు పరస్పరంగౌరవిం చుకోవాలని అన్నారు. ప్రతి రాజ్యాంగ వ్యవస్థ, సమాన మైన మరొక సంస్థకు ఇచ్చే గౌరవానికి సంబంధించిన విషయమే 'ప్రోటోకాల్' అని ఆయన వివరించారు. వారె వరైనా అలాంటి ప్రోటోకాల్ విషయంలో భిన్నమైన అభి ప్రాయం ఉంటే సముచితం కాదని భావిస్తే పునరాలోచిం చుకోవాలని జస్టిస్ గవాయ్ కోరారు. చీఫ్ జస్టిస్‌ఆగ్రహం చవిచూశాక దాని తీవ్రత మరోదశకు చేరకుండా సిజెను ఆ ముగ్గురు ఉన్నతాధికారులు కలిసి వెళ్లారు. సాధార ణంగా పాలకుల కనుసన్నల్లో నడుస్తూ తమకు వారి నుండి కావల్సినంత రాజ్యాంగ భద్రత ఉన్నదని భావిం చినపుడో, తమపై అధికారులను రక్షణ కల్పించే 'బాస్' లున్నారని భావించినప్పుడో పై అధికారులను వారి ఆధి పత్యాన్ని పక్కన బెట్టడం సహజంగా జరుగుతుంది.కొన్ని ప్రాంతాల్లో ఇలాంటివి గతంలో చూశాం. అధికారులు పాలకుల ఆధిపత్యాన్ని అంగీకరించలేనప్పుడు అలాంటివి జరుగుతుంటాయి. ఇవన్నీ ఆయా ప్రాంతాల్లో నడుస్తున్న రాజకీయాలు. రాజకీయ పార్టీల అనుబంధాల నేపథ్యం లో బేధాభిప్రాయాలు బయటపడ్తుంటాయి.రాజకీయవేత్తల ఆధిపత్యాన్ని సహించనప్పుడు కొందరు అధికారులువారికి తలొగ్గేందుకు ఇష్టపడరు. వ్యక్తిగతంగా ఎవరు ఎవరితో నైనా విభేదించవచ్చు. కాని రాజ్యాంగ సంస్థలకు చెందిన వారి మధ్య ఎలాంటి మర్యాదల లోపం జరుగకూడదు. అలా జరిగినప్పుడు ఆయా వ్యవస్థల మధ్య జరిగే సంఘ ర్షణలు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తాయి. రాజ్యాంగ వ్యవస్థలో ముఖ్యమైన మూడు వ్యవస్థలూ సమాన గౌర వాలు ఇచ్చిపుచ్చుకోవాలి. ఇలాంటివి తాను పెద్దగా పట్టిం చుకోనని అయినా చెప్పవలసిన చోట, చెప్పదగిన విష యాలు చెప్పాల్సివస్తుందని ప్రస్తావించారు. మహారాష్ట్రకు చెందిన తాను దేశంలోని న్యాయవ్యవస్థలో అత్యున్నత హోదా పొంది తొలిసారి స్వరాష్ట్రానికి వచ్చినప్పుడు సాటి రాజ్యాంగ సంస్థల అధికార్లు ప్రోటోకాల్ పాటించని విష యంలో పునరాలోచన చేసుకోవాలని కోరారంటే వారిని ప్రధాన న్యాయమూర్తి ఎంత సున్నితంగా మందలించారో అర్థమవుతుంది. ఇలా ఒక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి విషయంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. శాసనసభ్యులు, మండల ప్రజాపరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల విషయంలో విపక్ష శాసన సభ్యుల విష యంలో కూడా ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతుండ డం తరువాత అవి సర్దుకుపోవడం మామూలే. అయితే గత కొంతకాలం తెలుగు రాష్ట్రాలలో రాజ్యాంగ వ్యవస్థ లోనే అంతర్గతంగా కొన్ని విభిన్న హోదాలున్న వారి మధ్య ఇలాంటి వివాదాలు చెలరేగి చాలాకాలం ముఖా ముఖాలు చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. సాటి వ్యవస్థ అధినేతలు వారిని సమాన గౌరవంతో చూడలేకపోవడం అహంభావ ఛాయలు కూడా ఇలాంటి చేదు అనుభవా లకు దారితీస్తాయి. తెలంగాణ గవర్నర్ తమిళిసై వచ్చాక తెలంగాణ ప్రభుత్వం ఆమె పట్ల ఎంతో విభిన్న వైఖరితో ప్రవర్తించింది. పలుసార్లు ఆమె అవమానానికి గురయ్యా రు. కాగా ఎంతో సంయమనంతో వ్యవహరించేవారు. చివరికి తెలంగాణ గవర్నర్ తమిళిసై సుందరరాజన్ పట్ల అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి సరైన గౌరవం చూపలే దనే చేదు అనుభవాల గురించి అందరికీ తెలిసిందే. 2024 జనవరిలో మెదక్ జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ అధి కారంలో ఉండగా కాంగ్రెస్ నేతలను వేదిక మీద కూర్చో నివ్వకపోవడం వివాదాస్పదమైంది. రాజ్యాంగ సంస్థల మధ్య ఇటువంటి పరువు ప్రతిష్ఠల సమస్య ఏర్పడడం మంచిది కాదు.తెలుగునాట చీటికిమాటికి వచ్చే ప్రోటో కాల్ స్పర్ధలన్నీ స్థానిక రాజకీయ విభేదాలకు సంబంధిం చినవే కనుక కాలక్రమంలో వీరు వారైనా, వారువీరైనా ఒకటైపోతారు.కాగా మొన్న ప్రధానన్యాయమూర్తి విష యంలో జరిగిన ఉల్లంఘన అసలుసిసలు సమస్య. అధి కారులు ప్రోటోకాల్ విషయంలో విశాలదృక్పథంతో ఆలో చిస్తే అసలు సమస్యే ఉండదు.అందుకే రాజ్యాంగ పదవు ల్లో ఉన్నవారు తాము ఇతరుల పట్ల ఎంత మర్యాదగా ప్రవర్తించాల్సి ఉంటుందో తెలుసుకోవాలి. దీనివలన ప్రజల్లో చులకనవడం తప్ప వేరే ఏ విధమైన గౌరవ ప్రతిష్ఠలు కలుగవని గుర్తుంచుకోవాలి.

అదృష్టాన్ని నమ్ముకోవడం కంటే ధైర్యాన్ని నమ్ముకోవడం మంచిది. అదృష్టం ఏ వ్యక్తినీ తెలివిమంతుడ్ని చేయలేదు.



సెనెకా

ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా, ఎప్పటికీ అతనిని విడువని నీడలాగా ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.



గౌతమబుద్ధుడు

# ప్రజావాక్కు



## ఆన్‌లైన్ గేమ్స్‌పై నిషేధం విధించాలి

రాష్ట్రంలో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్,బెట్టింగ్‌లపై నిషేధం ఉన్న ప్పటికీ చాలా మంది విరివిగా ఆడుతున్నారు. రాష్ట్రంలో నిషేధించిన యాప్‌లను విపిఎన్ సాయంతో లొకేషన్ మారుస్తూ వినియోగిస్తున్నారు. ఈ ఆన్‌లైన్ గేమ్స్ వల్ల యువత డబ్బును కోల్పోవడమే కాకుండా తమ విలువైన ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలి.

- ఎం.ముత్యం రెడ్డి, అందెగ్రామం, సిద్ధిపేటజిల్లా

## అందాల పోటీలు రాష్ట్రఖ్యాతిని పెంచాయి

పన్నెండురాసులలో నూటఎనిమిది పాదాలున్నట్లుగా అందా ల పోటీకి నూట ఎనిమిది దేశాల అందగత్తెలలో అంద గత్తెగా ఎన్నిక చేయడానికి వారందరని మన తెలంగాణా రాష్ట్రంలోని హైదరాబాద్‌కుఆహ్వానించి, గౌరవించడం రాష్ట్ర ఖ్యాతి మిక్కిలి ఇనుమడించింది.వారికి సకల సదుపాయాల ను కలిగించి, ముఖ్యమైన చారిత్రాత్మక ప్రదేశాలకు, మన రామోజి ఫిల్మ్ సిటికి తీసుకెళ్ళడం వంటివి చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆహ్వానితులు ఎన్నటికి మరచిపోలేరు. వీరి కట్టూ బొట్టు మన హిందూ సంప్రదాయాన్ని ప్రతిఫలించిం ది.వీరిలో ఎవరో ఒకరు ప్రపంచ సుందరిగా ఎన్నికవుతారు. కానివారు కూడా చాలామందికి బాగా నచ్చుతారు. అందా నికి సరియైన నిర్వచనం లేదు. నాకు ఏది అందంగా కనిపి స్తోందో అదే నాకు ఎప్పటికి ఆనందమనిపిస్తుందని ఆంగ్ల రోమాంటిక్ కవి జాన్‌కీట్స్ అన్నాడు. మన తెలుగు కవులు ఇంకా అద్భుతంగా స్త్రీ సౌందర్యాన్ని ఊహకు అందనంతగా అనేక శోభలతో వర్ణించారు.

-డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## సౌకర్యాలు కల్పించాలి

పొట్టకూటికోసం వలసకార్మికులు పడే కష్టాలు వర్ణనాతీ తం. రెక్కాడితేకానీ డొక్కాడని ఈ భవన కార్మికులకు ఉపాధికరువయిందంటే అతిశయోక్తికాదు. ఏపూటకాపూట శ్రమించి, ఉదరం నింపుకునే వీళ్లకు సౌకర్యాలు చాలా దూరం. అంతేకాకుండా చేసే పనుల్లో దమ్ము, ధూళి కార ణంగా శ్వాసకోశ సమస్యలతో అనారోగ్యపాలవుతుంటా రు. ఎక్కువ పనిదినాలు, సొంతిళ్లతోపాటు రేషన్ హెల్త్, లేబర్ కార్డులు, షూ, చేతిగ్లౌజ్‌లు, మాస్కులు అందించి ఆదుకొని వీరి జీవితాల్లో వెలుగు నింపాలి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

## అగ్నిప్రమాదాలను నివారించలేరా?

వేసవి పొడి గాలులు, పెరిగిన ఉష్ణోగ్రతలు, గరిష్ఠ విద్యుత్ లోడ్లుకలిస్తే అగ్నిప్రమాదాలుసంభవించే అవకాశాలు ఎక్కువగా వుంటాయి. ముఖ్యంగా వాణిజ్య ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల ప్రమాదం శారీరకంగానే కాక ఆర్థికంగా కూడా వినాశకరంగా మారుతోంది. ఒక్క చిన్న స్పార్క్‌తో వేల కోట్లు విలువైన ఆస్తి కలిపి, ఎన్నో ప్రాణాలు మంటల్లో పోయే అవకాశముంది. ప్రభుత్వం తక్షణం మూడు దిశల్లో చర్యలు చేపట్టాలి. మొదట, అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయాలి.ప్రతి మండలానికి ఒక మొబైల్ ఫైర్ స్టేషన్, వేగవంతమైన రగడ నీటి ట్యాంకర్లు, ఆధునిక ఫోమ్ సిస్టమ్‌లు అందుబాటులో ఉంచాలి. రెండవది, నిరంతర తనిఖీలు, శీతల పానీయ చేటిగళ్లు, గాజు ప్యానెల్లు, ఎయిర్‌కండిషనర్ లైను లాంటి అధిక లోడ్ ప్రాంతాల్లో ఎలక్ట్రి కల్ సేఫ్టీ ఆడిట్లు నెలసారి నిర్వహించి, తప్పులైతే వెంటనే సరిపెట్టాలి. మూడవది, ప్రజలకు అవగాహన ప్రతి రెవెన్యూ గ్రామంలో వేసవి ప్రారంభానికి ముందే 'ఫైర్ సేఫ్టీ వారాలు' జరిపి, గృహాల్లో ప్రత్యేక భద్రతాచర్యలు, గ్యాస్ సిలిండర్ నిర్వ హణ, పొదుపు చర్చలు నిర్వహించాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## క్లీన్ సిటీగా నగరం

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి అనే భావనతో ఇటీవల తెలంగాణాప్రభుత్వం గోడల మీద రాతలను వాల్‌పోస్టర్స్‌ను నిషేధించింది. దీన్ని ఉల్లంఘిస్తే ఫైన్ వేస్తామని తెలిపింది. ఇది ముమ్మాటికీ హర్షణీయం. అలాగే బ్యానర్ ఫ్లెక్సీలపై కూడా చర్యలు తీసుకోవాలి. గతప్రభుత్వం బ్యానర్ ఫ్లెక్సీలపై నిషేధం విధించింది. కానీ నగరంలో విచ్చలవిడిగా బ్యానర్లు ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి.రోడ్లపై చెత్తను వేయకూడదు.

-ఎస్. శేషగిరి, సికింద్రాబాద్

## అవినీతిని అరికట్టాలి

ఇటీవల ఉభయరాష్ట్రాల్లో కొన్ని లక్షల ప్రజలకు ఎన్నో విషయా ల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. అత్యంత ఉన్నత అధికార హోదా ఉన్న వ్యక్తులు చాపకింద నీరులా అవినీతి, అధికార దుర్వినియోగం చేస్తూ బయట పడుతున్నారు. రాజును బట్టి రాజ్యం అన్నారు పెద్దలు. ఆ హోదాకి విలువ, ప్రజలకు రక్షణ అప్పుడే సాధ్యం. ఏ ప్రభుత్వమైన ప్రజల సంక్షేమానికి పెట్టిన పథకాలు అమలు బాధ్యత ప్రభుత్వానిదే. వాటిని సరిదిద్దేందు కు ఏదైనా సహేతుక చర్య తీసుకోవచ్చు.

-బొల్లోజు మేఘనాథ్, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అవగాహనే అగ్నిప్రమాదాల సమస్యకు పరిష్కారం

**ప్రభుత్వం తక్షణమే కఠినమైన భవన నిర్మాణ నిబంధనలను ప్రవేశపెట్టి, వాటిని నిక్కచ్చిగా అమలు చేయాలి. నగరంలోని అధిక జనాభా కలిగిన ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి.సురక్షితమైన, ధృవీకరించబడిన విద్యుత్ పరికరాల వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పనులు అర్హత కలిగిన, శిక్షణ పొందిన నిపుణులచే మాత్రమే నిర్వహించబడేలా చూడాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు, సిబ్బందిని సమకూర్చాలి. ప్రజల్లో అగ్నిమాపక భద్రతపై ఒక బలమైన అవగాహన సంస్కృతిని పెంపొం దించడం అత్యంత కీలకం. దీని కోసం విస్తృతమైన విద్యా ప్రచారాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలి.**

డి. జయరాం

హైదరాబాద్ నగరంలో ఇటీవల చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం ఒక హెచ్చరిక. ఇది కేవలం ఒక దుర్ఘట నగా కొట్టిపారేయడానికి వీల్లేని ఒక భయానక వాస్తవం. పట్టణీకరణ శరవేగంగా జరుగుతున్న మన దేశంలో, ఇలాం టి విషాదాలు మళ్లీ మళ్లీ తలెత్తుతుండటం ఆందోళన కలి గిస్తోంది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ, ఇలాంటి ప్రమాదాలకు దారితీసే అంత ర్లీన కారణాలను, వ్యవస్థాగత లోపాలను, మానవ తప్పిదా లను లోతుగా పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైంది. దట్టమైన జనాభాతో నిండిన మన నగరాలలో విద్యుత్ మౌలిక సదుపాయాల పరిస్థితి ఎప్పుడూ ఒక ప్రధాన సమస్యగా నిలుస్తోంది. పాతబడిపోయిన వైర్లు, ప్రమాదకర స్థాయికి చేరిన విద్యుత్ లోడ్, నాసిరకం విద్యుత్ పరికరాల వినియోగం నిత్యం పెను ప్రమాదానికి కారణమవుతున్నా యి. నగరాలు విస్తరిస్తున్న తీరుకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థలను ఆధునీకరించడంలో మనం తీవ్రంగా వెనుకబడి పోతున్నాం. దీనిఫలితంగా ఎప్పుడు ఏ విపత్తుజరుగుతుందో అనే భయం ప్రతి నగరవాసి గుండెల్లోనూ దాగి ఉంది. ఇక అనధికారికంగా వెలసిన మురికివాడలు, అనుమతి లేని కట్టడాలలో విద్యుత్ కనెక్షన్ల పరిస్థితి మరింత దయనీయం గా, ప్రమాదకరంగా ఉంటుంది. అక్కడ నివసించే వారి జీవితాలు నిత్యం అగ్నిగుండంపైనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. విద్యుత్ వైఫల్యాలే కాకుండా, అగ్నిమాపక భద్రతా నిబం ధనల పట్ల మనం చూపుతున్న నిర్లక్ష్యం, వాటిని సమర్థ వంతంగా అమలు చేయడంలో ఉన్న అలసత్వం కూడా ఇలాంటి విషాదాలకు ముఖ్య కారణాలలో ఒకటి. వాణిజ్య సముదాయాలైనా, బహుళ అంతస్తుల నివాస భవనాలైనా, విద్యా సంస్థలైనా, ఆసుపత్రులైనా చాలా వరకు సరైన అగ్నిమాపక భద్రతా వ్యవస్థలు లేకుండానే కొనసాగుతున్నా యి. కొన్ని చోట్ల ఉన్నా అవి చాలా కాలంగా పనిచేయని స్థితిలో మూలకు పడివుంటాయి. అత్యవసర నిష్క్రమణ మార్గాలు సరుకులతో నిండిపోయి ఉండటం, వాటిని తాళం వేసి ఉంచడం వంటి బాధ్యతారహితమైన చర్యలు మనకు నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. అగ్నిమాపక పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, వాటి నిర్వహణపై శ్రద్ధ చూపడం అనేది చాలా చోట్ల మర్చిపోయిన విషయం. కేవలం స్వల్ప మొత్తంలో డబ్బు ఆదా చేయాలనే దురాలో చనతో భద్రతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. ఇది ఎంతటి ఘోరమైన పరిణామాలకు దారితీస్తుందో మనం ఊహించలేం. మానవ ప్రవర్తన కూడా ఈ విషయంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. వంట చేసేటప్పుడు ఏమరు పాటుగా ఉండటం, మండే గుణం కలిగిన వ్యర్థ పదార్థా లను అజాగ్రత్తగా పారవేయడం, ప్రాథమిక అగ్నిమాపక భద్రతా నియమాల గురించి కనీస అవగాహన కూడా లేకపోవడం వంటివి భయంకరమైన ప్రమాదాలకు దారితీస్తు న్నాయి. ఇరుకుగా ఉండే ప్రాంతాలలో ఒక చిన్న నిప్పురవ్వ కూడా క్షణాల్లో పెద్ద అగ్ని జ్వాలగా మారి ఎన్నో ప్రాణా లను బలిగొనగలదు. అగ్నిమాపక భద్రతపై ప్రజల్లో విస్తృ తమైన అవగాహన కల్పించకపోవడం, పాఠశాలల్లో, కార్యా



లయాల్లో తగినంత శిక్షణ లేకపోవడం కూడా ఈ దుర్భర పరిస్థితికి ప్రధాన కారణమవుతోంది. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన ప్రాణాల కంటే ముఖ్యమైనది ఏదీ కాదని గుర్తెరగాలి. ఈ విషమ పరిస్థితిని చక్కదిద్దాలంటే మనం ఒక సమగ్రమైన, బహుముఖ కార్యాచరణ ప్రణా ళికను రూపొందించుకోవాలి. ప్రభుత్వం తక్షణమే కఠినమైన భవన నిర్మాణ నిబంధనలను ప్రవేశపెట్టి, వాటిని నిక్కచ్చిగా అమలు చేయాలి. నగరంలోని అధిక జనాభా కలిగిన ప్రాం తాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి.సురక్షితమైన, ధృవీ కరించబడిన విద్యుత్ పరికరాల వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పనులు అర్హత కలిగిన, శిక్షణ పొందిన నిపుణులచే మాత్రమే నిర్వహించబడేలా చూడాలి. నిబంధ నలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు, సిబ్బందిని సమకూర్చాలి. ప్రజల్లో అగ్నిమాపక భద్రతపై ఒక బలమైన అవగాహన సంస్కృతిని పెంపొం దించడం అత్యంత కీలకం. దీని కోసం విస్తృతమైన విద్యా ప్రచారాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలి. నివారణ చర్యలు తీసుకోవడం ప్రాముఖ్యతను, బాధ్యతాయుతంగా ప్రవర్తించవలసిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా తెలియజేయాలి. భవన యజమానులు, నివాసితులు కూడా తమ వంతు బాధ్యతగా ప్రతి అంతస్తులో నాణ్యమైన పొగ గుర్తింపు యంత్రాలు ఏర్పాటు చేసుకోవడం, అందుబాటులో అగ్ని చల్లార్చే పరికరాలు ఉంచుకోవడం, స్పష్టమైనతరలింపు ప్రణాళికలు రూపొందించుకోవడం వంటి చర్యలు తప్పనిసరి గా చేపట్టాలి. అంతేకాకుండా, క్రమం తప్పకుండా అగ్నిమా పక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం కూడా చాలా అవ సరం. ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం వహించినా దాని మూల్యం ప్రాణాలతో చెల్లించుకోవలసి వస్తుంది. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మండే పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయడం వంటి సాధారణ జాగ్రత్తలు తీసుకోవాలి. హైదరాబాద్‌లో జరిగిన ఈ విషాదకరమైన సంఘటన మనందరికీ ఒక కనువిప్పు లాంటిది. అధికారులు, పాలకులు, భవన యజమానులు, సామాన్య పౌరులు ఇలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి, అగ్ని భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. ఈ దిశగా మనం తీసుకునే ప్రతి చిన్న చర్య కూడా భవిష్యత్తు లో ఎన్నో అమూల్యమైన ప్రాణాలను కాపాడుతుంది. సమి ష్టిగా కృషి చేస్తేనే సురక్షితమైన, మరింత నిరోధక శక్తి కలిగిన నగరాలను మనం నిర్మించగలం. ఇది కేవలం మన బాధ్యత మాత్రమే కాదు, మన భవిష్యత్తు తరాలకు మనం అందించే అత్యంత విలువైన భద్రతా వారసత్వం కూడా. ఈ విషయంలో ఇంకెంత మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నివురుగప్పి న నిప్పులా ఉన్న నగర భద్రతపై మనమందరం కలిసి పోరాడకపోతే, భవిష్యత్తులో మరిన్ని విషాదాలను చూడక తప్పదు. ఇకనైనా మేల్కొని, తగిన జాగ్రత్తలు తీసుకుం దాం. మన ప్రాణాలను, మన ఆస్తులను కాపాడుకుందాం. సురక్షితమైన నగర జీవనానికి బాటలు వేద్దాం. ●

# ఉగ్రవాదం మూలాలు పెకలించాలి

సంపతి రమేష్

రాజకీయ, మతపరమైన లేదా సైద్ధాంతిక లక్ష్యాల కోసం జనాభాను లేదా ప్రభుత్వాన్ని బెదిరించడానికి హింసను సృష్టించడం ఉగ్రవాదంగా పేర్కొంటారు. ఉగ్ర వాదం దేశ భద్రతకు సవాల్ విసురుతోంది. ప్రజల ఆర్థిక, సామాజిక జీవనాన్ని దెబ్బతీస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టం. దేశాభివృద్ధికి విఘాతంగా మారుతుంది. మే 21, 1991లో తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్‌లో జాతీయ ఎన్నికలకు పార్టీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో ప్రసంగిస్తున్నప్పుడు ఉగ్రవాదుల చేతుల్లో హత్యకు గురైయ్యారు. ఆ తర్వాత భారత ప్రభుత్వం ఇటు వంటి సంఘటనలు జరగకూడదనే ఉద్దేశ్యంతో ఈ రోజును జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది. ఇది భారతదేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి రోజు అని చెప్పవచ్చు. మానవత్వం, కోసం పాటు పడేలా ప్రజలలో ఐక్యతను పెంపొందించడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ శాంతి కోసం అహింస సందేశాన్ని ప్రజలకు అవగతమయ్యేలా చేయడం, యువత పెడదోవ పట్టకుండా చేయడం వంటివి ఈ దినో త్సవం ముఖ్యోద్దేశాలు. ఈ రోజున ఉగ్రవాద వ్యతిరేకంగా పోరాడిన వేలాదిమంది సైనికులు చేసినత్యాగాలను గుర్తు చేసుకోవడమే కాక వారికి నివాళుల అర్పిస్తారు. మానవత్వం శాంతి సందేశాన్ని ప్రచారం చేయడం జరుగుతుంది. ఉగ్ర వాద మూలాలను వెతకాలి. భారత దేశంలో ఉగ్రవాదం ప్రధానంగా బోర్డర్ నుంచి పొంచి ఉంది. ఇది దేశవ్యాప్తంగా కూడా విస్తరించే ప్రమాదం ఉంది. మన దేశసరిహద్దు దేశాలకు మధ్య ఉన్న రాష్ట్రాలకు నిరంతరం వలసలు రావ డం వలన ఉగ్రవాద ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగాచైనా, పాకిస్థాన్ సరిహద్దు రాష్ట్రాలతో మనకు ప్రమాదం ఉంది. ఇటీవల జమ్మూకాశ్మీర్ లోని పహల్గామి ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో 28 అమాయక భారతీయులు ప్రాణాలు కోల్పో



యారు. ఉగ్రవాద ముప్పు తొలగిపోయిందన్న నేపథ్యంలో ఈ దాడి జరగడం మరొకసారి భారతదేశాన్ని భయోందోళన లకు గురిచేసింది. దీనికి భారతదేశం ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతిదాడి చేసింది. ఇప్పటికే భారతదేశంపై పలు మార్లు ఉగ్రదాడి జరిగింది. చాలా ప్రాణ, ఆస్తి నష్టం జరి గింది. కానీ గత కొంతకాలం నుంచి భారత్ వివిధ దేశాల తో కొనసాగిస్తున్న దౌత్య సంబంధాల నేపథ్యంలో ఉగ్రదాడి తగ్గిన సంగతి తెలిసింది. మరోవైపు భారతదేశంలో వేల సంవత్సరాల నుంచి చాప కింద నీరులా కొనసాగుతున్న సామాజిక వివక్షత వలన అంతర్గత సంఘర్షణలు పెరుగుతున్నాయి. కులం పేరుతో విభజించి అవకాశాలు అందకుండా చేయడం కూడా ఉగ్రవాదమే. ముఖ్యంగా రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కొన్ని వర్గాల వారికే అందడం వలన సమాజంలో అంతర్గత కలహాలు పెరిగిపోతాయి. దీంతో గతంలో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా పెరిగిపోయింది. ఇప్పటికీ అక్కడక్కడ కొనసాగు తుంది. దీనికి ప్రధాన కారణాన్ని అన్వేషించి పరిష్కరించా ల్సిన అవసరం ప్రభుత్వాలపైన ఉన్నాయి. కానీ ఇటీవల చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కర్రెగుట్టల వద్ద ఆపరేషన్ పేరుతో అణచివేయడం వలన వామపక్ష తీవ్రవాదం అంతం కాదు. అనేక ప్రజా సంఘాల సైతం దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. అతిపెద్ద జనాభా గల భారతదేశంలో అంతర్గత బహిర్గత ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరం. దీన్ని నిలువరించాలంటే ప్రపంచ దేశాలతో స్నేహపూరిక దౌత్యసంబంధాలను పెం పొందించుకోవాలి. సరిహద్దు దేశాలతో ఉన్న బార్డర్ సమ స్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలి. ఉగ్రవాదం అంతం చేయడానికి ఆధునిక సాంకేతికతను వాడాలి. ఉగ్ర వాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై నిఘాపెట్టాలి. ముఖ్యంగా మతోన్మాదాన్ని నివారించాలి. కులం పేరుతో కొనసాగుతున్న అణచివేతను తగ్గించాలి. అన్ని రం గాలలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అవకాశాలు కల్పించాలి.ఉగ్రవాదం అంటే తుపాకిలతో కాల్చాడం.బాంబు లను పేల్చడం ఉగ్రవాదం కాదు, ప్రజలను కులాలుగా, మతాలుగా విభజించడం కూడా అతి భయంకరమైన ఉగ్రవాదమే అని గుర్తెరిగి నడుచుకోవాలి. ●

# మానవహక్కుల కార్యవర్గాన్ని నియమించాలి

టేకి.సురేష్ కుమార్


ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల సంఘంలో దాదాపు14 నెలల నుంచి చైర్మన్, సభ్యుల నియామకం జరగని కారణంగా..వేలాది హక్కుల ఉల్లంఘన ఫిర్యాదులు అపరి ష్కృతంగా గత ప్రభుత్వ కాలం నుంచే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 2024లో సదరు నియమకానికి దరఖాస్తులు ఆహ్వానించగా జూన్ 2024లో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం సదరు నియమకాలు పారదర్శకంగా, నిబద్ధతగా జరపాలని మరల నూతనంగా దరఖాస్తులని ఆహ్వానించి దాదాపు 6నెలలు కావస్తున్నా ఎంపిక, నియా మక ప్రక్రియ జరగపోవడానికి కారణమేమిటో సామాన్య ప్రజలకు, విజ్ఞానవంతులకు,మానవ హక్కుల సంఘాల కార్యకర్తలకు అర్థం కావడం లేదు.! ప్రభుత్వం చొరవ చూపి తక్షణమే సమర్థుల్ని,సేవాభావం గల వారిని మానవహక్కుల సంఘం చైర్మన్, సభ్యులుగా నియమిస్తే బాగుంటుందని ప్రజలు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్.హెచ్.ఆర్.సి) మానవ హక్కుల రక్షణ కోసం ఏర్పాటు చేయబడిన ఒక చట్టబద్ధమైన సంస్థ. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993,ద్వారా ఏర్పడ్డ కేంద్ర(ఎన్.హెచ్. ఆర్. సి), రాష్ట్ర (ఎస్.హెచ్.ఆర్.సి) మానవ హక్కుల సంఘాలకు..సివిల్ న్యాయ స్థానాలకున్న అధికారాలు ఉంటాయి. ఈ కమిషన్ మానవ హక్కుల ఉల్లంఘనలను, వినతులు,విజ్ఞప్తులు, పరిశీలిస్తుంది. పరిశోధించి సంబంధిత చర్యలు తీసుకోవ డానికి బాధ్యత వహిస్తుంది. ప్రజల హక్కులను రక్షించే బాధ్యత వహిస్తుంది. ఉల్లంఘనల ఫిర్యాదులను, వినతు లు, విజ్ఞప్తులు స్వీకరించి వాటిని పరిశీలిస్తుంది. ఉల్లంఘ నలు కన్ఫర్మ్ అయితే కమిషన్ సంబంధిత చర్యలు తీసు కుంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను,ఇద్దరు సభ్యులని(ఎస్.హెచ్.ఆర్.సి).. ముఖ్య మంత్రి చైర్మన్గా, శాసనసభ స్పీకర్,శాసనమండలి చైర్మన్, హోం మంత్రి,ప్రతిపక్ష నాయకుడు (లేదా అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు గెలిచిన మరో పార్టీ నాయకుడు) సభ్య లుగా గల ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు గవర్నర్ నియమిస్తారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 19 నుంచి 35వ ఆర్టికల్ వరకు ప్రాథమిక హక్కుల గురించి సవివరంగా తెలియ జేయబడింది. వాటినే మానవ హక్కులుగా పేర్కొనడం జరుగుతుంది. మానవ హక్కుల సంఘ పరిధి లో..బాలల హక్కులు, వయోవృద్ధుల హక్కులు,మహిళల హక్కులు, బాల కార్మికుల హక్కులు.,హెచ్ఐవి/ఎయిడ్స్(పరిరక్షణనిరోధ చట్టం)2017, ప్రజారోగ్య పరిరక్షణ చట్టం తదితర చట్టాల పరిధిలో అంశాలు కూడా పరిశీలించి తగు ఆదేశాలు ఇచ్చే అవకాశం కూడా ఈచట్ట పరిధిలో ఉంది. మానవ హక్కుల ఉల్లంఘనల ఫిర్యాదులను నేరుగా స్వీకరిస్తుంది, ఫిర్యాదు లు పోస్టు, కొరియర్, ఫ్యాక్స్, ఈమెయిల్ ద్వారా పంప వచ్చు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆన్లైన్ల ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర కమిషన్లో





ఆన్లైన్లో సమర్పించే సదుపాయాలు అందుబాటులోకిరాలేదు. ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత కమిషన్ వాటిని పరిశో ధిస్తుంది. ఉల్లంఘనలపై సిఫారసులను చేస్తుంది. అవస రమైన చర్యలు తీసుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ప్రతిపక్ష నాయకులు నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో పార్ల మెంటు సభ్యులు, శాసనసభ్యులు, అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టు ఎత్తు పెంచుతున్న సందర్భంగా మన తెలుగు రాష్ట్రాలకు నీరు అందక, రైతులు,ప్రజలు చాలా ఇబ్బందులు పడతారని తెలుగు రాష్ట్రాల భవిష్యత్తుని ఆలోచించి నాడు బాబ్లీ ప్రాజెక్టు సందర్శనకు వెళ్ళగా మహా రాష్ట్ర ప్రభుత్వాధికారుల నిరంకుశ చర్యల వల్ల దాదాపు మూడు రోజుల పాటు చాలా ఇబ్బందులకు గురి కాగా అప్పుడు రాజమండ్రికి చెందిన విశ్వశామలం సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి టి.సురేష్ కుమార్,అధ్యక్షులు కోటిలింగేశ్వరరావులు ఓ ఫిర్యాదును జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి ఫ్యాక్స్ ద్వారా.. సమర్పించి రాష్ట్ర క్యాబినెట్ మంత్రి హోదా పార్లమెంట్ సభ్యులు పై మహారాష్ట్ర ప్రభుత్వ అప్పటి పోలీసుల ప్రవ ర్తన పై చర్యలు తీసుకుని, రిలీఫ్ ఇవ్వాల్సిందిగా కోరడం జరిగింది. దానిపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ మహా రాష్ట్ర డీజీపీకి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసి వెంటనే హైదరాబాదు చేరుకునే ఏర్పా ట్లు చేయించింది.! అదే సందర్భంలో ఆ తదుపరి టిడిపి రాజ్యసభ సభ్యులు మైసూరారెడ్డి కూడా ఓ ఫిర్యాదును జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి నేరుగా అందించారు.! జూన్ 2014లో హిమాచల్ ప్రదేశ్‌లో ఒక విషాద సంఘ టన జరిగింది. హైదరాబాద్‌కు చెందిన 24 మంది ఇంజ నీరింగ్ విద్యార్థులు థలోట్ సమీపంలోని బియాస్ నదిలో కొట్టుకుపోయారు. ముందస్తు హెచ్చరిక లేకుండా లార్జీ ఆన కట్ట నుండి అకస్మాత్తుగా నీరు విడుదల కావడంతో విద్యా ర్థులు కొట్టుకుపోయారు. జాతీయ మానవ హక్కుల కమి షన్ సుమోటోగా విచారణకు స్వీకరించి ప్రమాదంలో మర ణించిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం వచ్చేలా చేసింది. సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థులు 8 రోజులుగా నిద్ర ఆహారాలు మాని నిరాహార దీక్షలో పాల్గొన్న సందర్భంగా వారి ఆరోగ్యం బాగా క్షీణిస్తుందనే వార్తల నేపథ్యంలో రాజ మండ్రికు చెందిన సామాజిక కార్యకర్త టి.సురేష్ కుమార్.. ఫ్యాక్స్ ద్వారా రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ సుభాషన్ రెడ్డి గారికి ఫిర్యాదు చేయగా.. వెంటనే స్పందించిన కమిషన్ దీక్షలో ఉన్నవిద్యార్థులకి వైద్య సదు పాయాలు కల్పించి, వారిని కాపాడేలా చేసింది. ఈ మానవ హక్కుల కమిషన్ సభ్యులుగా నియామకంలో రాజకీయ పార్టీ చరిత్ర(రాజకీయపార్టీ సభ్యులుగా) ఉన్న వారిని నియ మించకూడదని, అలాగే లాభదాయక పదవుల్లో ఉన్న వారు నియమింపబడకూడదని చట్టం నిర్దేశిస్తుంది.! సమ ర్థులు, సరైన వారు, సేవాభావం గలవారు, చైర్మన్గా, సభ్యులుగా నియామకం జరిపితే., అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణలో వారికి వెన్నుదన్నుగా ఉంటారనిప్రజల ఆశాభావం.కర్నూల్లో గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యా లయంలో నేటికే వేలాదిగా వినతులు, ఫిర్యా దులు గత 14 నెలలుగా చైర్మన్, సభ్యులనియామకం జరగనికారణంగా అపరిష్కృతంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారా లోకేష్‌లు సమర్థవంతంగా ప్రజా రంజక పాలన అందిస్తున్న సందర్భంగా వెంటనే మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యులు నియమించి మరింత ప్రోత్సాహం అందించాలి. ●

# అమరావతి వార్త







మంగళవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు. చిత్రంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## సంగీత, సాహిత్యాలతో పాటకు ప్రాణం పోసిన కీరవాణి: పవన్‌కళ్యాణ్

గుంటూరు, మే 20, ప్రభాతవార్త ప్రతినిధి: మనసులోని పౌరుషం, వీరత్వం ఎన్నటికీ చల్లబడిపోకూడదని ప్రతి ఒక్కరినీ తట్టిలేపే సలసల మరిగే నీలోని రక్తమే.. అని పాటకు సంగీత, సాహిత్యాలతో ఎంఎం కీరవాణి ప్రాణం పోశారని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. హరిహరవీరమల్లు చిత్రంలో ఈ గీతం విన్పిస్తుందని తెలిపారు. నేటి పరిస్థితుల్లో మనందరిలో వీరత్వం



చేవజారిపోకూడదని చర్నాకోలుతో చెప్పినట్టు అన్పించిందని పవన్ పేర్కొన్నారు. ఈపాటను 21వ తేదీన అందరికీ విన్పించబోతున్నారని అన్నారు. ఈచిత్రానికి సంగీతం అందించిన కీరవాణి కథలోని భావోద్వేగాలను శిఖర స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఈ సినిమా కోసం ఎంత తపన చెంది స్వరాలు అందించారో స్వయంగా చూశానని అన్నారు. వీరమల్లు కు ప్రాణం పోశారని అనటంలో అతిశయోక్తి లేదన్నారు. మంగళవారం ఉదయం ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణిని కలిసి సాగించిన సంభాషణ ఎంతో సంతోషాన్ని కల్గించిందని డిప్యూటీ సిఎం పవన్ పేర్కొన్నారు.

## గతపాలకులు కనీసం రోడ్లకు మరమ్మతులు కూడా చేయలేదు

### - టిడిపి ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య

గుంటూరు, మే 20, ప్రభాతవార్త ప్రతినిధి: గత ఐదేళ్ల పాలనలో కనీసం రోడ్లకు మరమ్మతులు చేసిన పాపాన పోలేదని, దాంతో లక్ష 15 వేల రోడ్డు ప్రమాదాలు జరిగి 43 వేల మంది ప్రాణాలు కోల్పోయారని వ్యవస్థలను సర్వనాశనం చేసి దోచుకోవటం దాచుకోవటం తప్ప నాటి పాలకులు ప్రజల



కోసం చేసింది ఏమీ లేదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య మండిపడ్డారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రహదారుల నిర్వహణ పూర్తిగా అధ్వానంగా మారిందని, జగన్ పాలనలో రోడ్లు సరిగా లేక లక్షా 15 వేల రోడ్డు ప్రమదాలు సంభవించాయన్నారు. 43 వేల మంది విలువైన ప్రాణాలు కోల్పోయి, వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలోరోడ్ల కోసం రూ.500 కోట్లు కేటాయించినా ఖర్చుచేసింది కేవలం రూ.10 కోట్లు మాత్రమే అని తెలిపారు. 2014-19 మధ్య కాలంలో 26వేల కి.మీ సిసి రహదారులు, 22 వేల కిమీ బిటీ రహదారులను సిఎం చంద్రబాబు నిర్మించారన్నారు. రూ.36వేల కోట్లతో మరో 5వ రాష్ట్ర జాతీయ రహదారుల అభివృద్ధికి అంచనాలు రూపొందించారన్నారు. ఇపుడు చంద్రబాబు కృషి వల్ల హైదరాబాద్-అమరావతి మధ్య గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఇప్పటికే విజయవాడ-ఖమ్మం మధ్య జాతీయ రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నారని తెలిపారు. అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు సంబంధించి డిపిఆర్ సిద్ధమైందని, ప్రజారాజధాని అమరావతి చుట్టూ 6 లైన్లలో 70 కిమీ వెడల్పుతో రింగ్‌రోడ్డు నిర్మాణానికి కేంద్రం సమ్మతితో శ్రీకారం చుట్టామన్నారు. ప్రజారాజధానిలో జరుగుతున్న పనులు చూసి పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నారని తెలిపారు.

## సత్యన్నారాయణపురం నూతన పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన సిపి రాజశేఖరబాబు

విజయవాడ క్రైం,మే 20,ప్రభాతవార్త: త్వరలో ప్రారంభం కానున్న నూతనంగా ఆధునాతన సౌకర్యాలతో నిర్మించిన సత్యన్నారాయణపురం పోలీస్‌స్టేషన్ భవనాన్ని మంగళవారం నగర పోలీస్



కమీషనర్ ఎస్‌వి రాజశేఖరబాబు ఇతర పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఈ రోజు నగర పోలీసు కమీషనర్ సత్యన్నారాయణపురం పోలీస్‌స్టేషన్ నూతన భవనం లోని సిఐ,ఎస్ఐల గదులను,కంప్యూటర్ గదులను,లాకప్ గదులను,పోలీస్ స్టేషన్‌కు వచ్చే భాధితులు,ప్రజలు కూర్చునే ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలను అందించారు. సిపితో పాటు నార్త్ ఎసిపి కె.స్రవంతిరాయ్,సత్యన్నారాయణపురం సిఐ లక్ష్మీనారాయణ,ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు మామిడిపండ్ల పంపిణీ



విజయవాడ, మే 20, ప్రభాతవార్త : ఈ వేసవిలో పాదచారుల దాహార్తిని తీరుస్తూన్న జయహో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొల్లా జయశ్రీ మంగళవారం నాడు పేదలకు మామిడి పండ్లను విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 36 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామని, ఈ రోజు ఎండ లేనందున పేదలకు మామిడి పంపిణీ చేశామని, మా సంస్థ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన, రోడ్డు రిపేర్స్ వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ సిహెచ్ రమాదేవి, కోశాధికారి డి ఆంజనేయరాజు, సాయిచందు పాల్గొన్నారు.




పదో తరగతిలో టాప్ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సత్కరించిన మంత్రి నారా లోకేష్ (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## రోడ్లపై ఉన్న నీటి నిల్వలన్నీ వాహనాలను ఉపయోగించి తక్షణమే తొలగించాలి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,మే 20,ప్రభాతవార్త: వర్షం వలన రోడ్లపై నీరు నిల్వ ఉంటే వాటిని అవసరమైన వాహనాలను ఉపయోగించి నీటిని తక్షణమే తొలగించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వర్షం పడుతున్న వేళ రోడ్లపైన నీటి నిల్వలు ఉండకుండా సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉండాలన్నారు. మంగళవారం తన పర్యటనలో భాగంగా ఆయన యంజి రోడ్డు,బెంజిసర్కిల్,నిర్మల స్కూలు రోడ్డు,పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు,జమ్మిచెట్టు సెంటర్,లయోలా కళాశాల రోడ్డు,లతా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రోడ్డు,కంద్రిక ప్రాంతాలన్నీ



పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షం వల్ల రోడ్లపైన నీటి నిల్వలు ఉన్న ప్రదేశాలన్నీ పర్యటించి తక్షణమే రోడ్లపై నీటి నిల్వలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎమినిటీ సెక్రటరీలు,అసిస్టెంట్ ఇంజనీర్లు,శానిటేషన్ సిబ్బంది వర్షపు నీరు ఉన్న రోడ్ల వద్ద వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రదేశాల్లో గ్రేటింగ్ తీయించి వర్షపునీటి పారుదల నిరంతరంగా వెళ్ళేటట్లు చూసుకోవాలన్నారు. వర్షం పడుతున్న సమయంలో రోడ్ల పైన నీటి నిల్వలు ఎక్కడ ఎక్కువగా ఉంటాయో తెలుసుకోడానికి తానే స్వయంగా నగరం మొత్తం పర్యటించి అధికారులతో తాను గమనించిన ప్రతి ప్రాంతాన్ని అక్కడ నీటి నిల్వలు ఉన్నాయని తక్షణమే చర్యలు తీసుకోవాలని సిబ్బంది వెంటనే అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకుంటూ నీటిని తొలగిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా చూసుకుంటూ ఉండాలని అధికారులను ఆదేశించారు. కంద్రిక వద్ద నుండి 33 తూములు వరకు జరిగిన డీ సిల్టింగ్ పనులను,డ్రైనేజి పంపింగ్ స్టేషన్ పరిశీలించి,ఔట్‌ఫాల్ డ్రైన్‌లో ప్రవాహానికి ఎటువంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సామ్రాజ్యం,శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్,అసిసె ంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబూ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టేట్ విభాగంలోని ఆస్థులకు మరమ్మతులు లేకుండా చూసుకోవాలి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,మే 20,ప్రభాతవార్త: ఎస్టేట్ విభాగంలోని కార్పొరేషన్ ఆస్థులైన కర్మల భవనాలు,స్వర్గపురి,కమ్యూనిటీ హాళ్ళు,కళ్యాణ మండపాలన్నీ ఎటువంటి మరమ్మత్తులు లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం ఆయన సత్యన్నారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో ఎస్టేట్ విభాగంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టేట్ సిబ్బంది ఇంజనీరింగ్ సిబ్బంది సమన్వయంతో ప్రస్తుతం ఉన్న ఎస్టేట్ ఆస్థుల్లో ఎటువంటి మరమ్మత్తులు ఉన్నాయో ఒక




నివేదికను తయారుచేసి,ఇంజనీరింగ్ సిబ్బంది ఆ మరమ్మత్తులన్నీ పూర్తి చేసి,ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగాఎస్టేట్ విభాగంలో ఆస్థులుండాలన్నారు. ఫైర్ సిబ్బంది ఎస్టేట్ విభాగంలోని నగరపాలక సంస్థ అస్థులన్నీ అగ్ని ప్రమాదాలకు గురికాకుండా ఫైర్ సేఫ్టీ మేజర్స్ ఉన్నాయో లేదో పరిశీలింఇ ఒక నివేదికను సమర్పించడమే కాకుండా నగరపాలక సంస్థ అస్థులన్నీ పూర్తి స్థాయిలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యల పరికరాలను అమర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,ఎస్టేట్ ఆఫీసర్ ఇన్‌ఛార్జ్,జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత,జోనల్ కమీషనర్ ప్రభుదాస్,సూపరింటెండెంట్ ఇంజనీర్ వర్క్స్ పి.సత్యన్నారాయణ,ఎస్టేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

గుంటూరు, మే 20, ప్రభాతవార్త ప్రతినిధి: విశాఖలో వచ్చే నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడులకు ప్రధాని మోడీ హాజరవుతుండటంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఉండవల్లిలోని నివాసంలో అధికారులతో మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. మంత్రి లోకేష్ మాట్లాడుతూ, యోగా ప్రధాని నరేంద్ర మోడీ మనసుకు దగ్గరైన కార్యక్రమం అన్నారు. రాష్ట్రాభివృద్ధికి మోడీ ఎంతగానో అండగా నిలుస్తున్నారని తెలిపారు.

**-విశాఖలో 5 లక్షల మందితో ఏర్పాట్లు**
**-రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది భాగస్వామ్యం అయ్యేలా చూడాలి**
**-26 జిల్లాల్లో 26 రోజులపాలు యోగాభ్యాసన కార్యక్రమాలు**
**-సెలబ్రిటీలతో యోగా డే -మంత్రుల బృందం సమీక్ష**
**-26 రోజుల కేలండర్‌ను రూపొందించాలని అధికారులకు ఆదేశం**

విశాఖలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించుకునే అవకాశం రాష్ట్రానికి దక్కిందన్నారు. అన్నిశాఖలు సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయటానికి కృషిచేయాలన్నారు. ఇందుకు



మొదటి మూడు రోజులు ప్రజలను సన్నద్ధం చేయాలన్నారు.

**26 జిల్లాల్లో 26 రోజులపాటు రోజుకో జిల్లాలో వినూత్న యోగాభ్యసన కార్యక్రమం:**

యోగాంధ్రలో భాగంగా 26 జిల్లాల్లో 26 రోజులపాటు రాష్ట్ర కార్యక్రమం కింద రోజుకో జిల్లాలో 5 వేల మందితో వినూత్నంగా యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రుల బృందం అధికారులను ఆదేశించింది. ఇందులో యువత , మహిళలు, సీనియర్ సిటిజన్స్, పోలీసులు, దివ్యాంగులు, ఉద్యోగులు వంటి వివిధ విభాగాలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే వారికి ధృవపత్రాలు ఇవ్వాలన్నారు. 26 జిల్లాల్లో 26 రోజులపాటు జరిగే యోగా కార్యక్రమాలపై కేలండర్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సెలబ్రిటీలను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రధాన పట్టణాలు, నగరాల్లో యోగాభ్యాసన కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 100 పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో వెయ్యిమందితో యోగా డే నిర్వహణకుఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్,వంగలపూడి అనిత, డోలా బాల వీరాంజనేయస్వామి, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, యోగాడే నోడల్ అధికారి శశిభూషణ్, ముకేష్ కుమార్ మీనా, సురేష్‌కుమార్, కోనా శశిధర్, వినయ్ చందన్, వీరపాండ్యన్, హేమాంశు శుక్లా, దినేష్‌కుమార్, ప్రకాష్‌జైన్, విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంక బ్రతా బాగ్చీ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పటిష్ట బందోబస్తు నిర్వహించాలి : సిపి రాజశేఖరబాబు

విజయవాడ క్రైం,మే 20,ప్రభాతవార్త: నేడు 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్న దృష్ట్యా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పటిష్ట బందోబస్థు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు అధికారును ఆదేశించారు. ఈ యోగా మాసోత్సవం ప్రారంభం నేపథ్యంలో భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధి లోని పున్నమి ఘాట్ నందు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసే కార్యక్రమానికి సిఎం చంద్రబాబునాయుడు పాల్గొంటున్న



నేపథ్యంలో సిపి రాజశేఖరబాబు ఇతర అధికారులతో కలిసి భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధి లోని పున్నమిఘాట్,పరిసర ప్రాంతాలను పరిశీలించి,ఏర్పాటు చేసే బందోబస్థు ఏర్పాట్లపై అధికారులకు సిబ్బందికి తగు సూచనలు,సలహాలను అందించారు. అనంతరం భద్రతాపరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రయాణీకులకు వారి ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మార్గాలను నిర్ధేశించే విధంగా వాహనాల రద్దీ ఏర్పడకుండా పటిష్టమైన బందోబస్థు ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సలహాలను అందించారు. ఈ సందర్భంగా సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి సిఎం చంద్రబాబునాయుడుతో పాటు వివిఐపిలు,విఐపిలు పాల్గొంటారని తెలిపారు.డిసిపిలు కృష్ణమూర్తి నాయుడు,ఎస్‌విడి ప్రసాద్‌రావు,సబ్ కలెక్టర్ శ్రీ చైతన్య,ఏడిసిపి జి.రామకృష్ణ,ఏవిఎల్ ప్రసన్నకుమార్,పశ్చిమ ఎసిపి దుర్గారావు,ఇతర ఏసిపిలు,ఇతర శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## నరసరావుపేటకు విధుశేఖర భారతీమహాస్వామి రాక

నరసరావుపేట, మే20 ప్రభాతవార్త : శ్రీశృంగేరి శారదాపీఠం నుండి విధుశేఖర భారతీమహాస్వామి మంగళవారం జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణానికి విచ్చేశారు. నూతనంగా నిర్మించిన శృంగేరి శంకరమఠం మహాద్వారాన్ని ప్రారంభించారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ స్వామివారికి ఘనంగా స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందుకున్నారు. శంకరమఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు స్వామివారు సందేశం ఇచ్చారు. నియోజకవర్గంలోనూ, పట్టణంలోనూ ఆధ్యాత్మిక అంశాలకు సంబంధించి స్వామివారితో శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కొద్దిసేపు ముచ్చటించారు. పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ గర్లపాటి కృష్ణకాంత్‌తో పాటు ఆర్యవైశ్య ప్రముఖులు బత్తుల మురళీ, ఎంపిడిఓ టి.వి.కృష్ణకుమారి, మద్ది రామబ్రహ్మానందరావు, శృంగేరి శంకరమఠం అధికారులు, సిబ్బంది, భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీస్‌శాఖ ప్రత్యేక బందోబస్తును స్వామివారి పర్యటన కొరకు ఏర్పాటు చేసింది.



## నరసరావుపేట ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షునిగా మల్లికార్జునరెడ్డి

రొంపిచర్ల, మే20 ప్రభాతవార్త : నరసరావుపేట వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షునిగా పల్లెల మల్లికార్జునరెడ్డి నియమితులయ్యారు. రొంపిచర్ల గ్రామానికి చెందిన ఆయన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్థాపించిన నాటి నుండి ఆ పార్టీకి సేవలందిస్తూ కొనసాగుతున్నారు. మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఆయన అత్యంత సన్నిహితునిగా ఉన్నారు. పార్టీ అధినేత, మాజీ సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు ఇంటెలెక్చువల్ అధ్యక్ష పదవికి అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. తన శక్తి మేరకు పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని పల్లెల మల్లికార్జునరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.



## ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల గోడపత్రికల ఆవిష్కరణ

నరసరావుపేట, మే20 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర మూడవ కౌన్సిల్ సమావేశాల గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లో



ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షులు స్వర్ణ చిన్నరామిరెడ్డి, ఐక్యవేదిక అధ్యక్షులు బాజీ మాట్లాడారు. విజయవాడ మున్సిపల్ స్టేడియంలో జరిగే మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హాజరు కావాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎస్, పెండింగ్ డిఏ బకాయిలు, పిఆర్‌సి బకాయిలు, మధ్యంతర భృతి అంశాలపై వినతిపత్రం అందించారు. నాయకులు శాంతిబాయి, వెంకటేశ్వర్లు, వందనం బాబు, ఫ్లారెన్స్, బాజీ, మాధవిదేవి, రేణుక పాల్గొన్నారు.

## సేద్యపు నీటికుంటలకు ఎమ్మెల్యే శంఖుస్థాపన

నరసరావుపేట, మే 20 ప్రభాతవార్త : సేద్యపు నీటికుంటల నిర్మాణానికి మంగళవారం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శ్రీకారం చుట్టారు. ఎంపిడిఓ టి.వి.కృష్ణకుమారి, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు మాట్లాడుతూ రైతులకు పెద్దపీట వేసి అండగా నిలిచే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు.



నీటికుంటల నిర్మాణంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వర్షపునీటిని వడిసిపట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అన్నదాతలకు అవసరమైన అనేక కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలియజేశారు. త్వరలోనే రైతు భరోసా నిధులను జమ చేయడం జరుగుతుందని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం పట్ల జేసి హర్షం

నరసరావుపేట, మే 20 ప్రభాతవార్త : రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం నిర్వహణ పట్ల జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా రెవిన్యూ ఆఫీసర్ మురళీ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జేసి సూరజ్‌గనోరే మాట్లాడుతూ రహదారుల ప్రమాదాలలో గాయపడినవారికి సర్జరీ సమయాలలో రక్తం ఎంతో అవసరం అవుతుందన్నారు. వేసవికాలం కావడం వలన రక్తనిధుల కొరత అధికంగా ఉంద న్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని సూచించారు. 50 మంది రక్తదానం చేయడం సంతోషమన్నారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు మురళీకృష్ణ, శ్రీనివాసగుప్తా, బత్తుల మురళీ, డాక్టర్ రెహంతుల్లా, అధికారులు లీలాసంజీవకుమారి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.




## లక్ష్మి నరసింహస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.లక్షా 1,116 విరాళం

నరసరావుపేట టౌన్, మే 20 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలోని పులుపులవారి వీధిలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి భక్తులు మంగళవారం విరాళం అందజేశారు. వివరాలను కమిటీ సభ్యులు తెలియజేశారు. నరసరావుపేటకు చెందిన వెన్నా శ్రీనివాసరెడ్డి - నిర్మలా దంపతులు విష్ణువర్ధన్‌రెడ్డి - ఇందుమతిలు ఆలయంలో జరుగుతున్న రాతి నిర్మాణానికి రూ.ఒక లక్షా 1116లను సమర్పించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందించారు.



## ఆలయాలలో పోలీసుల విస్తృత తనిఖీలు

నరసరావుపేట క్రైం, మే 20 ప్రభాతవార్త : పల్నాడు జిల్లాలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆలయాలలో ప్రత్యేక తనిఖీలు జరిగాయి. మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో డాగ్ స్క్వాడ్‌తో స్థానిక పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతతకు భంగం కలిగించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ జరుగుతుందన్నారు. ముఖ్యంగా దేవాలయాల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సి.సి.కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆలయ కమిటీలకు సూచనలు చేశామన్నారు. అనధికార వాహనాలు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను తక్షణమే పోలీసులకు అందించాలన్నారు.



## ఆపదలో ఉన్నవారికి చేయూత సీఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, మే 20 ప్రభాతవార్త: ఆపదలో ఉన్న వారికి శ్రీరామరక్షలా ముఖ్యమంత్రి సహాయనిధి చేయూత అందిస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 34 మంది



లబ్ధిదారులకు రూ.39 లక్షల 93,320 విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉండి ఆసుపత్రి బిల్లులు కట్టలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వారి కుటుంబాలకు ఎంతగానో సహాయపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వదేశమైనా, విదేశమైనా క్రీడల్లో దూసుకుపోవాలి

మాచర్ల, మే 20 ప్రభాతవార్త: స్వదేశమైనా, విదేశమైనా క్రీడాపోటీల్లో దూసుకుపోవాలని నియోజకవర్గ క్రీడాకారులకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. గతంలో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ కొమెర నీలంరాజుకు రూ.లక్ష 61,660 నగదును అందజేశారు. అనంతరం క్రీడాకారులు వెయిట్ లిఫ్టర్స్ సాధించిన పతకాలను





ఎమ్మెల్యేకు చూపించగా... వారిని అభినందించారు. ఈ ఏడాది జనవరి 31న ఉత్తరాఖండ్‌లో 67 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో నీలంరాజు గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నీలంరాజును ఎమ్మెల్యే జూలకంటి ఘనంగా సన్మానించి, భవిష్యత్తు పోటీలకు ఏ అవసరమున్నా అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. వెయిట్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేసుకోవడానికి ఒలింపిక్ వెయిట్ లిఫ్టింగ్ బార్ బేరింగ్ సెట్ లిఫ్టింగ్ వెయిట్స్ కావాలని ఎమ్మెల్యేను నీలంరాజు కోరారు. ఈ క్రమంలో ఇచ్చిన హామీ మేరకు నగదును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శివకేశవ యాదవ్, హనుమాన్ జిమ్ నిర్వాహకులు ఆదివిష్ణుయాదవ్, వెయిట్ లిఫ్టర్స్ మంజుల అశోక్, కందుకూరి హేమావతి, అప్పల మల్లికార్జునరావు, రాకేష్, రణధీర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: కార్మిక నాయకులు



మాచర్ల, మే 20 ప్రభాతవార్త: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ మంగళవారం మాచర్ల పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు సీఐటీయూ నాయకుడు మహేష్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించాలన్నారు. లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులు హరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అబ్రహం లింకన్, నాగేశ్వరరావు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## హత్యకు గురైన చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం

మాచర్ల, మే 20 ప్రభాతవార్త: రాజకీయ కక్షతో వైకాపా రక్కసి మూకల చేతిలో హతులైన వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త తోట చంద్రయ్య కుమారుడు వీరాంజనేయులుకు ప్రభుత్వ శాశ్వత ఉద్యోగం కల్పిస్తూ ఏపీ కేబినెట్ ఏకగ్రీవంగా మంగళవారం తీర్మానించింది. ఈ విషయాన్ని ఏపీ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్క కార్యకర్తను కాపాడుకోవడంలో అధినేత చంద్రబాబు ముందుంటారని నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు కొనియాడారు. ప్రభుత్వ నిర్ణయంతో దివంగత చంద్రయ్య కుటుంబానికి చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకొని ఆదుకున్నారని పార్టీ పెద్దలు హర్షం తెలియజేసి, ప్రశంసించారు.



## మంత్రి నారాయణను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మే 20 ప్రభాతవార్తః రాష్ట్ర సెక్రటేరియట్‌లో మంగళవారం రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణను గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. గురజాల నియోజకవర్గంలోని పట్టణాల అభివృద్ధిపై చర్చించి నిధులను కోరగా మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించి పిడుగురాళ్ల మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం కొరకు రూ. 5 కోట్లు మంజూరు చేశారు. అలాగే గురజాల మున్సిపాలిటీలో సుంకరకుంట చెరువు పూడికతీత, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, ట్రాక్ చుట్టూ లైటింగ్, సుందరీకరణకు గాను రూ. 2 కోట్లను మంజూరు చేశారు. మాచర్ల – గుంటూరు రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా మెయిన్ డ్రెయిన్స, అవుట్‌ఫాల్ డ్రెయిన్స్ నిర్మాణం కొరకు రూ. 3 కోట్లను మంజూరు చేశారు. అభివృద్ధి పనులకు నిదులను అడుగగానే సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే యరపతినేని మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.



## నేడు యోగాంధ్ర క్యాంపెయిన్ - 2025

పిడుగురాళ్ల, మే 20 ప్రభాతవార్తః ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర క్యాంపెయిన్ –2025ను బుధవారం పట్టణంలోని శ్రీవాసవీ కళ్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు ప్రారంబించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. పట్టణ ప్రముఖులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

నరసరావుపేట, మే 20 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా కేంద్రంలో ఏపియుడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్, ఫెడరేషన్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ నాయకులు టీవీ-9 ప్రసాద్, వార్త జగన్‌మోహన్‌రెడ్డి, సాక్షి రమణారెడ్డి, ఐ న్యూస్ నాగరాజు, లవకుమార్‌రెడ్డి తదితరులు నాయకత్వం వహించి మాట్లాడారు. కారంపూడి మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవి ఎన్నిక సమయంలో న్యూస్ కవరేజ్‌కు వెళ్ళిన సాక్షి విలేకరి అజయ్‌పై టిడిపికి చెందిన నాయకులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరచడం జరిగిందన్నారు. దాడి చేసిని



వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టులకు విధుల నిర్వహణలో రక్షణ కల్పించాలన్నారు. అదే విధంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయంలోనూ నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

## కాసు బ్రహ్మానందరెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు అమూల్యమైనవి : కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట, మే 20 ప్రభాతవార్త : టంగుటూరి ప్రకాశం పంతులు, కాసు బ్రహ్మానందరెడ్డి సేవలు అమూల్యమైనవని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక క్యాంప్



కార్యాలయంలో వారి వర్ధంతి సందర్భంగా నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కాసు బ్రహ్మానందరెడ్డి పల్నాడు జిల్లాతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా, ఆంధ్రరాష్ట్రానికి విస్తృతమైన సేవలు అందించారన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వేజోన్, విశాఖ స్టీల్ ప్లాంట్ శంఖుస్థాపన, పేదలకు పక్కా గృహాలు, అత్యుత్తమమైన 55 ప్రతిష్ఠాత్మక భారీ సంస్థలను నెలకొల్పడం ఆయన హయాంలో జరిగిందన్నారు. అదే విధంగా ప్రకాశం పంతులు తన ఆస్థి మొత్తాన్ని దేశ ప్రజల కోసం త్యాగం చేశారన్నారు. ధైర్యానికి మరోపేరుగా ఆయనను ఇప్పటికీ ఆదర్శంగా తీసుకుంటారని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యన్నం రాధాకృష్ణారెడ్డి, మద్ది రామబ్రహ్మానందరావు, చెంచిరెడ్డి, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, ఏసిరెడ్డి సుబ్బారెడ్డి, సాగిరెడ్డి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠకు తెర!

### - కంచుకోటలో పాగా వేసిన తెదేపా... కారంపూడి వైస్ ఎంపీపీగా రమాదేవి పూర్ణయ్య

కారంపూడి, మే 20 ప్రభాతవార్త: కారంపూడి మండల పరిషత్ ఉపాధ్యక్షుడి ఎన్నిక సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. వేపకంపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కోక అక్కమ్మ గతంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. ఆమె మృతి చెందడంతో ఉపాధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మార్చి 27, 28 తేదీన ఎన్నిక నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. వైకాపా ఎంపీటీసీలు గైర్హాజరవడంతో ఎన్నిక వాయిదా పడింది. సోమవారం జరిగిన ఉపాధ్యక్షుని ఎన్నికకు గాదెవారిపల్లి ఎంపీటీసీ సభ్యుడు





సైదారెడ్డి బలపరచగా ఒప్పిచర్ల ఎంపీటీసీ సభ్యులు మద్దతు పలకడంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది. చిన్నగార్లపాడు, చింతపల్లి ఎంపీటీసీ సభ్యులు హాజరుకావడంతో పేటసన్నెగండ్ల, ఎంపీటీసీ సభ్యులు –2 పూర్ణయ్య రమాదేవి ఏకగ్రీవం అయ్యారు. వైకాపాకు చెందిన ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు ఎన్నికకు దుమ్మా కొట్టారు. ఎన్నికను ఎన్నికల అధికారి సిద్ధలింగమూర్తి, ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరి వ్యవహరించారు. గత సంవత్సర కాలం నుంచి కూటమి ప్రభుత్వం మండల పరిషత్తుపై కన్నేసింది. అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నాలు చేయగా ఫలించాయి. గాడిపర్తి పూర్ణయ్య రమాదేవి గతంలో వైకాపాలో కొనసాగారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వైకాపాకు దూరంగా ఉండి తెదేపాలో చేరడంతో ఎంపీకి సన్నిహితుడుగా ఉన్న పూర్ణయ్య తెదేపాలో చేరారు. తెదేపా కంచుకోటను దక్కించుకుంది. దీంతో ఉత్కంఠకు తెరపడింది. ఉపాధ్యక్షుడి ఎన్నిక అధికారులకు సవాలుగా మారడంతో ఉపాధ్యక్షుని ఎన్నిక ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పూర్ణయ్య రమాదేవిని ఎన్నికల అధికారి సిద్ధలింగమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. తెదేపా నేతలు పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, దొడ్డ వెంకటనారాయణ, గోళ్ల సురేష్ యాదవ్, తండా మస్తాన్‌జానీ, కటికల బాలకృష్ణ, బొమ్మిన శేషగిరిరావు, జక్కా నరసింహారావు, జక్కా పోతులూరయ్య, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనరు బూసా రామాంజనేయులు, బీజేపీ నేతలు సన్మానించి అభినందనలు తెలిపారు.

## వైభవంగా శివాలయ 29వ వార్షికోత్సవ వేడుకలు

రెంటచింతల, మే 20 ప్రభాతవార్త: ఆలయాల ప్రాశస్త్యానికి, భక్తుల నమ్మకానికి గుర్తుగా నిలిచే వార్షికోత్సవాలను పురస్కరించుకుని రెంటచింతలలోని శివాలయం (మల్లేశ్వరస్వామి దేవస్థానం)లో మంగళవారం ఆలయ 29వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవం రమణీయంగా కనులపండువగా జరిగింది. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం లక్ష మల్లెల అర్చన, శాస్త్రోక్తంగా శివపార్వతుల శాంతి కల్యాణం జరిపారు. మధ్యాహ్నం మంత్రపుష్పం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, అన్న సమారాధన నిర్వహించారు. స్వామివార్లకు మహిళలు సారె చీర, ఒడిబియ్యం నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి రామిరెడ్డి, ఆలయ నిర్వాహకులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థల కేటాయింపు

రెంటచింతల, మే 20 ప్రభాతవార్త: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణానికి మిట్టగుడిపాడు గ్రామ సమీపంలో అయిదు ఎకరాల స్థలం కేటాయిస్తూ స్థానిక రెవెన్యూ అధికారులు నిర్ణయం గైకొన్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.4 కోట్ల 10 లక్షలు ఐటీడీఏ నిధులు కేటాయించగా స్థల సేకరణ చేసిన రెవెన్యూ అధికారులు మిట్టగుడిపాడులోని కస్తూర్బా విద్యాలయం సమీపంలోని 447/3 సర్వే నంబరులోని 6.5 ఎకరాల్లో అయిదు ఎకరాల భూమిని ఐటీడీఏకు అప్పగించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే జూన్ 5 నుంచి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. వైకాపా హయాంలో 2020 జులైలో రూ.4.5 కోట్ల నిధులు గురుకుల పాఠశాలకు మంజూరై నప్పటికీ నాటి రాజకీయ నేతల అలసత్వం, స్థలం కేటాయింపు జాప్యం కారణంగా నిధులు వెనక్కి మళ్లాయి. ఈ విషయాన్ని ఇటీవల స్థానిక నేతలతోపాటు ప్రిన్సిపల్ సింహాద్రిమోహన్, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన రెవెన్యూ వర్గాలతో, ఐటీడీఏ అధికారులతో పలుమార్లు సంప్రదింపులు చేసి గురుకుల పాఠశాల నిర్మాణానికి కార్యరూపం చేసి ఎన్నికల హామీ నెరవేర్చారు.



## తెలుగువారి ధీరత్వానికి ప్రతీక 'ఆంధ్రకేసరి'

రెంటచింతల, మే 20 ప్రభాతవార్త: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం 69వ వర్ధంతి వేడుకలను స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పుష్పగుచ్ఛాలతో అలంకరించిన కేసరి చిత్రపటానికి ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్, గన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ నిర్వాహకులు నారాయణపురం శ్రీనివాసరావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు ప్రకాశం పంతులు సేవలను, ఆశయాలను స్మరిస్తూ అన్యాయాన్ని ఎదిరించడం, నిజాన్ని నిర్భయంగా చెప్పడం వంటి నైజం గల ప్రకాశం పంతులు ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, స్వరాష్ట్ర సాధనలో ప్రకాశం పంతులు కీలకపాత్ర పోషించారన్నారు. బ్రిటిష్ తుపాకీకి గుండెను చూపిన సాహసి ఆంధ్రకేసరి టంగుటూరి తెలుగువారి ధీరత్వానికి ప్రతీకగా నిలిచారన్నారు. తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రకాశం పంతులు తరతరాలకు స్ఫూర్తిదాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో కె.శివ, కాసిం, వై.శ్రీనివాసరావు, జల్లా వెంకటేశ్వర్లు, నాజర్ తదితరులు పాల్గొన్నారు.



# నేటి క్రీడాకారులే భావిభారత సైనికులు!

## మాచర్లలో 300 పడకల ఆసుపత్రికి నిధులు కేటాయిస్తా!

## - ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

వెల్దుర్తి, మే 20 ప్రభాతవార్త: క్రీడలు యువతలో ఉత్సాహాన్ని, మానసిక ఉల్లాసాన్నిస్తాయి. నేటి క్రీడాకారులే రేపటి భావిభారత సైనికులు అని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. మండల పరిధిలోని శిరిగిరిపాడు గ్రామంలో సోమవారం రాత్రి తలపెట్టిన జాతీయస్థాయి వాలీబాల్ టోర్నమెంటు పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో



ఆటస్థలంలో కాసేపు వాలీబాల్ ఆడి ప్రోత్సహించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్రా పేరుతో రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని విమర్శించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరిక మేరకు మాచర్లకు 100 పడకలే కాదు 300 పడకల ఆసుపత్రికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రనభుత్వం, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు.

**ప్రోత్సహిస్తే క్రీడాకారులకు కొదవలేదు: ఎమ్మెల్యే జూలకంటి**

క్రీడలను ప్రోత్సహిస్తే పల్నాడులో క్రీడాకారులకు కొదవలేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. అంతర్జాతీయ బ్లైండ్ క్రికెట్ కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డి, జాతీయ వెయిట్ లిఫ్టర్ నీలం రాజు వంటి వారు మాచర్ల నియోజకవర్గ కీర్తిని చాటారని కొనియాడారు. నీలంరాజు వెయిట్ లిఫ్టింగ్ పరికరాలకు రూ.లక్ష 61,660 రూపాయల నగదు సాయాన్ని ఎమ్మెల్యే జూలకంటి ప్రకటించారు.

**క్రీడా మైదానాలకు ఆర్థికసాయం: శాప్ ఛైర్మన్ రవినాయుడు**

మాచర్ల నియోజకవర్గంలో ఎన్ని క్రీడామైదానాలు నిర్మించుకుంటారో తెలియజేస్తే వాటికి తగినన్ని నిధులు శాప్ ద్వారా అందిస్తామని ఏపీ శాప్ ఛైర్మన్ రవినాయుడు హామీ ఇచ్చారు. మారుమూల ప్రాంతమైన శిరిగిరిపాడులో జాతీయస్థాయిలో ఇలాంటి స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రీడలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్, టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ కళ్లం రామాంజిరెడ్డి, నిర్వాహకులు కళ్లం శ్రీకాంత్‌రెడ్డి, యువనాయకులు జూలకంటి అక్కిరెడ్డి, కేశిరెడ్డి హనిమిరెడ్డి, తెదేపా, బీజేపీ నియోజకవర్గస్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన తెదేపా నేతలు



విజయపురిసౌత్, మే 20 ప్రభాతవార్త: విజయపురిసౌత్‌కు చెందిన అంకాల కోటేశ్వరరావు (60) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని తెదేపా నేతలు మంగళవారం పరామర్శించారు. తెదేపా సీనియర్ నాయకులు, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ వైస్‌ఛైర్మన్ గుండాల శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు డా॥ బసివిరెడ్డి, సత్తిబాబు, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, నర్సింహులు, తగుళ్ల కృష్ణ, బాలస్వామి, బుద్ధారెడ్డి, జగదీష్, శ్రీను, రామాంజనేయులు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ తప్పులు, పాపాల వల్లే పథకాల అమల్లో జాప్యం : ప్రత్తిపాటి

యడ్లపాడు, మే 20, ప్రభాతవార్త : గత ప్రభుత్వం విధ్వంసం వల్లే ఎక్కడా రోడ్లపై గుంతలు పూడ్చలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం వేగవంతమైందని, గ్రామాల్లో పొలాలకు వెళ్లే డొంకలు, చిన్న రోడ్లను కూడా బాగుచేస్తున్నారని మాజీ మంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మండల పరిధిలోని జాలాది గ్రామంలో మెటల్ రోడ్డుకు శంకుస్థాపన చేసి పది లక్షలతో నిర్మించిన కాలువల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసి అక్కడ నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదల్ని మాటలతో వంచించడం వంటివి కూటమి ప్రభుత్వం చేయదని. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి అందాల్సిన బకాయిలు కూడా త్వరలోనే అందచేయనున్నారు. జాలాది కొప్పురు మధ్య 40లక్షలతో నిర్మిస్తు కాన్వస్ రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభించటం జరుగుతుందన్నారు.



చంద్రబాబు ప్రభుత్వంరాబోయే మూడు నెల్లలో మూడు పథకాలు అమలు చేయనుందని, ఆగస్ట్ లో ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం, దానికంటే ముందే కొద్దిరోజుల్లోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రారంభించనుందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు వల్ల ప్రస్తుతం ప్రజలకు అందాల్సిన పథకాల్లో జాప్యం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సామాజిక పింఛన్లు పెంచి నెలనెల ఒకటోనే అందిస్తోందన్నారు. సూపర్ 6 పథకాలు అన్నీ ఈ ప్రభుత్వం ఖచ్చితంగా అమలుచేస్తుందన్నారు. గత ప్రభుత్వం దిగిపోతూ రాష్ట్రాన్ని ఖాళీడబ్బా ఇచ్చి వెళ్లారని తెలిపారు. గత తప్పులను సరిచేస్తూనే చంద్రబాబునాయుడు ప్రజలందరికోసం కృషిచేస్తున్నారని తెలిపారు. వచ్చే నెల ప్రభుత్వం కొత్తగా లక్ష సామాజిక పింఛన్లు మంజూరు చేయబోతుందని, అర్హులైన వారు వెంటనే దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. గ్రామస్థులు తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలు అన్ని పరిష్కరిస్తానని, పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నందున గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కందుల రమణ, కామినేని సాయిబాబు, షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్ మోహన్, కందిమల్ల రఘురామారావు, సుబ్బారావు, పోపూరి వెంకయ్య, శివప్రసాద్, మోహన్, బాబు, ఎంపీడీవో హేమలతాదేవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం

సత్తెనపల్లి, మే 20 ప్రభాతవార్త : నెల్లూరు ఏపి పిటిడి జోన్ 3 పరిధిలోని వివిధ బస్‌స్టేషన్ బస్ డిపోలలో ఖాళీగా ఉన్న 26 ఓపెన్ ప్రదేశాలను 15 సంవత్సరాల పాటు లీజు పద్ధతిలో ఇవ్వనున్నట్లు పల్నాడు జిల్లా రవాణా అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించిన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. సత్తెనపల్లి బస్టాండ్‌లో 2000 చదరపు గజములు, అచ్చంపేట బస్‌స్టేషన్ పరిధిలో 1597 చదరపు గజములు, అమరావతి (బిట్-1) బస్‌స్టేషన్ పరిధిలో 3872 చదరపు గజములు, అమరావతి (బిట్-2) బస్‌స్టేషన్ పరిధిలో 6582 చదరపు గజములు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. జిల్లా ప్రజా రవాణా అధికారి నరసరావుపేట ఆఫీస్ నందు సంప్రదించాలన్నారు. ఈ నెల 23వతేదీ ఉదయం 11 గంటలకు అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. వివరాలకు : 9959225429 ను సంప్రదించాలన్నారు.

## భక్తాంజనేయస్వామికి చందన అలంకారం



సత్తెనపల్లి, మే 20 ప్రభాతవార్త : పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయస్వామి వారి దేవస్థానంలో హనుమత్ జయంతోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారికి అర్చకస్వామి వేదాంతం విజయ నరసింహాచార్యులు చందన అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం, 108 మామిడి ఫలాలతో విశేష అర్చన, రంజిత్‌కుమార్ ఆర్కెస్ట్రా చే భక్తి సంగీత కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దోగిపర్తి శ్రీనివాసు, కొప్పురావూరు గురుప్రసాద్, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, కృష్ణసాయి వసుంధర, సుకన్య, దేవరశెట్టి లక్ష్మి, రాజేశ్వరి, ప్రసన్న పాల్గొన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

## వైకాపా బిసి సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా శివనాగేశ్వరరావు



సత్తెనపల్లి, మే 20 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి ఎల్.అప్పిరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ యాదవ్, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని 139 కులాలను ఏకం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

# లిక్కర్ స్కాంలో జగన్ జైలుకెళ్లడం ఖాయం : ప్రత్తిపాటి

### మినీ మహానాడులో పాల్గొన్న యంపి కృష్ణ దేవరాయలు, పిల్లి మాణిక్య వరప్రసాద్, చదలవాడ అరవిందబాబు
### నియోజకవర్గ పరిధిలోని 60 గ్రామాలు, 38 వార్డుల నుంచి కదం తొక్కిన పసుపు సైనికులు



చిలకలూరిపేట,మే20,ప్రభాతవార్త: రాష్ట్రం బాగుపడాలనుకునే వారంతా జగన్ జైలుకు వెళ్లాలనే కోరుకుంటున్నారని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆయన జైలుకు వెళితే రాష్ట్రానికి పెట్టుబడులు వరదల్లా వస్తాయని ప్రత్తిపాటి వివరించారు. కూటమి పార్టీల శ్రేణులు బేధాభిప్రాయాలు పక్కన పెట్టి ఐక్యంగా పనిచేయాలన్నారు. 15 సంవత్సరాలు అధికారంలో ఉండాలన్న లక్ష్యం తప్ప, ఎవరూ ఎలాంటి అభిప్రాయ బేధాలకు తావు ఇవ్వవద్దని ప్రత్తిపాటి సూచించారు. కడపలో ఈనెల 27,28,29 తేదీలలో జరగనున్న మహానాడుకు చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ



పరిధిలోని అన్ని గ్రామాలు, పట్టణంలోని 38 వార్డులనుంచి పాల్గొనటానికి సంసిద్ధులు కావాలని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో మంగళవారం రాత్రి మినీ మహనాడును వైభవంగా నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో జరిగే మహనాడులో చిలకలూరిపేట నియోజకవర్గ ప్రతిష్ట కనపడే విధంగా వేల సంఖ్యలో తరలివెళదామని, దానికి ప్రతి ఒక్కరూ కార్యరూపం దాల్చాలని పిలుపునిచ్చారు. తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి ప్రత్తిపాటితో పాటు నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు, నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, పల్నాడుజిల్లా టిడిపి అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, చిలకలూరిపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ప్రజలే బానిసలనుండి ప్రజలే దేవుళ్లుగా ఈ సమాజాన్ని మార్చిన ఘనత అన్న నందమూరి తారకరామారావుకు దక్కుతుందని అన్నారు. సమాజమనే మురికికూపం నుండి సమాజాన్నే దేవాలయంగా మార్చిన ఘనత కూడా అన్న నందమూరికే దక్కుతందన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కును కల్పించడం, రెండు రూపాయిలకు కిలో బియ్యం అందించడం, ప్రతి పేదవాడికి శాశ్వత గృహ నిర్మాణం లాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలకు అందించిన మహనీయుడు నందమూరి తారకరామారావు అని ఆయన వివరించారు. అదేబాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పయనిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకొని వెళుతున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేయడం ప్రజలందరికి తెలిసిన విషయమేనని అన్నారు. ఈ అప్పుల ఊబిలోనుంచి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లడమే కాకుండా, తాను ఎన్నికలలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలన్నింటికి నెరవేరుస్తున్నారని వివరించారు. ఇప్పటికే ఫించన్ రూ 4వేలకు పెంచడం, మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జూన్ మొదటి వారంలో తల్లికి వందనం కార్యక్రమంలో ఇంటిలో ఎంతమంది చదువుకుంటే ప్రతి ఒక్కరికి రూ 15వేల వంతున అందచేస్తానని ప్రకటించడ జరిగిందన్నారు. అదేవిధంగా ఆగస్టు 15నుంచి రాష్ట్రంలోని మహిళలందరికి ఉచిత బస్ ప్రయాణం, రైతులకు రైతుబంధు పథకాన్ని కూడా ఈ సీజన్‌లోనే అందించడానికి రంగం సిద్ధం చేశారని వివరించారు. చెప్పినవే కాకుండా చెప్పని సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా ఉంచటానికి అన్ని రంగాలను ముందుకు



తీసుకువెళుతున్నారని ఈ సందర్భంగా ప్రత్తిపాటి వివరించారు. నరసరావుపేట యంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ ఈనెల 27,28,29 తేదిలలో కడపలో జరగనున్న మహానాడులో నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపి నటువంటి వేల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని చిలకలూరిపేట నియోజకవర్గ ప్రతిష్టను ఇనుమడింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ పరిశీలకురాలు ఉషారాణి,జిడిసిబి మాజీ ఛైర్మన్ మానం వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర నాయకులు షేక్ కరిముల్లా, ఇనగంటి జగదీష్‌బాబు, షేక్ నజీరున్నీసా బేగం, మిరియాల రత్నకుమారి, గుర్రం నాగపూర్ణచంద్రరావు, సింగర కొండయ్య చౌదరి, టిడిపి నియోజకవర్గ నాయకులు నెల్లూరి సదాశివరావు, కందుల రమణ, తేళ్ల సుబ్బారావు, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, గంగా శ్రీనివాసరావు, మురకొండ మల్లిబాబు, బత్తినేని శ్రీనివాసరావు, అచ్చుకోల విజయభాస్కర్, తోట సత్యం, మహిళా నాయకులు అమరా రమాదేవి, పోపూరి లక్ష్మీ, మున్సిపల్ కౌన్సిలర్లు, రాష్ట్ర,జిల్లా,నియోజకవర్గంలో వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు, 60 గ్రామాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, 38 వార్డులకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

## నరసరావుపేట సెంటర్ వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

చిలకలూరిపేటటౌన్,మే20,ప్రభాతవార్త: కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో బాగంగా మంగళవారం పట్టణంలోని నరసరావుపేట సెంటర్ వద్ద ఏఐటియుసి కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్ని యుద్ధవాతావరణం కారణంతా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదాపడిన నేపద్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టటం జరిగిందని నియోజకవర్గ ఏఐటియుసి అధ్యక్షులు




పేలూరి రామారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షకులను నడ్డివిరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణను నిలిపివేయాలని తెలిపారు. కార్మికులకు, కార్మికశాఖ ద్వారా సభ్యత్వాలను నమోదు చేసి సంక్షేమపథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ సిపిఐ మాజీ కార్యదర్శి నాగబైరు సుబ్బాయమ్మ, ఏఐటియుసి నాయకులు నాయుడు శివకుమార్, తన్నీరు వెంకటేశ్వర్లు, షేక్ ఖాదర్‌వలి, ఆరాధ్యుల రామకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎన్ కృష్ణ, దాసరి లింగారావు, వేలూరు లెనిన్ యూనిట్ సిపిఐ కార్యదర్శి బొంగా భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 29న ప్రత్తిపాటి పుట్టినరోజు సందర్భంగా ఉచిత మెగా కంటివైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి : పట్టణ సిఐ రమేష్

చిలకలూరిపేట,మే20,ప్రభాతవార్త: మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 29వ తేదిన పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వహిస్తున్నట్లు పట్టణ సిఐ పి రమేష్ తెలిపారు. ఈ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గ పరధిలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ శిబిరంలో కంటి సమస్యతో బాదపడే వారికి



ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తారని ఆయన వివరించారు. పెదకాకానికి చెందిన శంకర కంటి ఆసుపత్రి వైద్యబృందం ఈ కంటి పరీక్షలను చేస్తుందని ఆయన తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరం లేనివారికి పరీక్షలు నిర్వహించి ఉచితంతా మందులు అందచేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియచేస్తారని అన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని శంకరకంటి ఆసుపత్రికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలలో తీసుకొని వెళ్లి శస్త్ర చికిత్సలు చేయించి తిరిగి వారిని చిలకలూరిపేట తీసుకువస్తారని ఆయన వివరించారు. అదేవిధంగా జన్మదినం జరుపుకోనున్న ప్రత్తిపాటి పుల్లారావు గారికి ముందస్తుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ శిబిర కన్వీనర్‌గా పనిచేస్తున్న టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. శ్రీనివాసరావుతో పాటు టిడిపి నాయకులు పావులూరి వెంకటేశ్వర్లు, కరణం వెంకటశివ, ఆరె మల్లిఖార్జునరావు, ఈవూరి బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

## గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి

చిలకలూరిపేట,మే20,ప్రభాతవార్త: జ్ఞానేశ్వరి ఆర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కళ్యాణమండపం కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి, షేక్ సిద్దాంతి కరిముల్లా, గార్డ్స్ సంస్థ సలహాదారులు మాజీ ఎజిపి దాసరి చిట్టిబాబు, ఆర్యవైశ్య ప్రముఖులు కెవిఎస్ కృష్ణుడు, జెవివి రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, గార్డ్స్ సంస్థ సభ్యులు రవి, ఇనగంటి నాగరాజు, గేరా యాకోబు, పి బుల్లిబాబు, షేక్ బాజీ, కుల్లి రాజ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీరందరూ మాట్లాడుతూ దేశంకోసం సర్వస్వం ధారాదత్తం చేసిన గొప్ప స్వతంత్ర సమరయోదుడు ప్రకాశం పంతులు గారి విగ్రహన్ని చిలకలూరిపేటలో ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గార్డ్స్ సంస్థ తరుపున విగ్రహం ఏర్పాటుకు తమ వంతు సాయం అందిస్తామని దాసరి చిట్టిబాబు తెలియచేశారు.

## బహుజనవాదాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వినిపించిన ఆంథోని

సత్తెనపల్లి, మే 20 ప్రభాతవార్త : కోరబండి ఆంథోని 70వ జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్టీసీ అధికారిగా ఆయన విధులు నిర్వహిస్తూ



ఆంథోని బహుజన వాదాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వినిపించారని తెలియజేశారు. లోక్ జనశక్తి పార్టీ నాయకులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్, కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, విశ్రాంత డిఎస్పీ గంటెల రవికుమార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కత్తి పద్మారావు అనుచరునిగా ఎన్నో సామాజిక ఉద్యమాలను ఆయన చేశారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## డాక్టర్ రాయపాటి శైలజ పోరాడిన తీరు స్ఫూర్తిదాయకం



చిలకలూరిపేట,మే20,ప్రభాతవార్త: అమరావతి పరిరక్షణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి మహిళలు రైతులకు అండగా నిలచి, వారిని ప్రోత్సహిస్తూ నిరంకుశ ప్రభుత్వంపై డాక్టర్ రాయపాటి శైలజ పోరాడిన తీరు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సోమవారం రాత్రి గుంటూరు కన్వెన్షన్‌లో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పదవీ భాద్యతలు చేపట్టిన ప్రమాణ స్వీకార మహోత్సవ సభలో ప్రత్తిపాటి పాల్గొని ఆమెను సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆ సభలో ప్రత్తిపాటి మాట్లాడుతూ మంచి నాయకత్వ లక్షణాలు ఉన్న కుటుంబం నుంచి వచ్చిన శైలజ అమరావతి ఉద్యమంలో కీలకభూమిక పోషించడం రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా భాద్యతలు చేపట్టిన శైలజ భవిష్యత్ కాలంలో చట్టసభలలో కూడా తన గళం వినిపిస్తుంనే నమ్మకం తనకుందన్నారు. మహిళా కమిషన్ ఛైర్ పర్సన్‌గా మహిళల సంక్షేమం, భద్రతకు అధిక ప్రాధాన్యమిచ్చి ఆ పదవికే గొప్ప పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు.

## కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరిన బార్ అసోసియేషన్ న్యాయవాదులు



చిలకలూరిపేట,మే20,ప్రభాతవార్త: పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌నందు మున్సిపల్ అద్దెభవనంలో కోర్టు నడుస్తుందని, ఆ కోర్టుకు స్వంతభవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావును స్థానిక బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులంతా కలిసి వినతిపత్రం అందచేశారు. తప్పని సరిగా స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రత్తిపాటి బార్ అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు.

## పిడుగుపాటు మృతురాలి కుటుంబానికి రూ50వేలు ఆర్థిక సహాయం

చిలకలూరిపేట,మే20,ప్రభాతవార్త: పొలం పనులకు వెళ్లి పిడుగుపాటుతో మరణించిన షేక్ పర్వీన్ కుటుంబానికి ప్రభుత్వం అందచేసిన రూ 50వేల చెక్కును మంగళవారం ప్రత్తిపాటి తన నివాసంలో నరసరావుపేట ఆర్‌డిఓ మధులత సమక్షంలో అందచేశారు. యడ్లపాడు మండలం కారుచోల గ్రామానికి చెందిన షేక్ పర్వీన్ ఈనెల 14వ తేదిన కూలి పనులకు వెళ్లినపుడు పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మరణ వార్త తెలిసిన వెంటనే మృతురాలి



కుటుంబాన్ని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె భర్త జాన్‌సైదాకు ఆర్‌డిఓ మధులత సమక్షంలో రూ 50వేల చెక్కును అందచేశారు. ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక సాయం కూడా త్వరలో అందేలా చూస్తానని ప్రత్తిపాటి చెప్పారు. భార్య మృతితో అధైర్యపడకుండా పిల్లలను జాగ్రత్తగా చదివించి ప్రయోజకులను చేయాలని ప్రత్తిపాటి సైదాకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కామినేని సాయిబాబు, కారుచోల గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఐటిసి కంపెనీ బెదిరింపులు మానుకొని రైతులు పండించిన పొగాకు కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి :

చిలకలూరిపేట,మే20,ప్రభాతవార్త: రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న ఐటిసి కంపెనీతో పాటు అన్ని కంపెనీలు రైతుల వద్దనున్న పొగాకు మొత్తం కొనుగోలు చేయాలని కోరుతూ మంగళవారం సిపియం కార్యాలయంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ మాట్లాడుతూ రైతులు పండించిన పొగాకు మొత్తాన్ని ఐటిసి కంపెనీ



కొనుగోలు చేయాలని కోరూతూ ఈనెల 27వ తేదిన పట్టణంలోని నరసరావుపేట సెంటర్ వద్దనున్న ఐటిసి కంపెనీ వద్ద నిరాహారదీక్షను రైతు సంఘాల ఆధ్వర్యంలో చేయనున్నట్లు ఆయన వివరించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నా రైతులు పండించిన పొగాకును ఒక్క కేజీ కూడా ఏ కంపెని కొనకపోవడం దురదృష్టకరమన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఒక్క చిలకలూరిపేట నియోజకవర్గంలోనే ఎక్కువమంది ఎస్‌సి,ఎస్‌టి,బీసి మైనారిటి, చిన్నా, సన్నకారు, కౌలు రైతులు పొగాకును పండించారని ముందస్తు ప్రణాళిక వ్యవసాయశాఖ దగ్గర లేకపోవడంవలన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖా మంత్రి కంపెనీల చేత పొగాకు కొనిపిస్తామని చెప్పి జాడ, జవాబు ఇంతవరకు చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించి కొనుగోలు చేయాలన్నారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు సమస్య తీవ్రంగా ఉందని ప్రభుత్వం దీనిని వెంటనే పొగాకు బోర్డు పరిధిలోకి తేవాలన్నారు. అమెరికా, యూరఫ్ లాంటి దేశాలలో సిగరెట్ ఈ సమావేశంలో సిపిఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబూరావు, సిఐటియు నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, సిపిఐ మహిళా సంఘ నాయకులు చెరుకుపల్లి నిర్మల, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సాతులూరి లూథర్, ఏఐటియుసి నాయకులు దాసరి వరహలు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి యం రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్, ఐద్వా పట్టణ కార్యదర్శి టి భారతి, ఎస్ఎఫ్ఐ నాయకులు పి శివగణేష్, మున్సిపల్ యూనియన్ నాయకులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చి మంచినీరు సరఫరా చేస్తాం: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,మే20,ప్రభాతవార్త: వినుకొండ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి రజకకాలనీలోని రూ.19.89 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు జీ.వీ, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ పైప్‌లైన్ ఏర్పాటుతో కాలనీవాసులకు తాగునీటి ఇబ్బందులు దూరమవుతాయన్నారు. మక్కెన



సహకారంతో రజక కాలనీ ఏర్పాటు అయిందని కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా తాను చూసుకుంటానని జీ.వీ అన్నారు. త్వరలోనే పట్టణంలోని అన్ని వార్డుల్లో మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి సురక్షిత మంచినీరు సరఫరా చేస్తామని చెప్పారు. అంతర్గత రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. మక్కెన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రజక కాలనీ ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు అప్పటి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న జీ.వీ కూడా సహకరించాలని ధన్యవాదాలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో కాలనీలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సాంఘిక నాటిక ప్రదర్శనలు

వినుకొండ,మే20,ప్రభాతవార్త: ఎన్టీఆర్ 102వ జయంతి పురస్కరించుకొని నందమూరి తారక రామారావు కళాపరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని జూనియర్ కాలేజి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సాంఘిక నాటిక ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సోమవారం సాయంత్రం తొలిరోజు కార్యక్రమాన్ని ముప్పాళ్ళ చెన్నయ్య,రాపర్ల శ్రీనివాసరావు,శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్





ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతిలు జ్యోతి ప్రజ్వలన చేయగా, ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు నటరాజ పూజ చేసి ప్రదర్శనలు ప్రారంభించారు. డిఎల్‌డిఏ మాజీ ఛైర్మన్ లగడపాటి వెంకట్రావు, న్యాయవాది ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు కుటుంబ సభ్యులకు ప్రోత్సహక పారితోషకాన్ని అందజేశారు. తల్లిదండ్రుల ప్రేమ ఇతివృత్తంగా చేసుకొని ఉషోదయ కళానికేతన్ కాట్రపాడుకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కిడ్నాప్ నాటిక అలరించింది. కొలకలూరు సాయి ఆర్ట్స్ ఆధ్వర్యంలో రైళ్ళలో సామాన్యుల కష్టాలు తెలియజేస్తూ ప్రదర్శించిన జనరల్ బోగీలు నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకట కోటయ్య, జ్ఞానేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కౌన్సిలర్ షకీలా, పి.వి సురేష్‌బాబు, జనసేన నాగశ్రీనురాయల్, పెనుగొండ శ్రీనివాసరావు, లాయర్ సైదారావు తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లోకి వచ్చిన దుప్పి.. వీధి కుక్కల దాడిలో మృతి



బొల్లాపల్లి,మే20,ప్రభాతవార్త: అటవీ ప్రాంతం నుంచి అడవి దుప్పి దారి తప్పి పంట పొలాల్లోకి చేరిన సంఘటన మండలంలోని వెల్లటూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కాగా దుప్పిపై గ్రామంలోని వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో దుప్పి మృతి చెందింది.

## కడప మహానాడును జయప్రదం చేయండి

తాడేపల్లి,మే 20,ప్రభాతవార్త : కడపలో ఈనెల 27నుంచి 29వ తేది వరకు జరిగే టిడిపి మహానాడుకు నియోజకవర్గం నుండి పార్టీ కార్యకర్తలు,నాయకులు,అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు




యాదవ్,టిడిపి సీనియర్ నాయకులు చావలి ఉల్లయ్య పిలుపునిచ్చారు.ఈ మేరకు మంగళగిరిలో నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారి మినీ మహానాడును విజయవంతంగా జరుపుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు.మినీ మహానాడుకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ఏ విధంగా తరలివచ్చారో దీనికి రెట్టింపు ఉత్సాహంతో కడపలో జరిగే మహానాడుకి నియోజకవర్గం నుండి వేలాది మంది తరలి రావాలన్నారు.మంత్రి లోకేష్ గతంలో ఓడిపోయినప్పటికీ నియోజకవర్గ ప్రజలను అక్కున చేర్చుకొని 26రకాల సంక్షేమ పథకాలను అమలుచేశారన్నారు.లోకేష్ ఎమ్మెల్యేగా,మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.నియోజకవర్గంలో సొంత నిధుల నుంచి సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధిని వేగవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు.దేశంలోనే మంగళగిరి నియోజకవర్గం మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తున్నారన్నారు.రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే మహానాడుకు మంగళగిరి నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తలు,నాయకులు,అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని మంత్రి లోకేష్ నియోజకవర్గం ప్రత్యేకతను చూపాలన్నారు.కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు పల్లపాటి శ్రీనివాస్,ఉయ్యాల శంకరరావు,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

తాడేపల్లి,మే 20,ప్రభాతవార్త : మంత్రి నారా లోకేష్ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు పరచాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు కోరారు.సోమవారం రాత్రి మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని సీతానగరం శాఖ మహాసభ శీలం శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగింది.కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు,జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్,నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతి పాల్గొన్నారు.ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ తాడేపల్లి మంగళగిరి ప్రాంతంలో ఎర్రజెండాకి పెట్టింది పేరని అనేక కారణాలతో ప్రాంతీయ పార్టీలు కుల,మత,భాషల మీద వస్తున్న అనేక



సమస్యల కారణంగా ఓ అడుగు నెమ్మదించినా ప్రజలకు అంకితమై ప్రజలకు మేలు చేయడానికి పనిచేసే పార్టీ భారతీయ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు.సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ శాఖ మహాసభలో అనేక సమస్యలను లేవనెత్తినట్లు చెప్పారు.భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహాసభలు ఆగస్టు 4,5తేదీల్లో గుంటూరులో జరుగుతాయని అలాగే రాష్ట్ర మహాసభలు ఆగస్టు 22,23,24తేదీల్లో ఒంగోలులో జాతీయ మహాసభలు సెప్టెంబర్‌లో పంజాబ్‌లోని చండీఘర్‌లో జరుగుతాయన్నారు.కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య,తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య,సీనియర్ నాయకులు మానికొండ డాంగే,మాణిక్యాలరావు,తదితరులు పాల్గొన్నారు.

**--సిపిఐ సీతానగరం శాఖ నూతన కమిటీ ఎన్నిక**

సీతానగరం సిపిఐ శాఖ కార్యదర్శిగా శీలం శ్యామ్‌ప్రసాద్,కమిటీ సభ్యులుగా చలవాది గౌరీ,శీలం అనిల్,చలువాది బోసు,పాలగర్ల తిరుపతయ్యలను ఎన్నుకున్నారు.

# టిడిపి జెండానే పార్టీ ఏజెండా...మహానాడులో ఆలపాటి వెల్లడి

తెనాలి, మే 20. ప్రభాతవార్త : పేదు, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతితో పాటుగా రాష్ట్ర సంక్షేమ లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీ రామారావు పరిపాలన చేశారని కృష్ణ, గుంటూరు ఉమ్మడి ఎమ్మెల్సీ, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌విఆర్ కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న ఆలపాటి మాట్లాడుతూ కోటి సభ్యత్వాలు ఉన్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని అలాంటి పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తు చేశారు.



అవసరమైతే పార్టీ పదవులను కూడా త్యాగం చేయాలని ఎప్పుడు కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండాలని చివరి శ్వాస వరకు పార్టీ కోసమే పని చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజల కోసం ఎన్టీ రామారావు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని ఆయన తెలియజేశారు. అదే విధంగా త్మ గౌరవం కోసం ఎన్టీ రామారావు పనిచేస్తే ఆత్మవిశ్వాసం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పని చేస్తున్నట్లు ఆయన అన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ కూడా ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. గత ఐదేళ్ళ పాలనలో వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన చేశారని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాలను మాజీ మంత్రి ఎమ్మెల్సీ ఆలపాటి ప్రస్తావించారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఎప్పుడూ అండగా ఉండాలని, ఎన్ని కష్టాలు వచ్చినా అదే రేపు పడకుండా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేయాలని ఈ సందర్భంగా ఆలపాటి కోరారు. అదే విధంగా పలువురు టిడిపి నాయకులు మహానాడును ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా మహానాడులో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హనుమత్ జయంతి సందర్భంగా పూజలు

తెనాలి, మే 20 (ప్రభాతవార్త) : పట్టణంలోని మారీసుపేటలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం (రామభక్త అప్పల స్వామి గుడి)లో వేంచేసి ఉన్న వీరాంజనేయ స్వామికి



హనుమత్ జయంతి సందర్భంగా మూడు రోజుల పూజా కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు స్వామి వారికి ఆకుపూజ, ప్రాతక్కాలర్చన, వడమాల మరియు అప్పలమాల సమర్పించడం అయినది. అలాగే హనుమత్ జయంతి రోజు స్వామివారికి విశేష కార్యక్రమాలులో భాగంగా భక్తుల చేత పంచామృత అభిషేకం, డ్రై ఫ్రూట్స్ పళ్ళరసాలతో అభిషేకం తమలపాకులతో సహస్రనామావళి పూజ, మరియు మామిడి పండ్లతో అష్టోత్తరం, ఎంతో విశేషమైన మన్య సూక్తం హోమం జరిపిస్తున్నట్లు భక్తులందరూ తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ధర్మకర్త లంక శివానంద్ కుమార్ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు కునపల్లి నారాయణస్వామి, లంక శివానందకుమార్, లంక శివాంజనేయ ప్రసాద్ పర్యవేక్షించగా, విష్ణుభట్ల ఆంజనేయ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ధనుష్, సుబ్రహ్మణ్యశర్మ కార్యక్రమాలను జరిపించారు.

## పద్మావతి అమ్మవారి ఉంజల్ సేవ

తెనాలి, మే 20 (ప్రభాతవార్త) : మండలంలోని జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య నగర్ రామాలయం నందు వేంచేసి ఉన్న పద్మావతి అమ్మవారి సప్తమ ఉంజల్ సేవ నిర్వహించారు. కొండపిదత్తు శర్మ ఆధ్వర్యంలో కటకంకోదండ రాంబాబు, అన్నపూర్ణ దంపతులచే నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి భక్తి గీతాలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ పూజా



కార్యక్రమంలో దంపతులు అందెబాల చంద్రమౌళి, రాజేశ్వరి, తన్మయి, ఆకురాతి రాజు, మౌనిక, వంగర సత్యనారాయణ, కోటేశ్వరమ్మ, జగ్గారపు మల్లేశ్వరరావు, చంద్రావతి, నందం చలమేశ్వరరావు, రేణుక, సువాసినిలచే భక్తి ప్రపత్తులతో అనేక మంది పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ ప్రసాద వితరణ జరిగింది.

## పేదలను ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



.కొల్లిపర,మే 20 ప్రభాతవార్త: షేక్ సయ్యద్‌బీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆర్థిక సహాయంగా రూ.5 వేలు నగదును ఇవ్వటంతో వారికి కొల్లిపర టీడీపీ నాయకులు షేక్ రఫీ,షేక్ ఇసాన్,వల్లభాపురం బసవయ్యలు అందజేసారు.ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు రఫీ మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు.

## రోడ్లపై నీరు నిలవకుండా చూచుకోవాలి

ఔకొల్లిపర,మే 20 ప్రభాతవార్త: భారీవర్షాలు పడుతున్నాయని రోడ్లపై నీరు నిలవకుండా



చూచుకోవాలని ఈవోపిఆర్‌డి భార్గవ్ అన్నారు.మంగళవారం మండల కేంద్రం కొల్లిపర గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ స్వచ్ఛ సంపద ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.తడి చెత్త..పొడి చెత్తను తప్పనిసరిగా వేరు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అలకనంద,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కిశోర బాలికల సాధికారత మనందరి బాధ్యత

కొల్లూరు, మే 20 (ప్రభాతవార్త) : కిశోర బాలికల సాధికారత కోసం ప్రజలందరూ బాధ్యత తీసుకోవాలని కొల్లూరు సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఎస్సీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ లింగ బేధం లేకుండా ఆడ మగ పిల్లలను సమానంగా చూడాలన్నారు.



మహిళలపై లింగ వివక్షత ఎక్కువగా ఉందని ప్రజలలో మార్పు తీసుకురావాలన్నారు. అసమాన అక్షరాస్యత రేట్లు వంటి వాస్తవాల ద్వారా ఈ లింగ అసమానతలు సమాజంలో కనబడుతున్నాయన్నారు. తల్లిదండ్రులు ఆడ పిల్లల పట్ల నిర్లక్ష్యం చూపకుండా వివక్షత చూపకుండా పిల్లలందరినీ సమానంగా సమాజంలో తీర్చిదిద్దారన్నారు. రుతుక్రమ సమయంలో బాలికలు పరిశుభ్రత పాటించాలన్నారు. కిశోర బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం వంటి పరిశుభ్రత, విద్య ప్రాముఖ్యతపై పలు సూచనలు ఇచ్చారన్నారు. ప్రభుత్వం బాలికలకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్లు, కిశోర బాధితులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లల నమోదు సర్వే

బాపట్ల,మే20,ప్రభాతవార్త: ఔమండల పరిధిలోని 0 నుండి 18 సంవత్సరాల వయసులోపు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించే సర్వేను సమగ్ర శిక్ష సిబ్బంది నిర్వహిస్తున్నారని బాపట్ల భవిత సెంటర్ కరుణ కుమారి తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ



సమగ్ర శిక్ష ఎపిసి ఆదేశాలతో సమగ్ర శిక్ష ప్రత్యేక అవసరాలు జిల్లా కో ఆర్డినేటర్ జోత్స్న ఆధ్వర్యంలో బాపట్ల భవిత సెంటర్లలో వివిధ గ్రామాలలో సర్వే నిర్వహించామన్నారు.6 నుండి 18 వయస్సు కలిగిన్న విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే విధంగా వారికి మెరుగైన విద్యను,ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వివరిస్తున్నామన్నారు.ఈనెల 13వ తేది నుండి జూన్9వ తేది వరకు ఇంటింటి సర్వే నిర్వహించటం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తెనపల్లిలో మినీ మహానాడు

సత్తెనపల్లి, మే 20 ప్రభాతవార్త : సత్తెనపల్లి తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ నాయకత్వంలో మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు తాత జయప్రకాష్ నారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాసనసభ్యులు



కన్నా లక్ష్మీనారాయణతో పాటు పార్టీ నాయకులు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్రవాదుల దాడిలో మరణించిన వీర సైనికులకు శ్రద్ధాంజలి ఘటించడం జరిగిందన్నారు. నియోజకవర్గానికి సంబంధించి 12 తీర్మానాలను ఆమోదించామన్నారు. మాజీ



ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రానున్న రోజుల్లో తెలుగుదేశంపార్టీ అభివృద్ధి చెందాలంటే అందరూ ఐక్యతగా కృషి చేయాలన్నారు. తెలుగుదేశంపార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అన్నారు. అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

సత్తెనపల్లి, మే 20 ప్రభాతవార్త : సత్తెనపల్లిలోని సబ్‌జైలును మంగళవారం న్యాయమూర్తి జియావుద్దీన్ సందర్శించారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ప్రభుత్వం



న్యాయ సహాయం చేస్తుందన్నారు. జైలులో అందుతున్న ఆహార పదార్థాలు, ముడి సరుకుల నాణ్యతను పరిశీలించారు. రిమాండ్‌లో ఎన్ని రోజుల నుండి ఉంటున్నారని ఈ సందర్భంగా ఆయన ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తితో పాటు ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు, వాలంటీర్ షేక్.సుభాని, సబ్‌జైల్ అధికారి వెంకటరత్నం పాల్గొన్నారు.

## బెల్లంకొండ షిఫ్ట్ ఆపరేటర్ ఆనంద్‌కుమార్ మృతి



బెల్లంకొండ, మే 20 ప్రభాతవార్త : బెల్లంకొండ షిఫ్ట్ ఆపరేటర్ ఆనంద్‌కుమార్ అకాలమరణం చెందారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మంగళవారం ఆయన మృతిపట్ల సంతాపాన్ని తెలియజేసింది. కాగా ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొండమోడులో ఆనంద్‌కుమార్ భౌతికకాయానికి అంత్య క్రియలను నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు తెలియజేశారు.

## పంట చేలోకి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం



పెదకూరపాడు, మే 20 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ఎస్.కాలువ సమీపంలో మొదటి డ్రాప్ వద్ద మిరప తోటలో విద్యుత్ స్తంభం పూర్తిగా నేలకొరిగి పోయి ప్రమాద భరితంగా ఉందని స్థానిక ప్రజలు తెలిపారు. ఒరిగిపోయిన స్తంభంలో కరెంటు సప్లయ్ ఉంటే అటువైపుగా సంచరిస్తున్న గేదెలు తీగలను తాకితే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని వారన్నారు. విద్యుత్‌శాఖ వారు ఈ ప్రమాదాన్ని గుర్తించి ఒరిగిపోయిన స్తంభాన్ని లేవనెత్తాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుతున్నారు.

## కుక్కల దాడిలో జింక మృతి


బెల్లంకొండ, మే 20 ప్రభాతవార్త : కుక్కల దాడిలో జింక మృతిచెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. అటవీ ప్రాంతానికి చెందిన జింక



వేసవికాలం కావడంతో దాహం తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోకి పొలాల్లోకి వచ్చింది. ఈ సమయంలో గ్రామానికి చెందిన కుక్కలు జింక పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో జింక కుక్కల దాడిలో మృతిచెందింది. ఫారెస్ట్ అధికారులు జింక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి

పెదకూరపాడు, మే 20 ప్రభాతవార్త : ఎన్నికలల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం అమరావతి మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో సిపిఐశాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సభకు ఎ.నాంచారయ్య అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల ఊబిలో



కూరుకుపోతున్నారన్నారు. రైతాంగాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ దేశం వెలుగు వెలిగిపోతుందని, సంవత్సరానికి నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం రెండు కోట్ల ఉద్యోగాలు రూపకల్పన చేయనున్నట్లు రైతాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని నమ్మబలికి గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారం వైపు తీసుకెళ్ళడంలో పూర్తిస్థాయిలో విఫలమైందని ఆరోపించారు. అటు రైతాంగం ఇటు కార్మికులు వ్యవసాయ కూలీలు అసంఘటిత కార్మికులు మధ్యతరగతి పేదరికంతో బాధపడుతున్న ప్రజా సమస్యల పరిష్కారం మార్గం వైపుకు తీసుకెళ్ళడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైఫల్యం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అమరావతి మండల సిపిఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు, టి.వెంకటేశ్వర్లు, కె.ఏసు, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలపై లింగ వివక్షత చూపరాదు

పెదకూరపాడు, మే 20 ప్రభాతవార్త : గ్రామంలో కిశోర వికాసం సీజన్ -6, సమ్మర్ క్యాంప్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ మున్ని మాట్లాడుతూ సమాజంలో బాలికలపై లింగ



వివక్షత చూపించరాదని ఆమె అన్నారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలల హక్కులు జీవన నైపుణ్యాల గురించి వారికి వివరించారు. కిశోర బాలికలు వారి వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త నసీమోన్, ఏఎన్ఎం శాంతకుమారి, ఆశా కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలు ద్వారా మహిళలు అభివృద్ధి చెందాలి.

కర్లపాలెం,మే20,ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉన్న మహిళలు అందరు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసిందని డిఆర్డిఏ పీడీ కే శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కర్లపాలెంలో ఆయన స్వయం సహాయక సంఘాల మహిళలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూపు సభ్యుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే హెచ్ ఎల్ పి ప్రిపరేషన్ గురించి ఆయన ప్రత్యేకంగా వారితో మాట్లాడారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి మరల రుణాలు తీసుకొని ఆర్థికంగా బలపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ సీసీ రాఘవ అకౌంటెంట్ లక్ష్మి వీవోఏలు పాల్గొన్నారు.

21-5Pg5.qxd:21-5Pg5.qxd 01/01/01 6:27 AM Page 1



# వక్ఫ్ సవరణచట్టంపై 3 అంశాలపైనే విచారణ!



## అభ్యంతరం తెలిపిన కపిల్‌సిబాల్, అభిషేక్ మనుసింఘ్వి

**న్యూఢిల్లీ, మే 20:** వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సిజెఐ బిఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసితో కూడిన ధర్మాసనం మంగళవారంనాడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా సిజెఐ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేననే భావన ఉందని, స్పష్టమైన సందర్భం వెల్లడి కానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోకూడదని అన్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదన్నారు. అంతకన్నా తాము చెప్పవలసిన అవసరం లేదని చెప్పారు. వక్ఫ్‌ను స్వాధీనం చేసుకోవడం ఈ చట్టం ఉద్దేశమని పిటిషనర్ల తరఫు లాయర్ కపిల్ సిబాల్ అన్నప్పుడు సిజెఐ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ చట్టంపై గత విచారణ సందర్భంగా, మూడు అంశాలపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయడానికి వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది. వాటిలో వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ కౌన్సిల్, స్టేట్ వక్ఫ్ బోర్డులకు ముస్లిమేతరుల నామినేషన్, వక్ఫ్ కింద ప్రభుత్వ భూముల గుర్తింపు వంటివి ఉన్నాయి. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించమని, ఈ మూడు అంశాలపై వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోమని సుప్రీంకోర్టుకు గత విచారణలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.

కాగా, మంగళవారం విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, వక్ఫ్ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి విచారణను మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. కోర్టు గుర్తించిన మూడు అంశాలకు తాము సమాధానం దాఖలు చేశామన్నారు.

అయితే ఇప్పుడు పిటిషనర్ల లిఖిత పూర్వక సమాధానాలు ఇతర అంశాలను ప్రస్తావించాయని, విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. ఇందుకు పిటిషనర్ల తరఫునహాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి అభ్యంతరం తెలిపారు. ఈ కేసును విచారించి, మధ్యంతర ఉపశమనం ఎక్కడ ఇవ్వచ్చో పరిశీలిస్తామని గత సిజెఐ (సంజీవ్ ఖాన్నా) చెప్పారని, అందువల్ల కేవలం మూడు అంశాలకే తాము పరిమితమవుతామని చెప్పలేమని అన్నారు. వక్ఫ్‌భూములను లాక్కోవడానికే చట్టం తెచ్చారని సిబాల్ వాదించారు. ఎలాంటి ప్రక్రియ లేకుండా వక్ఫ్ ఆస్తులను లాక్కోవడమే చట్టం ఉద్దేశమన్నారు. వక్ఫ్‌ను క్రియేట్ చేయాలంటూ ఒక వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాంలో ఉండాలనే షరతును సిబాల్ ప్రస్తావించారు. నేను మరణశయ్యపై ఉండి వక్ఫ్ ఏర్పాటు చేయాలనుకుంటుంటే ముస్లింగా ఉన్నట్టు ప్రూవ్ చేసుకోవాలి. ఇది రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు. ఇది ఖచ్చితంగా వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునే చట్టమేనని వాదించారు. సీజేఐ ఇందుకు స్పందిస్తూ, పార్లమెంటులో ఆమోదించిన చట్టానికి రాజ్యాంగబద్ధత ఉంటుందని, స్పష్టమైన సందర్భం వెల్లడికానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోలేవని అన్నారు. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితిలో ఇంతకంటే తాము ఏమీ చెప్పాలనుకోవడం లేదని స్పష్టం చేశారు. ఇంతకు ముందు ఏప్రిల్ 17న జరిగిన విచారణలో వక్ఫ్ బైయూజర్‌తో సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీనోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీఇచ్చింది.

అలాగే, వక్ఫ్ బోర్డులలో కొత్త నియామకాలు చేపట్టబోమని సుప్రీం కోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా మూడు అంశాల విషయానికి వస్తే వక్ఫ్ బై యూజర్ లేదంటే వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారం. రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లింలు వ్యతిరేకించడం రెండో అంశం కాగా. మూడో అంశం నిబంధనకు సంబంధించింది. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుంచి కలెక్టర్ అధికారం ఇవ్వడంపై ముస్లిం సంఘాల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.



# గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం

## తాజా దాడుల్లో 60మంది పైగా మృతి

**గాజాసిటీ, మే 20:** గాజాలో ఇజ్రాయెల్ మారణ హోమాన్నిసృష్టిస్తోంది. గాజాలోని పలు ప్రాంతాలపై భీకర దాడులకు పాల్పడుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్‌కు వెళ్లకుండానే మధ్యప్రాచ్య పర్యటనను ముగించిన తర్వాత ఐడీఎఫ్ తమ దాడులకు మరింత తీవ్రతరం చేసింది. గాజాలోని నివాస ప్రాంతాలు, ఆసుపత్రులపై విరుచుకుపడుతోంది. సోమవారం రాత్రి కూడా ఉత్తర గాజా, డీర్ ఆల్ బలా, ఖాన్ యూనిస్ ఇజ్రాయెల్ దళాలు తమ దాడులను కొనసాగించాయి. ఈ దాడుల్లో దాదాపు 60 మందికిపైగా పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తర గాజాలో జరిపిన వైమానిక దాడుల్లో 22 మంది, డీర్ఆల్ బలాపై జరిపిన దాడిలో 13 మంది, సమీపంలోని నుసెయిరాత్ శరణార్థి శిబిరంపై జరిగిన మరో దాడిలో 15 మంది, దక్షిణ నగరమైన ఖాన్ యూనిస్‌లో జరిగిన రెండు దాడుల్లో 10 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. హమాస్‌ను అంతమొందించి ఆ ఉగ్రసంస్థ చెరలో ఉన్న బందీలను విడుదల చేయడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ సేనలుతెలిపాయి.

మరోవైపు గాజాపోరు మొదలైనప్పటి నుంచి ప్రాణాలు కోల్పోయిన పాలస్తీని యుల సంఖ్య 55 వేలు దాటినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి గాజాలో 3వేల మందికిపైగా మరణించారు. ఇజ్రాయెల్ ప్రధాని గాజాస్ట్రిప్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు ప్రకటించారు.



మాలూరు రామస్వామి శ్రీనివాసన్ (ఫైల్)

# అణుఇంధన కమిషన్ మాజీ ఛైర్మన్ కన్నుమూత

**ఉదగమండలం, మే, 20:** మాజీ అణు శాస్త్రవేత్త, అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ ఛైర్మన్ మాలూరు రామస్వామి శ్రీనివాసన్ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయసు 95 ఏళ్లు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. స్వదేశీ అణ్వాయుధ కార్యక్రమ రూపకల్పనలో డాక్టర్ హోమీ బాబాతో కలిసి శ్రీనివాసన్ పనిచేశారు. ప్రతిష్టాత్మక పద్మ విభూషణ్ పౌర పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. శ్రీనివాసన్ మృతి పట్ల ప్రభుత్వం నివాళి అర్పించింది. శ్రీనివాసన్ బెంగుళూరులో జనవరి5, 1930లో జన్మించారు. సైన్స్ సబ్జెక్టులో మైసూరు నుంచి ఇంటర్ చదివారు. 1950లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పొందారు. 1952లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. కెనడాలోని మాంట్రియల్‌లో ఉన్న మెక్‌గిల్ యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ పూర్తిచేశారు. 1955లో ఆయనడిఎఇలో చేరాడు. తొలి అటామిక్ పవర్ స్టేషన్ నిర్మాణా నికి 1959 ఆగస్టులో డాక్టర్ శ్రీనివాస్‌ను ప్రిన్సిపల్ ప్రాజెక్టు ఇంజినీర్‌గా నియమించారు. దేశ అణ్వాయుధ కార్యక్రమాల రూపకల్పన అతని నాయకత్వంలో సాగింది. దేశవ్యాప్తంగా నెలకొల్పిన న్యూక్లియర్ పవంట్ ప్రాజెక్టుల ప్లానింగ్, ఆపరేషన్స్ అన్నీ చూసుకున్నారు. 1987లో అటామిక్ ఎనర్జీకమిషన్‌ఛైర్మెన్‌గా, అణు ఇంధన శాఖకార్యదర్శిగానియమితుడయ్యారు. ఆయనకు 1984లో పద్మశ్రీ, 1990లో పద్మ భూషణ్, 2015లో పద్మవిభూషణ్ అందుకున్నారు.

### వివాహేతరబంధంతో విడాకులు తీసుకున్న మహిళ

# భరణం పొందేందుకు అర్హతలేదు

## చత్తీస్‌గఢ్ హైకోర్టు సంచలన తీర్పు

**రాయ్‌పూర్, మే 20:** విడాకులు తీసుకున్న మహిళకు భరణానికి సంబంధించిన కేసులో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఓ సంచలన తీర్పును ఇచ్చింది. వివాహేతర సంబంధం కారణంగా తన మాజీ భర్త నుంచి విడాకులు తీసుకున్న మహిళ భరణం పొందటానికి అనర్హురాలని తీర్పునిచ్చింది. ఆమెకు నెలకు రూ.4,000 ఇవ్వాలని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది. 2021లో తన భర్త ఇంటిని విడిచిపెట్టి 2019లో రాయ్‌పుర్‌లో హిందూ ఆచారాలతో వారిద్దరికీ వివాహం జరిగింది. అయితే భర్త తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారంటూ మార్చి 2021లో ఇంటిని విడిచిపెట్టి ఆమె వెళ్లిపోయారు. అనంతరం ఆమె భర్త తనతో క్రూరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ రాయ్‌పుర్ ఫ్యామిలీ కోర్టులో భరణం కేసు దాఖలు చేశారు. అయితే, దీనిపై స్పందించిన భర్త, తన తమ్ముడితో వివాహేతర సంబంధం పెట్టుకుందని ఆరోపిస్తూ భార్యతో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రశ్నించగా, తనను తప్పుడు కేసులో ఇరికిస్తానంటూ ఆమె బెదిరించిందని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే దీనిపై విచారించిన ఫ్యామిలీ కోర్టు 2023 సెప్టెంబర్ 8న భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని పేర్కొంటూ విడాకులు ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం నవంబర్ 6న భార్యకు నెలవారీ భరణం రూ.4,000 చెల్లించాలని కోర్టు తీర్పునుచ్చింది. అయితే దీనిపై ఆమె సంతృప్తి చెందకుండా దానిని రూ.20,000కి పెంచాలని డిమాండ్ చేశారు. చివరికి ఫ్యామిలీ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఛత్తీస్‌గఢ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, భర్త తరఫున వాదించిన న్యాయవాదులు, ఆమెకు భరణం లభించదని హైకోర్టుకు తెలిపారు. తన క్లయింట్ భార్య, తన భర్త తమ్ముడితో వివాహేతర సంబంధం పెట్టుకున్నందున భరణానికి అనర్హురాలని కోర్టు ముందు చట్టబద్ధంగా నిరూపించారు. ఈక్రమంలోనే తీర్పునిచ్చిన కోర్టు, భర్తకు అనుకూలంగా విడాకులూ మంజూరు చేసింది. సెక్షన్ 125(4)లోని నిబంధనను పరిగణనలోకి తీసుకోకుండా భరణం ఉత్తర్వు జారీ చేశారంటూ భర్త తరఫున న్యాయవాది తెలిపారు. భర్త తరఫు న్యాయవాది వాదనతో హైకోర్టు అంగీకరించింది. భార్య వివాహేతర సంబంధం కారణంగా ఫ్యామిలీ కోర్టు విడాకులిచ్చిన నేపథ్యంలో ఆమె భరణం పొందడానికి అనర్హురాలు అనడానికి తగిన సాక్ష్యమవుతుందని హైకోర్టు పేర్కొంది. సివిల్ కోర్టు జారీ చేసిన ఆదేశానికి విరుద్ధంగా హైకోర్టు వేరే అభిప్రాయాన్ని తీసుకోవడం సాధ్యం కాదని పేర్కొంది. కాబట్టి ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు భార్య వివాహేతర సంబంధంలో జీవిస్తున్నట్లు స్పష్టంగా నిరూపిస్తుందని చెప్పింది. అందువల్ల ఆమె భర్త నుంచి భరణం పొందేందుకు అనర్హురాలని హైకోర్టు అభిప్రాయపడింది.



# గోల్డ్ స్మగ్లింగ్‌కేసులో నటి రన్యారావుకు బెయిల్

**బెంగళూరు, మే 20:** గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావుతో పాటు తరుణ్ రాజ్ కొండూరుకు బెంగళూరు కోర్టు మంగళవారం బెయిల్ మంజూరుచేసింది. ఆర్థిక నేరాల ప్రత్యేకకోర్టు ఇద్దరికి షరతులతోకూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ.2లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, ఇద్దరి పూచీకత్తుతో బెయిల్‌ని ఇచ్చింది. అధికారులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించొద్దని, దర్యాప్తు అధికారులకు సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని, ఇదేతరహాలో నేరాల్లో పాల్గొనొద్దని ఆదేశించింది. ఆదేశాలను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుందని హెచ్చరించింది.

# బైడెన్‌కు కేన్సర్ సోకితే ఎందుకు రహస్యం?: ట్రంప్

**వాషింగ్టన్, మే 20:** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు కేన్సర్ నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. బైడెన్‌కు కేన్సర్ సోకిందనే విషయాన్ని ఆలస్యంగా బయటపెట్టడాన్ని ఆయన ప్రశ్నించారు. విలేకరులతోమాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలుచేశారు. బైడెన్‌కు ప్రొస్టేట్ కేన్సర్ నిర్ధారణ అయినట్లు ఆయన కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ఈ కేన్సర్‌ను గ్లీసన్ స్కోరింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి అంచనా వేస్తారు. ఇందులో బైడెన్ స్కోరు 9 ఉన్నట్లు కార్యాలయం తెలిపింది.

దీనిపైనే తాజాగా ట్రంప్ మాట్లాడుతూ.. 'కేన్సర్ సోకిందన్న విషయం చాలా రోజుల తర్వాత తెలియడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. స్కోరు 9కు చేరుకోవడానికి చాలా సమయం పడుతోంది. బైడెన్ మానసికంగా ఆరోగ్యంగానే ఉన్నారని గతంలో అదే వైద్యుడు చెప్పారు. ఇది రాజకీయమైన అంశం కాదు.. ఇది మన దేశానికి ప్రమాదం. కేన్సర్ విషయం ఇప్పటివరకు ఎందుకు బయటకు చెప్పలేదు. ప్రజలకు దీని గురించి వాస్తవాలు తెలియాలి. కొందరు వాస్తవాలు చెప్పడంలేదు. ఇది మరో పెద్ద సమస్య' అని ట్రంప్ పేర్కొన్నారు.

# సాయం అందకపోతే గాజాలో 14వేల మంది చిన్నారులు మృత్యువాత

## ఐక్యరాజ్యసమితి మానవతాసాయం విభాగం హెచ్చరిక

**గాజాసిటీ, మే 20:** ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో పరిస్థితులు పూర్తి అధ్వాన్నస్థితికి చేరుకున్నాయి. ప్రజలజీవనంఅస్తవ్యస్థంగా మారింది. ఇప్పటికే గాజాను అన్నివైపులా నిర్బంధించిన ఇజ్రాయెల్‌పరిమిత స్థాయిలో మాత్రమే మానవతా సాయానికిఅనుమతిస్తోంది. ఆ ప్రాంతంలో ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. ఈపరిస్థితిపై స్పందించిన ఐక్యరాజ్యసమితి మానవతాసాయం విభాగం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది.సాయం ఇలాగే కొనసాగితే మరో రెండురోజుల్లో 14 వేల మంది చిన్నారులు మరణించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 11 వారాలక్రితం పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయెల్‌నిర్బంధించింది. అమెరికా, కెనడా, ఫ్రాన్స్, యుకె ఒత్తిడిచేయడంతో పరిమితస్థాయిలో గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ అనుమతిస్తోంది. చిన్నారులతో సహా గాజావాసులకు ఇటీవల ఐదు ట్రక్కుల మానవతా సాయం మాత్రమే అందింది. వారికి మరింత సాయం అవసరమని లేదంటే 48 గంటల్లో 14 వేలమంది చిన్నారులు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపింది. అక్కడున్న చిన్నపిల్లలు, తల్లులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని సమితిప్రతినిది టామ్ ఫ్లెచర్ హెచ్చరించారు.

మానవతాసాయం విషయంలో ఇజ్రాయెల్ తీరును బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు తీవ్రంగా ఖండించాయి. గాజాకు మానవతా సాయంపై ఆంక్షలు వెనక్కితీసుకోకపోతే తామంతా ఉమ్మడి కార్యాచరణ తీసుకుంటామని హెచ్చరించాయి. తాజాగా ఇజ్రాయెల్ తీరుపై ఐక్యరాజ్య సమితికూడా స్పందించింది. పోషకాహారంతో కూడిన 100 ట్రక్కులసాయాన్ని గాజాలోకి అనుమతించాలని, చిన్నారుల ప్రాణాలు రక్షించాలని సూచించింది.

# ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, మే 20:** ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్‌కుమార్ డేకా పదవీకాలం మరో ఏడాది పాటు పొడిగించారు. జూన్ 2026 వరకూ ఆయన డైరెక్టర్‌గా కొనసాగుతారని వ్యక్తిత్వ వికాసం, నియామకాల మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. 1988 బ్యాచ్ హిమాచల్ ప్రదేశ్‌కేడర్ ఐపిఎస్ అధికారి అయిన డేకా రెండేళ్ల కాలం పాటు పనిచేసేందుకు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2022 జూన్‌నుంచి ఆయన ఈ పదవిలో ఉన్నారు. అంతకుముందు కూడా ఆయన ఏడాది కాలం పాటు అంటే2024 జూన్‌వరకూ పదవీకాలం పొడిగించారు. కేబినెట్ నియామకాల కమిటీ తపన్‌కుమార్ పదవీకాలం పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. 2025 జూన్ 30 నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువ డేంత వరకూ ఆయన పదవీకాలం ఉంటుందని నియామకాలకమిటీ ఆమోదం తెలిపింది. ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రకార్యకలాపాలు తీవ్రస్థాయిలో కొనసాగిస్తున్న కాలంలోఆయన జాయింట్ డైరెక్టర్‌గా కొనసాగారు. పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ దాడి, 2019 పుల్వామా దాడిలపైనా ఆయన నిఘా కార్యకలాపాలు కొనసాగించి సమగ్ర నివేదికలు ఇచ్చారు. జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదం, లోయలో జరుపుతున్న హత్యలపైనా ఆయనసమగ్ర నివేదికలు రూపొందించి కేంద్రాన్ని అప్రమత్తంచేసారు.

# అధికారులూ.. దుబారాకు చెక్ పెట్టండి..

## మద్యం, సిగరెట్ కట్ : చైనా ఆదేశం



**బీజింగ్, మే 20:** మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు చైనా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అందులో భాగంగా ప్రభుత్వంలోని అధికారులు ఖర్చులు తగ్గించుకోవాలని చైనా ప్రభుత్వం ఆదేశించింది. ప్రయాణాలు, మద్యం, సిగరెట్‌ఖర్చులు తగ్గించుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు అక్కడి అధికారిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వం ్యలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా అక్కడి ప్రభుత్వ అధికారులతో పాటు, అధికార పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాటి ప్రకారం ప్రయాణాలు, మద్యం, సిగరెట్, ఆహారం, కార్యాలయాల అద్దెలు వంటివి తగ్గించుకునేలా ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ వనరులను ఖర్చు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని కోరింది. దుబారాను తగ్గించాలని పేర్కొంది. ఈ దుబారా ఖర్చులు చేయడాన్ని సిగ్గుచేటుచర్యగా ప్రభుత్వం అభివర్ణించింది. ఇటీవల కాలంలో స్థిరాస్తి విక్రయాలకు సంబంధించిన ఆదాయం విషయంలో చైనా నష్టాలను చూస్తోంది. అంతేకాక స్థానిక ప్రభుత్వాలపై అప్పుల భారం కూడా పెరిగిపోయింది. ఈ క్రమంలో అధికారులు చేసే ఖర్చులతో ఒత్తిడి పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. స్థానిక ప్రభుత్వాల ఆర్థికవృద్ధిని మెరుగుపరచాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా అక్కడి అధికారులను ఖర్చులు తగ్గించుకోవాలని ఆదేశించింది.

### ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త

# జయంత్ నార్లికర్ కన్నుమూత

**పూణె, మే 20:** ప్రముఖ ఖగోళ, శాస్త్ర సాంకేతిక శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ మంగళవారం పూణెలో కన్నుమూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ ప్రఖ్యాత ఖగోళ, సైన్స్ కమ్యూనికేషన్ శాస్త్రవేత్తగా ప్రసిద్ధి గాంచారు. ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారం కూడా లభించింది. కుటుంబ వర్గాల సమాచారం ప్రకారం, డాక్టర్ నార్లికర్ మంగళవారం ఉదయం నిద్రలోనే మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. జూలై 19, 1938న జన్మించిన డాక్టర్ నార్లికర్ తన ప్రాథమిక విద్యను బనారస్ హిందూ విశ్వవిద్యాలయర్‌లో పూర్తి చేశారు. తర్వాత ఉన్నత విద్యను కేంబ్రిడ్జ్‌లో పూర్తి చేశారు. ఆ తర్వాత టాటా ఇన్నిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (1972–1989)లో చేరడానికి భారతదేశానికి తిరిగి వచ్చాడు. విష్ణు నార్లికర్ నాయకత్వంలో సైద్ధాంతిక ఖగోళ భౌతిక శాస్త్ర సమూహాన్ని విస్తరించారు. ఇది క్రమంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. 1988లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డాక్టర్ నార్లికర్‌ను ప్రతిపాదిత ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్‌ని స్థాపించడానికి వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఆహ్వానించింది.

2003లో పదవీవిరమణ చేసేవరకు ఆయన డైరెక్టర్ పదవిలో కొనసాగారు. డాక్టర్ నార్లికర్‌కు 1965లో 26 ఏళ్లకు చిన్న వయసులోనే పద్మభూషణ్ లభించడం విశేషం. 2004లో ఆయనకు పద్మవిభూషణ్ లభించింది. 2011లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు రాష్ట్ర అత్యున్నత పౌర పురస్కారమైన మహారాష్ట్ర భూషణ్‌ను ప్రదానం చేసింది. 2014లో భారతదేశపు ప్రముఖ సాహిత్య సంస్థ సాహిత్య అకాడమీ, ప్రాంతీయ భాష (మరాఠీ) రచనలో అత్యున్నత పురస్కారానికి ఆయన ఆత్మకథను ఎంపిక చేసింది.

# పంజాబ్ మూడు చెక్‌పోస్టులవద్ద బిఎస్ఎఫ్ బీటింగ్ రిట్రీట్ వేడుకలు




**ఛండీఘర్, మే 20:** భారత్‌పాకిస్థాన్‌లమధ్య నెలకొన్న ఉద్రిక్తతలకారణంగా నిలిపివేసిన బీటింగ్ రిట్రీట్ వేడుకలు మళ్లీ ప్రారంభం అయ్యాయి. మూడు జాయింట్ చెక్‌పోస్టులవద్ద కూడా కొనసాగినట్లు భారత్ ఆర్మీ తెలిపింది. పంజాబ్ ఫ్రాంటియర్‌లోని అమృత్‌సర్‌వద్ద అట్టారి, ఫిరోజ్‌పూర్‌లోని హుస్సే నీవాలా, ఫజిల్లాలోని సాదికీ వద్ద ఈబీటింగ్ రిట్రీట్ వేడుకలు కేవలం మీడియా సిబ్బందికోసం నిర్వహించారు. ఇక సాధారణ ప్రజానీకం కూడా సందర్శించేందుకు ఈనెల 21వతేదీనుంచి అనుమతిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కారణంగా బిఎస్ఎఫ్ అట్టారి సరిహద్దువద్ద ఈ బీటింగ్ వేడుకను నిలిపివేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత రెండుదేశాలమధ్య అత్యంత తీవ్రస్థాయి ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే ఈ వేడుకలో బిఎస్ఎఫ్‌దళాలు పాకిస్తాన్ రేంజర్స్‌తో కరచాలనంచేయడం కానీ, ఇరువైపులా గేట్లు తెరవడం కానీ, పతాకాలను అవనతం చేయడం కానీ ఉండవని బిఎస్ఎఫ్ తెలిపింది. ప్రజాబాహుళ్యం లేకుండానే జెండాలను అవనతంచేస్తారు. ఈనెల 8వ తేదీనుంచి బిఎస్ఎఫ్ ఈ మూడు జాయింట్ చెక్‌పోస్టులవద్ద ప్రజల సందర్శనను రద్దుచేసింది. పంజాబ్ కేబినెట్‌మంత్రి కులదీనప్‌సింగ్ ధలివాల్ షాపూర్ సరిహద్దుపోస్టును సందర్శించి అజ్నాలావద్ద బిఎస్ఎఫ్ అధికారులు, సిబ్బందిని కలిసి చర్చలుజరిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా వారిపొలాల్లో పనులుచేసుకునేందుకు అనుమతించాలని కోరారు.

# ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్షం



## టిఎంసి ఎంపి యూసఫ్ పఠాన్ స్థానంలో అభిషేక్ బెనర్జీ

**కోల్‌కతా, మే 20:** ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఉద్దేశించిన ఏడు బృందాలు విదేశాలకు వెళ్తున్న సంగతి తెలిసిందే. అందులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహరంపూర్‌కు ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్న యూసఫ్ పఠాన్‌ను కేంద్రం ఎంపిక చేయడాన్ని ఆ పార్టీ తప్పుబట్టడంతో ఆయన ఈ బృందం నుంచి తప్పుకొన్నారు. ఈ నేపథ్యంలో యూసఫ్ స్థానంలో పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీని ఆ పార్టీ ఎంపిక చేసింది. దీనిపై టిఎంసి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో తమ పార్టీ తరఫున అభిషేక్‌ను ఎంపిక చేయడం గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బెంగాల్ దృఢ వైఖరిని ఆయన ప్రతిబింబించడమే కాకుండా.. ప్రపంచ దేశాల్లో భారత ప్రజల సమష్టి స్వరాన్ని వినిపిస్తారని తెలిపింది.

ప్రతినిధి బృందంలో యూసఫ్ పేరును చేర్చడంపై అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, దేశాన్ని రక్షించడం వంటి జాతీయ భద్రత విషయాలపై తమ పార్టీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తుందని.. కానీ, తమను సంప్రదించకుండా పఠాన్‌ను దౌత్యబృందంలో చేర్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఒక పార్టీ ఎంపిని ఎంపిక చేసేటప్పుడు ఆ పార్టీతో సంప్రదింపులు జరపాలని కేంద్రానికి సూచించారు. ఈ వ్యాఖ్యలు చేసిన మరునాడే ఆయన పేరును పార్టీ తరఫున బృందంలో చేర్చడం గమనార్హం. పహల్గాం ఘటన నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత్ దౌత్య యుద్ధం ప్రారంభించింది.

ఇందులో భాగంగా 51 మంది నేతలు 7 బృందాలుగా విదేశాల్లో పర్యటించనున్నారు. ఈ బృందాల్లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, మాజీ ఎంపిలు, మంత్రులు దౌత్యవేత్తలు ఉన్నారు. ఒక్కో బృందంలో ఒక ముస్లిం నేతగాని, అధికారిగానీ ఉండేలా చర్యలు తీసుకున్నారు. 51 మందిలో 31 మంది ఎన్డీయే నేతలు, 20 మంది ఎన్డీయేతర పార్టీల నేతలున్నారు. 'ఒకే లక్ష్యం..ఒకే సందేశం.. ఒకే భారత్' పేరుతో ఈ పర్యటనలు సాగనున్నాయి.

# ఉత్తరాఖండ్‌లో విరిగిపడ్డ కొండచరియలు..

## ఆ మార్గంలో చిక్కుకుపోయిన యాత్రికులు!

**డెహ్రాడూన్, మే 20:** ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. పితోరాగఢ్ జిల్లా సమీపంలో కైలాస్–మానసరోవర్ యాత్ర మార్గంలో అవి విరిగిపడటంతో వందలాది యాత్రికులు చిక్కుకుపోయారు. వారితోపాటు స్థానికులు కూడా ఉన్నారు. ఆ మార్గాన్ని అందుబాటులోకి తెచ్చే విధంగా స్థానిక యంత్రాంగం సహాయక చర్యలు ప్రారంభించింది. శిథిలాలను తొలగించేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందం అక్కడకు చేరుకుంది. తాజా ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడేవరకు యాత్రికులు అక్కడే ఉండాలని సూచించారు. అయిదేళ్లుగా నిలిచిపోయిన కైలాస్ మానస సరోవర్ యాత్రను ఈ యేడాది జూన్ నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గత నెల అధికారికంగా ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు వరకూ కొనసాగనున్న ఈ యాత్ర ఉత్తరాఖండ్, సిక్కింలలో ప్రారంభం కానుందని విదేశీ వ్యవహారాలశాఖ తెలిపింది. 50 మంది యాత్రికుల చొప్పున 5 బృందాలు ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ నుంచి 10 బృందాలు సిక్కిం నాథులాపాస్ నుంచి ఈయాత్రకు తరలి వెళ్తాయి అని వెల్లడించింది.

యాత్ర కోసం దరఖాస్తులను కంప్యూటర్ జనరేటెడ్‌విధానంఆధారంగా యాత్రికులను ఎంపిక చేస్తామని పేర్కొంది. కొవిడ్ కారణంగా కైలాస పర్వతం, మానస సరోవర్ సరస్సు యాత్ర 2020లో ఆగిపోయింది. గతేడాది రష్యాలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ అనంతరం ఇరు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చే చర్యలు మొదలయ్యాయి. ఈక్రమంలోనే కైలాస్ మానస సరోవర్ యాత్రను తిరిగి ప్రారంభిస్తున్నారు.

21-5Pg6exHMNWJQE.qxd:21-5Pg6exHMNWJQE.qxd 01/01/01 7:39 AM Page 1



# తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధులలోకి తీసుకోవాలి

## - సమ్మెకు దిగిన ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

**గాజువాక,మే 20,ప్రభాతవార్త:** ఉక్కులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధులలోకి తీసుకోవాలని,ఉక్కు ప్రైవేటీకరణ ను ఆపాలంటూ విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మెతో పాటు భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఉదయం 6 గంటల షిఫ్టు కార్మికులు హాజరు కాలేదు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ హెచ్ఓడి డిపార్ట్మెంట్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఉద్య మాన్ని ఉద్భృతం చేస్తామని హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్లో అఖిల పక్ష కార్మిక సంఘాల పిలుపుమేరకు జరిగిన సమ్మెలో సమ్మెతో చావో రేవో తేల్చు కోవాలని తెగబడిన కార్మిక సంఘాల నేతలను అదుపు చేసేందుకు పోలీసులు భారీగా మోహరించారు. ఉక్కు లోకి అడ్డదారిలో హాజరవుతున్న కార్మికులను అడ్డు కుంటున్నారన్న సాకుతో నలుగురు కాంట్రాక్టర్ కార్మిక సంఘాల నేతలను స్టీల్ ప్లాంట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జోరు వానలో సైతం కార్మికులు లెక్క చేయకుండా సమ్మెలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం స్టీల్ ప్లాంట్ ముఖద్వారం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 1559వ రోజుకు చేరాయి. సమ్మె కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గాజువాక సౌత్ సబ్ డివిజన్ పోలీసులు భారీగా మోహరించారు. స్టీల్ ప్లాంట్ బి.సి గేటు, మెయిన్ గేటుల వద్ద భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా అ ఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్య నిరంకుశ వైఖరి పై మండి పడ్డారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా దుయ్యపట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీ కరణ నుంచి కాపాడుకోవడం కార్మికుల జీవన్మరణ సమస్యగా మారిం దన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ దేశానికి ఆదాయాన్నిస్తూ లాభాలు అందిస్తుందని అందుకే ఈ ప్లాంట్ ను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని కేంద్రం చూస్తుందని మండిపడ్డారు. దేశంలోని అన్నికార్మికసంఘాల ఐక్యతతో ఉద్యమాన్నిఉదృతం చేస్తామని, పాలకుల నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మిక పోరాటం సాగుతుందన్నారు. జీవనోపాధిని మింగేస్తూ ఆర్థిక ఇబ్బందులను సృష్టించి కార్మికుల మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్యలకు ప్రభుత్వ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు.

## పిడుగుపాటుకు తండ్రి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు

**శ్రీకాకుళం, మే 20 (ప్రభాతవార్త ప్రతినిధి ) :** జిల్లా కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. బలగ బుచ్చిపేట గ్రామానికి చెందిన గేదెల రాజారావు, ఆయన కుమారుడు నాగావళి నది తీరాన ఉండగా పిడుగుపాటుకు గురయ్యారు. ఈ దుర్ఘటనలో తండ్రి రాజారావు అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడు నాగర్జునకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి నాగార్జునను మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

## కరెంటు స్తంభం కూలడంతో వ్యక్తి మృతి

**కావలి (నెల్లూరు), మే 20, ప్రభాతవార్త :** కావలి పట్టణ ఉదయగిరి రోడ్డులో కరెంటుస్తంభం కూలడంతో మద్దెల వెంకటేష్(32) మంగళవారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయగిరి రోడ్డులో సుబ్బారావు చికెన్‌పకోడి బండికి నీడ కల్పించేందుకు ఆయన స్నేహితుడు మద్దెల వెంకటేష్ అక్కడికి వెళ్లాడు. అక్కడ ఉన్న కరెంటు స్తంభానికి పట్ట కడుతుండగా సపోర్ట్‌గా ఉన్న మరోస్తంభం వెంకటేష్‌పై కూలిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కావలి బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన బైక్ మెకానిక్ మద్దెల వెంకటేష్‌కు భార్య మౌనిక, కూతురు, కొడుకు ఉన్నారు. దీంతో ఈ పేద కుటుంబం



రోడ్డున పడింది. ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సంఘటన ప్రదేశాన్ని టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గిరిబాబు, పోలీసులు సందర్శించారు. టిడిపి నేతలు కూడా పాల్గొన్నారు.

# శ్రీశైలం జలాశయంను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం



డ్యాం ప్లంజుపుల్‌ను పరిశీలిస్తున్న బృందం

**శ్రీశైలంప్రాజెక్టు,మే20,ప్రభాతవార్త** శ్రీశైలం జలాశయంను పరిశీలించేందుకు మంగళవారం నాడు పూణె నుండి సి.డబ్ల్యూ.పి. ఆర్.ఎస్.కు చెందిన హనుమాన్‌రఫాయ్, సన్‌జయ్ అబురిల్,మహేశ్వర్‌సింగ్ బిస్తా,జి.డి.నాయుడు, సునిల్ జైపాల్ అను 6 మంది శాస్త్రవేత్తల బృందం డ్యాం వద్దకు చేరుకున్నారు.వీరికి శ్రీశైలం డ్యాం ఎస్.ఈ శ్రీరామచంద్రమూర్తి స్వాగతం పలికారు.తదుపరి బృందం సభ్యులు డ్యాం వ్యూపాయింటు వద్ద పవర్ పాయింటు ప్రజేంటేషన్ ద్వారా వివరాలను అడిగి తెలుసున్నారు. తదుపరి డ్యాం ప్లంజుపూల్‌కు సమీపంలోకి చేరుకోని క్షేత్రస్థాయిలో ఆధ్యయనం చేసారు.శ్రీశైలం డ్యాంకు పడిన ప్లంజుపుల్ గుంతపై గత మాసంలో డ్యాం సేఫ్టి బృందం ఎన్.డి.ఎస్.ఏ చైర్మన్ అనిల్‌జైన్(న్యూఢిల్లి)వారు శ్రీశైలం డ్యాం సిఈ కబిర్‌బాషా నేతృత్వంలో క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది.ఈ క్రమంలోనే శ్రీశైలం డ్యాంకు పొంచిఉన్నా ప్రమాదం,ఏర్పడిన ప్లంజుపుల్ గుంతపై ఆధ్యయనం చేస్తున్న అధికారులు పలు నివేదికలను ప్రభుత్వంకు అందజేయడం జరిగింది.డ్యాంకు నిపుణులు సూచించిన మేరకు మరమత్తు పనులను చేపట్టేందుకు ఇప్పటికే ఏపి ప్రభుత్వం జాతీయ డ్యాం సేఫ్టి అధారిటీ హెచ్చరికలతో శ్రీశైలం రక్షణ పనులకు టెండర్ల ఉత్తరు వ్వలు జారి చేస్తూ రూ.25.65 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారి చేయడం జరిగింది.

## ప్రముఖ పారిశ్రామికవేత్త పర్వతనేని రత్నకుమార్ హఠాన్మరణం



**జగ్గయ్యపేట, మే 20, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన పర్వతనేని రత్నకుమార్ (65) మంగళవారం గుండె పోటుతో హఠాన్మరణం చెందారు. ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ బస్సుల నిర్వహణలో నాలుగు దశాబ్దాలకు పైగా వ్యాపారంలో పేరు పొందిన రత్నకుమార్ జిల్లాలోని పలు ప్రాంతాల వారికి సుపరిచితులు. ఆయన సోదరి హనుమంతు రత్నకుమారి జగ్గయ్యపేట నగర పంచాయితీ తొలి చైర్‌పర్సన్‌గా రెండు దశాబ్దాల క్రితం పట్టణాన్ని పరిపాలించారు. కాగా రత్నకుమార్ మరణం పట్ల జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పలువురు ప్రముఖులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలియపర్చారు.

## విజయవాడ - కర్నూలు నూతన విమాన సర్వీసులకు శ్రీకారం

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం , మే 20 ( ప్రభాతవార్త ప్రతినిధి ) :** జూలై 2వ తేదీ నుంచి విజయవాడ కర్నూలు విజయవాడ మధ్య నూతన ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు . ప్రతి సోమవారం, బుధవారం , శుక్రవారం ఈ విమానాలు నడుపబోతున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అమరావతిని రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలును అనుసంధానం చేస్తూ ఈ కొత్త మార్గం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ ప్రయాణ అవసరాలను తీర్చడమే కాకుండా, అంతర్ రాష్ట్ర విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపొందించామని, రాష్ట్ర ప్రజలకు విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. విద్య, వ్యాపారం, ప్రభుత్వ అవసరాల నిమిత్తం ప్రాంతీయంగా ప్రయాణించే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు.

## బంగారం గొలుసు దొంగలను పట్టుకొన్న పోలీసులు

### - మత్తు పదార్థాల విక్రేతలపై ఉక్కుపాదం

**చౌడేపల్లి (చిత్తూరు జిల్లా), మే 20 ప్రభాతవార్త** మహిళల మెడలో బంగారం గొలుసులు అపహరించే గరుడుకట్టిన నేరస్తులను పోలీసులు పన్నాగం పన్ని మరీ పట్టుకొన్నారు. దీంతో పలమనేరు డీఎస్పీ దేగల ప్రభాకర్ వారికి రివార్డులందించారు. నిందితులను కోర్టుకు తరలించారు. డీఎస్పీ దేగల ప్రభాకర్ కథనం మేరకు...అంతర్ జిల్లాల్లోని బంగారం గొలుసులు ధరించిన మహిళలను లక్ష్యాలుగా చేసుకొన్న ఇద్దరు వ్యక్తులు వారి మెడలోంచి గొలుసులను అపహరిస్తూ వున్నారు. అన్నమయ్య జిల్లాలోని గాలీవీడు, పెద్దమండెం, చిన్నమండెం, నిమ్మనపల్లి, చిత్తూరు జిల్లాలోని సోమల, గంగవరం మండలాల్లో గత 3నెలలుగా మహిళల మెడల్లోంచి బంగారం గొలుసులు అపహరణకు గురవుతున్నాయి. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో పలమనేరు డీఎస్పీ దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో పుంగనూరు రూరల్(చౌడేపల్లి) సిఐ రాంభూపాల్ పర్యవేక్షణలో సోమల ఎస్ఐ శివశంకర్, పలమనేరు ఐడి పార్టీ ఎఎస్ఐ శ్రీనివాసులు, యల్లప్ప, అల్లావుద్దీన్, శశిధర్‌లు రంగంలో దిగారు. అనతి కాలంలోనే కేసు చేధించారు.

# విశాఖ నగర డిప్యూటీ మేయరుగా దల్లి గోవిందరాజు

### - విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్‌అశోక్

**విశాఖపట్నం మే 20, ప్రభాతవార్త** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా కార్పొరేటర్ దల్లి గోవిందరాజు ఎన్నికయ్యారని విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక మంగళవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి డిప్యూటీ మేయర్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మాట్లాడుతూ మే 19వ తేదీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం జివిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో సభ్యులు సమావేశం అయినప్పటికీ క్వారమ్ లేకపోవడం వలన డిప్యూటీ మేయర్ ఎన్నిక మే 20వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించేందుకు వాయిదా వేసామని తెలిపారు. 20వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశ మందిరం లో ప్రత్యేక సమావేశం నిర్వహించి డిప్యూటీ మేయర్ ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ గా దల్లి గోవిందరాజు ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం జీవీఎంసీ మేయర్ ఎన్నికలకు సంబంధించి కూటమి అభ్యర్థిగా బిఫారమ్ టికెట్ 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు సమర్పించారని, దల్లి గోవిందరాజు ను డిప్యూటీ మేయరు అభ్యర్థిగా విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు) ప్రతిపాదించగా, ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు బలపరిచారని, ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు మొత్తం 59 మంది హాజరు కాగా డిప్యూటీ మేయర్ ఎన్నికకు సరిపోయిన క్వారమ్ ఉన్నందున మరో అభ్యర్థి పోటీలో లేనందున డిప్యూటీ మేయర్ గా దల్లి గోవిందరాజు ఎన్నికైనట్లు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయరు గా దల్లి గోవిందరాజు చే ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి ప్రమాణా స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కూటమి శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామక్రిష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీ క్రిష్ణ శ్రీనివాస్ యాదవ్, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, పి.గణబాబు, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కార్పొరేటర్లు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, అధికారులు, సిబ్బంది నూతన డిప్యూటీ మేయర్ కు పుష్ప గుచ్చాలు అందించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# అనంతపురం అర్బన్ మినీ మహానాడులో గందరగోళం

### టిడిపి ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వెంకటేశులు ఆత్మహత్యాయత్నం

**అనంతపురం, మే 20, (ప్రభాత వార్త బ్యూరో)** అనంతపురం అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమంలో గందరగోళం నెలకొంది. స్థానిక ఎం వై ఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం అనంతపురం అర్బన్ నియోజకవర్గం మినీ మహానాడు కార్యక్రమంలో అనంతపురం నగర టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటేశులు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఇతర నాయకులు సమావేశానికి హాజరయ్యారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నోసార్లు ఎమ్మెల్యేలు కలిసినా ఎమ్మెల్యే తనను పట్టించుకోలేదని కారణంతో వెంకటేశులు సమావేశం మధ్యలోనే పురుగుమందు సేవించడం నాయకులు కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. వెంకటేశులు ను వెంటనే టిడిపి కార్యకర్తలు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స నిర్వహించారు.అనంతపురం నగరంలోని కమ్మ భవన్ లో జరిగిన అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడులో ఆత్మహత్యాయత్నం చేసిన టిడిపి కార్యకర్త వెంకటేష్ ను అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పరామర్శించారు. ఎస్సీ సెల్ విభాగానికి చెందిన వెంకటేష్ క్షణికావేశంలో విష ద్రావకం తాగి ఆత్మహత్యయత్నం చేసుకున్నట్లు,అక్కడ ప్రాథమిక చికిత్సలు అనంతరం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు టిడిపి వర్గాలు చెబుతున్నా యి .అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ మినీ మహానాడు కార్యక్రమం పూర్తి అయిన తర్వాత ప్రభుత్వాసుపత్రికి, అలాగే సవేరా ఆసుపత్రికి వెళ్లి వెంకటేష్ ను పరామర్శించారు. ఎందుకు ఈ సంఘటన జరిగిందన్న వివరాలు ఆరా తీశారు. అలాగే వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి గురించి కూడా వైద్యులునడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందన్నారు.



మినీనాడు సభలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన నెట్టెం రఘురామ్‌ను ఘనంగా సన్మానిస్తున్న ఎంపి కేశినేని చిన్ని, ఎంఎల్ఏ రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

# జగ్గయ్యపేట-నందిగామ ఇండస్ట్రియల్ క్లస్టర్ కాబోతోంది -మినీ మహానాడులో నేతల జోష్

### - అభివృద్ధిపై ఎలుగెత్తిన ఎంపి చిన్ని, ఎమ్మెల్యే రాజగోపాల్

**జగ్గయ్యపేట, మే 20, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు నియోజకవర్గాలు జగ్గయ్యపేట-నందిగామ ఇండస్ట్రియల్ క్లస్టర్ కాబోతోందని, వైకుంఠాపురం-అమరావతి మధ్య కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణంతో రాజధానికి రోడ్డుమార్గంలో నందిగామ, జగ్గయ్యపేట దగ్గరవుతాయని పలువురు అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ఉద్ఘాటించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని విజయవాడ రోడ్‌లోగల శుభమస్తు వేడుకల మందిర ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు, కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పార్టీ పరిశీలకులు దొంతు చిన్నా, స్థానిక నాయకులు మేకా వెంకటేశ్వర్లు, కన్నెబోయిన రామలక్ష్మి శ్రీ, ముల్లంగి రామకృష్ణారెడ్డి, రాజ్యలక్ష్మి శ్రీ, కళావతి, అన్వర్, రాణి, జి సుధీర్‌బాబు, జి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన మాజీమంత్రి నెట్టెం రఘురామ్ పుట్టిన రోజు సందర్భంగా మినీమహానాడు సభలో భారీ కేక్‌కట్‌చేసి నేతలు, కార్యకర్తలు పంచిపెట్టారు. రఘురామ్ సమర్థత, నాయకత్వ పటిమ గురించి పలువురు నాయకులు శ్లాఘించారు. మినీమహానడు, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశాల్లో పాల్గొన్న ఎంపి చిన్ని మాట్లాడుతూ పోలంపల్లి ఎత్తిపోతల పథకం, కంచల వేదాద్రి ఎత్తిపోతల పథకం అభివృద్ధికి అడ్డువున్న సమస్యలు తొలగి రెండు నెలల్లో బడ్జెట్ విడుదల అవుతుందని, త్వరలో జగ్గయ్యపేట పట్టణంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు అవుతుం దని ఇందుకు సంబం ధించి డిపిఆర్ కూడా సిద్ధమైందని శుభ వార్త తెలిపారు. పలు పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి కల్పనలు చేసేందుకు నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో రెండు వేల ఎకరాలకు సర్వే చేయటం జరిగిందని త్వరలో పెద్ద ఇండస్ట్రియల్ పార్కు రాబోతోందని అన్నారు. కొత్తగా పార్టీ కమిటీలకు ఎన్నికైన కార్యవర్గ నాయకులను, ఆయా కమిటీలను ఎంపి అభినందించారు. కాగా రఘురామ్ జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం అన్నక్యాంటీన్‌లో పేదలు, కార్మికులకు వితరణగా భోజనాలు వడ్డించారు. నేతలు స్థానిక జెడ్‌పి హైస్కూలులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ విక్షణా శిబిరాన్ని సందర్శించి క్రీడాకారులకు అవసరమైన కనీస సదుపాయాలు, వసతులు లేవని గ్రహించి వాటిని త్వరలోనే కల్పిస్తామని ఎంపి చిన్ని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి పద్మావతి నగర్‌లోని చెత్తడంపింగ్ యార్డును ఎంపి, ఎమ్మెల్యే సందర్శించారు. సిఎస్ఆర్ నిధులతో రెండు నెలల్లో డంపింగ్ యార్డును ఆధునాతనంగాతీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని ఎంపి హామీ ఇచ్చారు. విజయవాడ రోడ్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు జరుగుతన్న పనులను పరిశీలించారు.

## బేబీ కిట్ల పంపిణీ పునరుద్ధరణ - రూ.51 కోట్లు మంజూరు





**విజయవాడ,మే 20,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీ పథకాన్ని పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో అర్థంతరంగా నిలిపివేసిన ఈ పథకం కోసం రూ.51.14 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు పేర్కొన్నారు. ఒక్కో కిట్‌కు రూ.1,410 వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఈ పథకం పునరుద్ధరణ ద్వారా సుమారు 4 లక్షల మంది తల్లులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కిట్‌లో 11 వస్తువులు...దోమతెర,బేబీ బెడ్,డ్రెస్,టవల్స్,వాషబుల్ న్యాప్‌కిన్స్,200 గ్రాముల పౌడర్(జాన్సన్),100 గ్రాముల షాంపు (జాన్సన్) ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రిలో జన్మించే ప్రతి శిశువుకూ ఉపయోగపడే వస్తువులతో ఉండే ఈ కిట్లను తల్లులకు పంపిణీ చేయడాన్ని 2016 జులై 1న టిడిపి ప్రభుత్వం ప్రారంభించింది. దీనిని వైకాపా ప్రభుత్వం 2021లో నిలిపేసింది.ప్రభుత్వ ఆసుపత్రుల్లో పురుడు పోసుకున్న గర్భిణులకు ఈ ఎన్టీఆర్ బేబీ కిట్లను అందించనున్నారు. ఈ బేబీ కిట్‌లో మొత్తం 11 రకాల వస్తువులు ఉంటాయి. దోమల నుంచి రక్షణకు ఒక దోమ తెరతో కూడిన బెడ్, దోమతెర, రెండేసి టవల్స్, డ్రెస్సులు, ఉతుక్కోవడానికి వీలుగా ఉండే న్యాప్‌కిన్లు, జాన్సన్ కంపెనీకి చెందిన 200 గ్రాముల బేబీ పౌడర్ ఒకటి, 100 ఎంఎల్ ఒక షాంపూ (జాన్సన్), 200 ఎంఎల్ నూనె, 2 సబ్బులు, సబ్బు బాక్సు, గిలకను ఈ కిట్‌తో పాటు ఇస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవానికి వచ్చి డిశ్చార్జి అయ్యే సమయంలో తల్లులకు ఫ్రీగా ఈ కిట్లను అందించనున్నారు. ఈ కిట్లను పంపిణీ చేయడాన్ని తొలుత 2016 జులై 1వ తేదీన నాటి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. తరువాత వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం 2021లో నిలిపేసింది. ఆగిన పథకాన్ని తాజాగా కూటమి ప్రభుత్వం పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నిధులు సైతం విడుదల చేశారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**బిట్రగుంట (నెల్లూరు), మే 20, ప్రభాతవార్త :** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని కొడవలూరు పడుగుపాడు రైల్వే స్టేషన్ ల మధ్య దిగువ లైన్ లో కె ఎమ్.నెం 184/28 -30 పోస్టుల మధ్య గుర్తు తెలియని సుమారు 40-45 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి రైలు కింద పడి మరణించడం జరిగిందని రైల్వే పోలీస్ లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి కాషాయం రంగు నిండు చేతుల చొక్కా, పసుపు, మెరూన్ రంగుల లుంగీ ధరించి ఉన్నాడని, సదరు వ్యక్తి పొట్టపై నిలువుగా గతంలో చేయబడిన ఆపరేషన్ మార్క్ ఉందన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తరలించి కేసును కావలి జీఆర్‌పి ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసినవారు కావలి జీఆర్‌పి పోలీసులను సంప్రదించాలని కోరారు..



మాడపాటి అతిథి గృహం రికార్డులు పరిశీలిస్తున్న ఇఓ

# శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



**శ్రీశైలంప్రాజెకు,మే20,ప్రభాతవార్త** శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంను మంగళవారంనాడు ఏపి హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ వారు కుటుంబ సమేతంగా శ్రీశైలం మల్లన్న దర్శనార్థం శ్రీశైలంకు చేరుకున్నారు.వారికి ఆలయ రాజగోపురం వద్ద ఈఓ ఎం.శ్రీనివాసరావు,ఆలయ అదికారులు, అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు.అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయదేవాలయాలను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.తదుపరి అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో వేదపండితులు వేధాశీర్వచనములు వల్లించగా,అర్చకస్వాములు తీర్థప్రసాదములు అందజేసారు.తదుపరి ఆలయ అధికారులు శ్రీస్వామివారి శేషవస్త్రములతో సత్కరించి,లడ్డు ప్రసాదములను అందజేసారు.తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంతో భహుకరించారు.

## 22నహనుమజ్జయంతి ప్రత్యేక పూజలు

**ఇంద్రకీలాద్రి, మే 20, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 22న హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజాదికాలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. మెట్లమార్గంలోని క్షేత్ర పాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ ఆంజేయస్వామివారికి అభిషేకాదులు, నాగవల్లీ దళార్చన తదితర కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు పాల్గొన్నారన్నారు. దుర్గమ్మను దర్శించుకోడానికి వచ్చే భక్తులు విడిది చేయడానికి వీలుగా మాడపాటి అతిథి గృహంలో సౌకర్యాలు పెంచాలని ఇఒ వికె శీనా నాయక్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. మంగళవారం ఆయన మాడపాటి అతిథి గృహం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిన్న పాటి రిపేర్లు వెంటనే చేయాలన్నారు. రిజర్వేషన్ విధానం పరిశీలించారు. అనంతరం గుణదలలోని దేవస్థానం స్టాఫ్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. అక్కడ ఎన్ని నివాసాలున్నాయి, సిబ్బంది ఎంతమంది నివాసముంటున్నారని తెలుసుకున్నారు. ఖరీదైన ఈ ఆలయభూమి రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# కళ్యాణదుర్గం సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా



## ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం, మే 20 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కార్యకర్తలు ప్రజలు తనపై ఎంతో నమ్మకం ఉంచి కళ్యాణదుర్గం అభివృద్ధి కోరుతూ బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించాలని ప్రజలందరి రుణం తీర్చుకునేలా కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని, పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త తలెత్తుకొని తిరిగేలా పాటుపడతానని, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ప్రజా వేదికలో నిర్వహించిన మినీ మహానాడుకు కళ్యాణ్ దుర్గం రూరల్ మండల అధ్యక్షులు గోళ్ళ వెంకటేశులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గం నియోజకవర్గం అయిన కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా 114 చెరువులకు సాగునీరు అందించే పథకాన్ని హామీ ఇచ్చిన మేరకు రెండు వందల శాతం పూర్తి చేస్తానని హర్షధ్వనాల మధ్య ప్రకటించారు. ప్రతిపక్షాల విమర్శలకు తాను వెనుకడుగు వేసేది లేదని ఇచ్చిన మాట నిలవెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా తిమ్మసముద్రం వద్ద 1110 ఎకరాల ఏపీఐఐసీ ప్రభుత్వ భూమిలో పరిశ్రమల స్థాపనకు ఇటీవల శంకుస్థాపన చేశానని 35 కోట్లతో టమోటా మామిడి ప్రాసెసింగ్ యూనిట్లతో అభివృద్ధికి బాటలో వేయనున్నట్లు తెలిపారు. మిల్ట్రీ ఇండస్ట్రీ కూడా రాబోతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా చిన్నచిన్న కుటీర పరిశ్రమలతో మొదలుకొని మధ్యతరగతి పరీక్షల దాకా గ్రామీణ యువతరం విద్యావంతులు యువ పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పించేందుకు కూడా ఆహ్వానిస్తున్నామని, ఇలాంటి వారికి అవసరమైన ప్రోత్సాహ సహాయం అందజేస్తామని తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని ఇప్పటికే గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పలు రోడ్లను జిల్లా కలెక్టర్ ద్వారా మంజూరు చేయించి పనులు పరమయ్యాయని మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రతి రోడ్డును అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. కంబదూరు పేరూరు రోడ్డు నిర్మాణంలో జాప్యం జరగడంతో టెండర్లు రద్దు అయ్యే సందర్భంలో కాంట్రాక్టర్ సుమారు ఐదు కోట్ల నష్టం వస్తుందని పనులు చేయడానికి ముందుకు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఒప్పించి నష్టాల్లో తాను కూడా పాలు పంచుకుంటానని భరోసా ఇచ్చి రోడ్డు పనిని ప్రారంభించిన విషయాన్ని హర్షధ్వనాల మధ్య వివరించారు. కరువు జిల్లా అనంతపురంలో స్వచ్ఛంద సంస్థ ఆర్డిటి పేదలకు వరమని ఆ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎస్ సి ఆర్ ఏ నిధుల మంజూరును నిలిపివేసిన సంఘటనకు గత సంవత్సరమే స్పందించి కేంద్ర హోం మంత్రి అమిస్తా దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చేసిన కృషిని వివరించారు.

## వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

### - హోంమంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. దక్షిణ కోస్తా,సీమ మీదుగా నైరుతి,బంగాళాఖాతం, ఆగ్నేయ బంగాళాఖాతం లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రస్తుతం దక్షిణ కోస్తాంధ్ర,రాయలసీమ మీదూ ఆవరించి ఉంది.

దీని ప్రభావంతో రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది,. దక్షిణకోస్తా,రాయలసీమ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు,కోస్తాంధ్ర జిల్లాల్లో గంటకు 50 నుండి 60 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. మరోవైపు కొన్ని ప్రాంతాలలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## 23న యువత శ్రేయస్సుపై ప్రత్యేక కార్యక్రమం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మే 20,ప్రభాతవార్త : వర్సిటీలో ఈనెల 23న సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వర్సిటీ సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య ఎం.త్రిమూర్తి రావు తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లోని యువత శ్రేయస్సు అనే అంశంపై నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐపిఎస్ అధికారిణి ఏ.సూర్యకుమారి హాజరుకానున్నారు.గౌరవఅతిథిగా ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం,నేషనల్ హెల్త్ మిషన్,ఏపీటీఈఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.గణపతిరావు,ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్ పర్సన్ ఉమామహేశ్వరిదేవి సెస్ డైరెక్టర్ రేవతి తదితరులు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## అవగాహన...లో జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం

గుంటూరు కల్చరల్,మే 20,ప్రభాతవార్త : నాగరికత వెల్లివిరిసిన నేటి ప్రపంచంలో మనుషుల రక్తం తాగే ఉగ్రవాద ముకలు అటవిక మానవులకంటే వికృతంగా,క్రూరంగా ప్రవర్తించడం మానవత్వానికే మాయని మచ్చ అని ఉగ్రవాదం అత్యంత క్రూరమైన అటవిక చర్య అని అవగాహన సంస్థ




ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు.సంస్థ కార్యాలయంలో జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భారతదేశానికి విషమ సమస్యగా మారిన ఉగ్రవాదం అన్న అంశంపై పాల్గొన్నవారు మాట్లాడారు.కార్యక్రమంలో విశ్రాంత ఆర్టీసి అధికారి లూకాల మురళీకృష్ణ మాట్లాడుతూ ఉక్రెయిన్ రష్యాయుద్ధం ప్రపంచ ఆర్థికవ్యవస్థను అతలాకుతలం చేస్తుంటే మరోక పక్క ఇజ్రాయెల్ హమాస్ దాడులు గాజాను రక్తసిక్తం చేస్తున్నాయని పాక్ ప్రేరణతో భారత్‌లో సీమాంతఉగ్రవాదం ప్రబలి అమాయకులు బలికావించబడుతున్నారన్నారు.చర్చలో రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, చంద్రయ్య,మల్లేశ్వరరావు,తదితరులు ప్రసంగించారు.

## నీటిపారుదల,డ్రైనేజి శాఖలు నిర్వహించే మరమ్మతుల పనులను వేగవంతం చేయాలి

బాపట్ల,మే20,ప్రభాతవార్త: నల్లమడ వాగు విస్తరణకు కావల్సిన భూమి కొరకు ప్రతిపాదనలు తయారుచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.బాపట్ల జిల్లాలో నీటిపారుదల శాఖ మరియు డ్రైనేజి శాఖలు నిర్వహించే మరమ్మత్తుల పనులను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మరియు బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మంగళవారం తనిఖీ చేశారు. తొలుత జిల్లెలమూడి గ్రామంలోని నల్లమడ వాగులో కోతకు గురైన కరకట్ట ప్రాంతాన్ని శాసన సభ్యులు



నరేంద్ర వర్మతో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నల్లమడ వాగులో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని,వాగు విస్తృతి పెంచాలని ఆయన అధికారులకు సూచించారు. నల్లమడ వాగు విస్తృతకు కావలసిన భూమి కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలని బాపట్ల, రెవెన్యూ డివిజన్ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బాపట్ల జిల్లాకు నీటి సరఫరా చేసే పి టి ఛానల్ ను వారు తనిఖీ చేశారు. ఛానల్ నుండి నీటి సరఫరా నిలుపుదల చేయడం వలన ఛానల్‌లోని ఇసుక మేటలను తొలగించాలని ఆయన అధికారులకు సూచించారు. బాపట్లకు చెందిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లోని పూడికలను తొలగించి, ట్యాంక్ యొక్క విస్తీర్ణాన్ని పెంచి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలన్నారు.దానికి సంబంధించి ప్రతిపాదన తయారు చేయాలని నీటిపారుదల శాఖ ఎస్.ఈ కి జిల్లా కలెక్టర్ సూచించారు. బాపట్లకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి నీటి సరఫరాను 35 రోజుల నుండి 60 రోజులకు పెంచాలన్నారు. తదుపరి నరసాయపాలెంలోని చెరుకూరు ట్యాంక్ చానల్లోని గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులను జిల్లా కలెక్టర్ మరియు బాపట్ల శాసనసభ్యులు ప్రారంభించారు. నర్సాయపాలెం పంచాయితీ ప్రజలు వారి పంచాయితీలోని సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీలో చెత్త సేకరణ విషయమై వారు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. నర్సాయపాలెం పంచాయితీ సెక్రెటరీ రాజును జిల్లా కలెక్టర్ చెత్త సేకరణ విషయమై ప్రశ్నించారు. ప్రతి ఇంటిలో తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి చెత్తను సేకరించాలని, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ లో వేయవలెనని, ఎక్కడపడితే అక్కడ పడవేసినట్లయితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. నీటిపారుదల శాఖ మరియు డ్రైనేజ్ శాఖలో మంజూరైన పనులన్నింటినీ ఏకకాలంలో యుద్ధ ప్రాతిపదికన నిర్దేశించిన కాలంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట నీటిపారుదల శాఖ ఎస్.ఈ వెంకటరత్నం, డ్రైనేజ్ శాఖ ఈ. ఈ మురళీకృష్ణ, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, బాపట్ల తహశీల్దార్ సలీమా, నీటిపారుదల శాఖ మరియు డ్రైనేజ్ శాఖలకు చెందిన డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## విపత్కర పరిస్థితిలో ఎదుర్కోవడానికి సిద్దంగా ఉండండి


కర్లపాలెం,మే20,ప్రభాతవార్త: గ్రామాల్లో ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురైనా వాటిని ఎదుర్కోవడానికి ప్రభుత్వ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలియజేశారు మంగళవారం మండల పరిధిలోని తుమ్మలపల్లి పెద గొల్లపాలెం నర్రావారిపాలెం కట్టావారి గ్రామాల్లో ఆయన పర్యటించారు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో తుఫాన్ షెల్టర్లను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు వెంటనే వాటికి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని చుట్టూ ఉన్న పిచ్చి



మొక్కలను తొలగించాలని ఆయన ఆదేశించారు ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవడానికి సచివాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధులు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు ఆయన వెంట ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు కార్యదర్శి సమీర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా నల్లమోతువారిపాలెం గ్రామ దేవత శ్రీ పెద్దింటమ్మ తల్లి కొలుపులు

కర్లపాలెం,మే20,ప్రభాతవార్త: కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలోని గ్రామ దేవత శ్రీ పెద్దింటమ్మ తల్లి కొలుపులను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు, జనసేన పార్టీ బాపట్ల సమన్వయకర్త నామన శివన్నారాయణ లు పెద్దింటమ్మ తల్లి ని దర్శించుకొని పూజలు చేశారు.నరేంద్రవర్మరాజు ను గ్రామస్తులు పూలమాలలు,



సాలువతో ఘనంగా సన్మానించారు ఆలయం గ్రామసు_ _లు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుంటా రత్నబాబు,మాడా శ్రీనివాసరావు, సూరినేని మురళీకృష్ణ, మర్రి అశోక్,గరిగంటి శ్రీనివాసరావు, గుర్రాల అప్పారావు, తాంద్ర శ్రీనివాసరావు,తోట ఏసురాజు,ఏమినేని తిరుపతయ్య,సోమా శేషయ్య,దొడ్డా వెంకట రామారావు,డెంకేన రామారావు,బీసాబత్తుని వెంకటేశ్వర్లు,ఇక్కుర్తి నాగఅంజనేయులు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## ఇక సర్వ్ గా జెన్ జడ్ ఆన్లైన్‌స్టోర్

విజయవాడ, మే 20, ప్రభాతవార్త : తమ నెక్స్ట్ జెన్ స్టోర్ ను ఇప్పుడు సర్వ్, టివిడిషింగగ్ ఔట్‌స్టైల్ పేరిట మళ్ళీ ప్రారంభించినట్లు అమేజాన్ ఫ్యాషన్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. తమను తాము ఆత్మవిశ్వాసంతో, స్టైల్‌గా, ఆకట్టుకునేలా, ఆకర్షణీయంగా వుండేట్లు భావించేలా ప్రెజెంట్ చేసుకోడానికి సర్వ్ పదం ఆకట్టుకుంటుందన్నారు.

## సోని ఇండియా నుండి బ్రావియా కొత్త టివి సిరీస్

విజయవాడ, మే 20, ప్రభాతవార్త : సోనీ ఇండియా కొత్త టెలివిజన్ శకాన్ని ఆవిష్కరించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. 108, 126, 139, 164, 189 సెం.మీలతో లభ్యమయ్యే 4కె అల్ట్రా హెచ్‌డి ఎలీ ౠడీడిస్ప్లే సాంకేతికతతో కూడిన బ్రావియా 2 2 సిరీస్ గూగుల్ టివితో అనుసంధానించవచ్చని, విస్తృత శ్రేణి యాప్‌లతో, స్ట్రీమింగ్ సేవలతో, లైవ్‌టివి చానెళ్ళను సులభంగా యాక్సెస్ చేయొచ్చన్నారు.

# ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం

బాపట్ల,మే20,ప్రభాతవార్త: ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఫోర్స్మెంట్ కార్యకలాపాలు మరింత పెరగాలి, ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇసుక రేవుల వద్ద అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు లేని వాహనాలు రేవు నుంచి బయటకు వెళ్లరాదన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూన్ నెల నుంచి ఇసుక తవ్వకాల నిషేధం అమలులోకి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రేవు నుంచి వాహనాలు వెళ్లే రహదారులను తొలగించాలని ఆదేశించారు. అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేయాలన్నారు. ఆ వాహనాలను వెంటనే విడిచిపెట్టకుండా భారీగా జరిమానాలు విధించాలన్నారు. మరోసారి అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 2021 నుంచి 2024 సంవత్సరం వరకు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఏపీసాక్ నివేదిక ఆధారంగా జెపి వెంచర్స్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.ప్రజల అవసరాల మేరకు ఇసుక రేవును నూతనంగా గుర్తించామన్నారు.జువ్వలపాలెం2 ఇసుక రేవులో ఇసుక లభ్యత ఉందన్నారు. ఇక్కడ ఇసుక వినియోగం కొరకు జిల్లాస్థాయి కమిటీ తీర్మానించి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు ప్రకటించారు. జువ్వలపాలెం2 రేవులో 24.9 హెక్టార్లలో ఇసుక లభ్యత అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఇసుక అక్రమ తవ్వకాలు



జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రస్తుతం భట్టిప్రోలు ఇసుక రేవులో 12 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. అలాగే గాజుల్లంక ఇసుక రేవులో 19వేల మెట్రిక్ టన్నుల లభ్యత ఉందన్నారు. ప్రజల అవసరాల కొరకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు.ఈ సమావేశంలో జిల్లా మైన్స్ ఏడి రాజేష్, డిటిఓ పరంధామ రెడ్డి, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి రాఘవేంద్రరావు, బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి

పొన్నూరు, మే 20,ప్రభాతవార్త: పురపాలక సంఘ పరిధిలోని పాత పొన్నూరులో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవాలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు



కమిటి నిర్వాహకులు తెలిపారు. జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి విశేషాభిషేకాలు, అర్చనలు, అలంకరణలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా లక్ష మల్లెలార్చన, లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కమిటి నిర్వాహకులు కోరారు. హనుమజ్జయంతిని పురస్కరించుకొని దేవాలయాన్ని వివిధ రకాల రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. విద్యుద్ధీకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

## ఉద్యోగుల సంక్షేమానికి సంగం పెద్ద పీట

### -సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్

పొన్నూరు, మే 20,ప్రభాతవార్త: సంగం డెయిరీ పాడి రైతుల, పశువుల సంక్షేమంతోపాటు ఉద్యోగుల సంక్షేమానికి కూడా పెద్ద పీట వేస్తుందని సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సంగం డెయిరీ అధ్వర్యంలో సంగం డెయిరీ ఉద్యోగుల పిల్లల భవిష్యత్తు, విద్య, ఉద్యోగావకాశాలకు సంబంధించి కెరీర్ గైడెన్స్




వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణన్ మాట్లాడుతూ సంగం డెయిరీ ఉద్యోగుల పిల్లలు సరైన కెరీర్, విద్యానిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడాలనే ఉద్దేశంతోనే ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు చెప్పారు. మెంటోరియా, ముంబై వారి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి కళాశాల విద్యార్థుల కోసం రూపొందించబడిందన్నారు.పిల్లల భవిష్యత్తుకు సంబంధించి కెరీర్ నిర్ణయాల ప్రాముఖ్యతలు, సంక్లిష్ట, వివిధ రంగాలలో అందుబాటులో ఉన్న కెరీర్ ఎంపిక గురించి, టెక్నాలజీ, ఎ1, పనిలో దాని ప్రభావము, కొత్త విద్యావిధానము, కెరీర్ ఎంపికలపై దాని ప్రభావం, ఇలా మరెన్నో రంగాల గురించి వివరించారు. 13-21వయస్సు కలిగి ఉన్న, 8వ తరగతి నుంచి పై చదువులు చదువుతున్న 200మంది విద్యార్థులు, 150మంది తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సిఈఓ అనిల్‌కుమార్, సంగం డెయిరీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు -అర్బన్ సిఐ లావూరి వీరానాయక్


పొన్నూరు, మే 20,ప్రభాతవార్త: మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ హెచ్చరించారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మైనర్లు వాహనాలు నడపడాన్ని, అదీ



ట్రిపుల్ రైడింగ్ చేయడాన్ని గుర్తించి, వారిని ఆపారు. మైనర్ల తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదం జరిగాక అందరం బాధపడాల్సి వస్తుందన్నారు. అందుకని తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలన్నారు. అందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వాహనాలను నడిపేవారు తప్పని సరిగా అందుకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపిన మైనర్ల తల్లిదండ్రుల నుంచి జరిమానా వసూలు చేశారు. మళ్ళీ ఇలాంటి తప్పిదం చేస్తే ఈసారి కేసులు నమోదు చేస్తామని సిఐ హెచ్చరించారు.

## 23న నాగపూర్ 'తాజ్' బాబా మహా దివ్య అన్న సమారాధన

ఎ కొండూరు, మే 20, ప్రభాతవార్త : మహారాష్ట్రలోని నాగపూర్ షరీఫ్‌లో వేంచేసి వున్న హాజర్ హజరత్ సయ్యద్ బాబా తాజుద్దీన్ తాజువ ఔలియ మహాత్ముల వారి చబ్బీస్ ధార్మిక కార్యక్రమాన్ని ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె-ఎ-బాగ్దాద్‌లో ఈనెల 23న శుక్రవారం అత్యంత భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు అతావుల్లా బాబా దర్బార్ అండ్



దర్గా పీఠాధిపతి బాబా ఆధ్యాత్మిక వారసుడు పీర్‌జాదా ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ ఫాతాజ్ ఖాదరీ బాబా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కులమతాలకతీతంగా దర్బార్ అండ్ దర్గాకు వచ్చే వేలాదిమంది అతావుల్లా బాబా భక్తులకు శుక్రవారం రాత్రి మమా దివ్య అన్న సమారాధన కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఖాజీబాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో జాఫర్ సాదక్, బాగ్దాద్, తాజ్ ఖాదర్ బాబు దర్గా అండ్ దర్బార్ పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కుపై ప్రభుత్వాలు దాగుడు మూతలు ఆపాలి

### -కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్

పొన్నూరు, మే 20,ప్రభాతవార్త: ఆంధ్రుల ఆత్మగౌరవ సంపద అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాగుడుమూతలు ఆపాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ అన్నారు. ఉక్కు కార్మాగారంపై నెలకొన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, సంస్థలోని ఉద్యోగుల పట్ల యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ గత కొద్ది నెలలుగా అక్కడి ఉద్యోగులు చేస్తున్న నిరవధిక నిరసన దీక్షలను బట్టుదాఖలు చేస్తూ యాజమాన్యం



తప్పు చేస్తోందన్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు విశాఖ ఉక్కు పరిశ్రమ, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ప్రైవేటికరణ, అందులోని కార్మికుల అక్రమ తొలగింపులో కేంద్ర, రాష్ట్రంలో ఉన్న కూటమి పార్టీలదేకాక గత ఐదేళ్ళు అనైతిక పొత్తు పెట్టుకొని మోదీ దత్తపుత్రుడిలా వ్యవహరించిన జగన్‌ది కూడా అని అన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలైన టిడిపి, జనసేన, వైసీపి పార్టీలలో చిత్తశుద్ధి లేకపోవడంతో విశాఖ ఉక్కుపై కేంద్రం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఉక్కు కర్మాగారంపై పోరాటం చేస్తుందన్నారు. పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి పలు దఫాలుగా నిరసనలు, పోరాటాలు తెలియజేయడం జరిగిందన్నారు. ప్లాంట్ పరిరక్షణ, కార్మికులకు న్యాయ సాధనకై నినందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. సంస్థలో పనిచేస్తున్న మూడువేలకుపైగా కార్మికులకు రాత్రికి రాత్రే తొలగించడం అనైతికమని, అప్రజాస్వామికమన్నారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ ఆంధ్రుల హక్కు అయిన విశాఖ హక్కును కాపాడుకోనేందుకు ముందుకు రావాలని దిలీప్ కోరారు.

## సైనికులకు అండగా నిలవాలి-తహశీల్దార్ శ్రీనివాసశర్మ

పొన్నూరు, మే 20,ప్రభాతవార్త: మన దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న మన సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా నివాల్సిన అవసరం ఎంతైనా ఉందని తహశీల్దార్ శ్రీనివాసశర్మ అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన సింధూర్ ఆపరేషన్ విజయవంతం అయిన నేపథ్యంలో కూటమి ఆధ్వర్యంలో



తిరంగా ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మూట్లూరు రోడ్డులోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసశర్మ మాట్లాడుతూ భారత్ చాలా శక్తివంతమైన దేశమన్నారు. పాకిస్థాన్ కవ్వింపు చర్యలను భారత్ ధీటుగా ఎదుర్కొందన్నారు. భారత్ దెబ్బకు పాకిస్తాన్ సైన్యం చేతులు ముడుచుకోక తప్పలేదన్నారు. భారత్-పాక్ సరిహద్దులో కంటిమీద నిద్ర లేకుండా మన సైనికులు కాపాలా ఉండడం వల్లే మనమంతా ప్రశాంతంగా జీవిస్తున్నామన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. సైనికుల త్యాగాలను మరవకూడదన్నారు. అనంతరం సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి,బిజెపి,జెఎస్పీ పార్టీల మండలాధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, శ్రీరామచంద్రమూర్తి, చందు శ్రీరాములు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## 31న కౌలు వేలం పాటలు

పొన్నూరు, మే 20,ప్రభాతవార్త: చుండూరు మండల పరిధిలోని చినపరిమి గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానానికి సంబంధించిన మాగాని భూమికి కౌలు వేలం పాటలను ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి ఈమని అశోక్‌రెడ్డి తెలిపారు. 2025-26నుంచి 2027-28 వరకు మూడు సంవత్సరాలు కౌలు చేసుకొనేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చినపరిమి



గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద నిర్వహించనున్నట్ల చెప్పారు. హెచ్చుపాటదారుడు పాట అయిన వెంటనే పాట మొత్తము చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని అశోక్‌రెడ్డి కోరారు.

## నైపుణ్యాల మెరుగుకు చదరంగం ఆట దోహదం

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు


పొన్నూరు, మే 20,ప్రభాతవార్త: నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు చదరంగం ఆట ఎంతగానో దోహదపడుతుందని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. స్థానిక జెఎంఆర్ కళ్యాణమండపంలో మంగళవారం జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను బాలాజీ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో అండర్-11 బాల, బాలికలు, ఓపెన్ రాపిడ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు




మాట్లాడుతూ చదరంగం ఆట ఒక క్లాసిక్ వ్యూహాత్మక ఆట అని చెప్పారు. ఈ చదరంగం ఆడడం ద్వారా మనలో జ్ఞాపకశక్తి, ప్రణాళిక, సమస్య పరిష్కారంతోపాటు విమర్శనాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఇది పిల్లల అభిజ్ఞా నైపుణ్యాలను మెరుగుపరుస్తుందన్నారు. వివేకా ఫాస్టర్ స్కూల్ డైరెక్టర్ ఉప్పల సుకుమార్ మాట్లాడుతూ చదరంగం ఆట శ్రద్ధాశక్తి, దాని పరిధిని పెంచుతుందన్నారు. మరీ ముఖ్యంగా పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. వయసుతో వచ్చే జ్ఞాపకశక్తి క్షీణతను నివారించడానికి, అభిజ్ఞా క్షీణతను తగ్గించడానికి సహాయపడుతుందన్నారు. డాక్టర్ మారం శివకుమార్ మాట్లాడుతూ చదరంగం ఆట క్రీడాకారుల్లో సహనాన్ని పెంపొందిస్తుందన్నారు. సమస్య పరిష్కార నైపుణ్యాలను మెరుగుపరుస్తుందన్నారు. శ్రద్ధను పెంచడంతోపాటు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందన్నారు. ఇలాంటి ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సుమారు 75జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, డాక్టర్ హిమబిందు, క్రీడాకారుడు సూర్యనారాయణ ప్రసంగించారు. ఆటల పోటీలకు గంగరాజు మురళీకృష్ణ, షేక్ బాజిబాషా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## బాడవ టోల్‌ప్లాజా వద్ద 'గడ్డి' ప్లాన్‌కు రూటు మార్చిన దేవినేని అవినాష్

ఎ కొండూరు, మే 20, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై అధికార టిడిపి కూటమి, వైసిపిల మధ్య సోమవారం ఏర్పడిన తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల మధ్య సోమవారం చైర్మన్ ఎన్నిక కోరం లేక ఆర్‌డిఓ కె మాధురి వాయిదా వేసి తిరిగి మంగళవారం నిర్వహిస్తామని ప్రకటించడంతో టిడిపి, వైసిపి శ్రేణుల, నాయకుల, కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడడంతో మంగళవారం కూడా ఎన్నికల అధికారులు వాయిదా వేశారు. ఈ ఎన్నిక నేపథ్యంలో సోమవారం తిరువూరు చేరుకున్న ఎన్‌టిఆర్ జిల్లా వైసిపి అధ్యక్షుడు దేవినేని అవినాష్, అతని అనుచరులు రావడం మరింత ఘర్షణ వాతావరణం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో అక్కడి పరిస్థితుల దృష్ట్యా, గడ్డి కృష్ణారెడ్డి, దేవినేని అవినాష్ తిరువూరు రాకుండా అడ్డుకుంటామని భీష్మ ప్రతిజ్ఞ చేయడం , అవినాష్ మంగళవారం తిరువూరు వస్తున్నాడనే సమాచారం తెలుసుకున్న మండల తె.దె.పా అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, పార్టీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఇబ్రహీంపట్నం, తిరువూరు జాతీయ రహదారి (30), మైలవరం మండలం బాడవ ఎన్‌హెచ్ (30) టోల్‌ప్లాజా వద్ద అడ్డుకోటానికి భారీసంఖ్యలో చేరుకోవడంతో పోలీసులకు కృష్ణారెడ్డికి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న అవినాష్ శ్రేణులు, నాయకులు బాడవ రూటుమార్చి వేరే మార్గం ద్వారా ఎ కొండూరు మండలం రేపూడి మీదుగా వెళుతుండగా, మాధవరం, రేపూడి



గ్రామాల్లో టిడిపి శ్రేణులు భారీగా చేరుకుని అడ్డుకున్నారు. ఈ సమయంలో అక్కడే వున్న పోలీసులు అవినాష్‌ను తిరువూరు వెళ్ళకుండా అరెస్ట్ చేసి మైలవరం మండలం రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఘర్షణ వాతావరణం సద్దుమణిగింది. దీంతో ఇరువర్గాల శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

21-5pg10.qxd:21-5pg10.qxd 01/01/01 6:36 AM Page 1



### మహిళల టి20 వరల్డ్ కప్..

## క్వాలిఫయర్స్‌కు నేపాల్, థాయ్ అర్హత

### చివరి లీగ్ మ్యాచ్‌ల్లో ఎమిరేట్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల టీ20 వరల్డ్ కప్-2026 గ్లోబల్ క్వాలిఫయర్స్‌కు నేపాల్, థాయ్‌లాండ్ జట్లు ఆఖరి నిముషంలో అర్హత సాధించాయి. ఆసియా క్వాలిఫయర్స్‌లో అద్భుత ప్రదర్శన కనపర్చిన ఈ రెండు జట్లు వరల్డ్ కప్ బెర్త్ కోసం పోటీ పడేందుకు అర్హత సాధించాయి. తమ చివరి లీల్ మ్యాచ్‌ల్లో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌పై విజయాలు సాధించిన నేపాల్, థాయ్‌లాండ్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించాయి. గ్లోబల్ క్వాలిఫయర్స్‌కు ఇప్పటికే స్కాంట్లాండ్, బంగ్లాదేశ్ జట్లు అర్హత సాధించాయి. ఇక యూరప్, ఆఫ్రికా క్వాలిఫయర్స్ నుండి అర్హత సాధించే జట్లేవో తెలియాల్సి ఉంది. ఈరెండు టోర్నీల నుండి రెండు జట్లు వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తాయి. అనంతరం గ్లోబల్‌క్వాలిఫయర్స్‌లో ఆరు జట్లు పోటీ పడగా, అందులో నాలుగు జట్లు వరల్డ్ కప్‌కు అర్హత సాధిస్తాయి. కాగా2026 మహిళల టీ20 వరల్డ్ కప్ ఇంగ్లండ్ వేదికగా జరగనుంది. ఈ టోర్నీలో మొత్తం 12జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి పోటీ పడతాయి. ఆతిథ్య దేశ హోదాలో ఇంగ్లండ్‌తొలుత ఈ వరల్డ్‌కప్‌కు అర్హత సాధించగా, ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక దేశాల జట్లు ఈ మెగా టోర్నీకి నేరుగా అర్హత సాధించాయి. మిగిలిన నాలుగు బెర్తలు గ్లోబల్ క్వాలిఫయర్స్ ద్వారా నిర్ణయం అవుతాయి. ఈ టోర్నీలో న్యూజిలాండ్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగనుంది.

## లాటిన్ అమెరికాతో ఛెత్రి శాశ్వత అగ్రిమెంట్

### తొలి భారత్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రికార్డు



**న్యూఢిల్లీ:** లాటిన్ అమెరికన్ జట్టుతో భారత్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు బిజయ్ ఛెత్రి శాశ్వత ఒప్పందం చేసుకున్నాడు. ఉరుగ్వే క్లబ్ కోలన్ ఎఫ్‌సితో పూర్తి సమయం ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా బిజయ్ ఛెత్రి దక్షిణ అమెరికా జట్టులో శాశ్వతంగా చేరిన మొదటి భారతీయ ఆటగాడిగా నిలిచాడు. మణిపూర్‌కు చెందిన ఛెత్రి, 2016లో షిల్లాంగ్ లాజోంగ్‌తో తన ఫుట్‌బాల్ కెరీర్‌ను ప్రారంభించాడు. 2018లో ఇండియన్ ఆరోస్‌తో సీనియర్‌గా అరంగేట్రం చేశాడు. అప్పటి నుండి అతను తనతొలి ఐఎస్‌ఎల్‌క్లబ్ అయిన చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్‌లో చేరడానికి ముందు చెన్నై సిటీ, రియల్ కాశ్మీర్ మరియు శ్రీనిధి డెక్కన్ వంటి క్లబ్‌లకు ఆడాడు. అయితే, కోలన్‌లో ఛెత్రి గత సీజన్‌లో కేవలం 25 నిమిషాలు మాత్రమే ఆడాడు. ఉరుగ్వేలోని సెగుండా డివిజన్ ప్రొఫెషనల్ (రెండవ డివిజన్)లో పోటీ పడుతున్నాడు. 23 ఏళ్ల సెంటర్‌బ్యాక్ గతసీజన్‌లో చెన్నైయిన్ ఫుట్‌బాల్‌క్లబ్ తరపున పాల్గొంటున్నాడు. ఈసారి దాన్ని మరింతగా మెరుగుపరచుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు.



### ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ ర్యాంకింగ్స్‌లో..

## అగ్రస్థానంలో సబలెంకా

### 2 నుండి 5వ ర్యాంక్‌కు పడిపోయిన స్వియాటెక్

### శ్రీవల్లికి 287, సహజకు 316 ర్యాంక్

**న్యూఢిల్లీ:** ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూటిఎ) ర్యాంకింగ్స్‌లో అరినా సబలెంకా అగ్రస్థానాన్ని ఆక్రమించింది. రోమ్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత అమెరికాకు చెందిన కోకో గాఫ్ తన కెరీర్‌లో 2వ ర్యాంకుకు తిరిగి చేరుకుంది. డబ్ల్యూటిఎ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకునే ముందు ఇగా స్వియాటెక్ 5వ స్థానానికి పడిపోయింది. 23 ఏళ్ల స్వియాటెక్ ఈ నెల 25 నుండి జూన్ 8 వరకూ పారిస్‌లో జరగనునన రోలాండ్ గారోస్‌లో వరుసగా ఐదవ టైటిల్‌ను గెలుచుకోవాలని పట్టుదలతో ఉంది. అయితే మాజీ ప్రపంచ నంబర్ వన్ అయిన పోలిష్ క్రీడాకారిణి, 2024 ఎడిషన్ క్లే మేజర్‌లో విజయం సాధించినప్పటి నుండి స్వియాటెక్ ఇబ్బంది పడుతోంది. ఇటీవల ఆమె ఇటాలియన్ ఓపెన్‌లో 32వ రౌండ్‌లో అమెరికన్ డేనియల్ కాలిన్స్ చేతిలో ఓడిపోయింది. దీని ఫలితంగానే స్వియాటెక్ ర్యాంకింగ్స్‌లో 2 నుండి 5వ స్థానానికి పడిపోయింది. ఇక ఇటాలియన్ ఓపెన్‌ను సొంతం చేసుకున్న జాస్మిన్ పావోలిని 5వ స్థానం నుండి నాల్గవ స్థానానికి చేరుకోగా, గాఫ్ స్వదేశీయురాలుజెస్సికా పెగులా 4వ స్థానం నుండి 3వ స్థానానికి చేరుకుంది. అలాగే రోమ్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో గాఫ్ చేతిలో ఓడిపోయిన రష్యన్ టీనేజర్ మిర్రా ఆండ్రీవా, ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ మాడిసన్ కీస్‌ను అధిగమించి ఆరో స్థానంలో నిలిచింది. ఇక భారత్ ప్లేయర్లకు సంబంధించి టాప్ 100లో ఎవరికీ స్థానం దొరకలేదు. ప్రార్థన తోంబరే నాలుగు స్థానాలు ఎగబాకి 148వ ర్యాంక్‌కు, అంకితా రైనా ఒక స్థానం ఎగబాకి 208వ ర్యాంక్, రుతుజా భోసలే 20 పాయింట్లు పడిపోయి 242వ స్థానానికి, ఆరు స్థానాలు పైకి ఎగబాకిన రియా భాటియా 258వ ర్యాంక్, భమిడిపాటి శ్రీవల్లి 282వ ర్యాంకుకు, ఏడు స్థానాలు ఎగబాకి 316వ ర్యాంక్‌తో యమలపల్లి సహజ, ఆరు స్థానాలు ఎగబాకిన వైదేహీ 355వ ర్యాంక్ లభించింది.

## హైదరాబాద్ విక్టరీతో ప్లే ఆఫ్స్ నుండి లక్నో ఔట్

### గుజరాత్,బెంగళూరు, పంజాబ్ కన్ఫర్మ్.. నాలుగో ప్లేస్‌కు ముంబయి, ఢిల్లీ మధ్య నేడు కీలక పోరు







**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025, సీజన్ 18 ప్లేఆఫ్‌లకు సంబంధించిన లెక్కలు ముగింపు దశకు వస్తున్నాయి. ప్రస్తుతానికి గుజరాత్, బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు మాత్రమే ప్లే ఆఫ్స్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇక నాలుగో జట్టు గురించి మాత్రం మరో రోజు ఆగాల్సిందే. ఇందు కోసం రెండు జట్లు పోటీపడనున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓడిపోవడం ద్వారా, లక్నో సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్ రేస్‌కు చేరుకునే ఆశలకు కూడా తెరపడింది. ఇక ఇప్పుడు ప్లేఆఫ్స్‌లో మిగిలిన స్థానం కోసం రెండు జట్లు ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ రేసులో మిగిలి ఉన్నాయి. ముంబై, ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ సమీకరణాన్ని చూస్తే పాయింట్ల పట్టికలో రెండు జట్ల స్థానాలు కీలకం కానున్నాయి. ముంబై ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాల్గవ స్థానంలో ఉంది. 12 మ్యాచ్‌ల తర్వాత ముంబై ఖాతాలో 14 పాయింట్లు ఉన్నాయి. ఢిల్లీ 12 మ్యాచ్‌లలో 13 పాయింట్లు సాధించి పట్టికలో 5వ స్థానంలో ఉంది. అంటే, గ్రూప్ దశలో రెండు జట్లకు చెరొక మ్యాచ్ మిగిలి ఉంది. దీంతో ఈ ఇరుజట్లలో ఒకరు ప్లేఆఫ్స్‌కు చేరుకోనున్నారు. ఇందుకు ఈ నెల 21 కీలకమైంది. ఈ రోజున ముంబై వర్సెస్ ఢిల్లీ ముఖాముఖిగా తలపడ్డాయి. అంటే, ఒకరి జట్టు గెలిస్తే, వారిలో ఒకరి ఓటమి ఖాయం. రెండు జట్లకు ఓడిపోవడం అంటే, ప్లే ఆఫ్స్ నుంచి బయటడడమే అని తెలుసు. ఈసారి రెండు జట్లు వాంఖడేలో ఒకదానికొకటి తలపడుతున్నాయి. కాబట్టి, ఇది ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రతీకార మ్యాచ్ అవుతుంది. ఎందుకంటే గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ తమ సొంత మైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. ఢిల్లీ ప్రతీకారం తీర్చుకుంటే, ముంబై ఇండియన్స్ పురోగతి కథ ఇక్కడ ఆగిపోతుంది. ప్లేఆఫ్ సమీకరణం ప్రకారం ఢిల్లీ అయినా ముంబై అయినా, రెండూ తమ మిగిలిన రెండు మ్యాచ్‌లను గెలవాలి. ఇటువంటి పరిస్థితిలో, ఈ నె 21న ఈ ఇద్దరి మధ్య ఘర్షణ మరింత ముఖ్యమైనది అవుతుంది. ఒకరితో ఒకరు తలపడిన తర్వాత, రెండు జట్లు చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడవలసి ఉంటుంది. ఈ సీజన్‌లో ముంబై, ఢిల్లీ జట్లు తొలిసారి పంజాబ్ కింగ్స్ సవాలును ఎదుర్కోవడం ఇదే తొలిసారి. ముంబై, ఢిల్లీ రెండూ జైపూర్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడవలసి ఉంది. జైపూర్‌లోని సవాయ్ మాన్సింగ్ స్టేడియం రికార్డు ఢిల్లీకి అనుకూలంగా ఉంది. ముంబై కంటే ఇక్కడ ఎక్కువ మ్యాచ్‌లు ఆడడమే కాకుండా, ఎక్కువ విజయాలు కూడా సాధించింది. మునుపటి గణాంకాల ప్రకారం ప్రతిదీ అలాగే ఉంటే, ప్లేఆఫ్ రేసులో ముంబై ఇండియన్స్ ఢిల్లీ క్యాపిటల్స్ కంటే ముందుండటం కష్టమే అనిపిస్తుంది.

## టి 20లో యుఎఇ రికార్డు విజయం

### 2 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి



**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో పసికూన అయిన యూఏఈ రికార్డు విజయం సాధించింది. తమ చరిత్రలో తొలిసారి బంగ్లాదేశ్‌పై విజయం నమోదు చేసింది. టీ20 మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో 2 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బాంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం బరిలోకి దిగిన యూఏఈ మరో బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ టాపార్డర్ బ్యాటర్లు తంజిద్ హసన్ (59), లిటన్ దాస్ (40), నజ్ముల్ హసన్ షాంటో (27), తౌహిద్ హృదోయ్ (45), జాకిర్ అలీ (6 బంతుల్లో 18) రాణించడంతో భారీ స్కోర్ చేసింది. యూఏఈ బౌలర్లలో జవాదుల్లా 3 వికెట్లు, సాఘిర్ ఖాన్ 2 వికెట్లు తీశారు. తదుపరి భారీ లక్ష్య ఛేదనకు దిగిన యూఏఈని కెప్టెన్ మహమ్మద్ వసీం (42 బంతుల్లో 82) అద్భుత ఇన్నింగ్స్ ఆడి గెలిపించాడు. వసీం ఔటయ్యే సరికి యూఏఈ లక్ష్యానికి ఇంకా దూరంలో ఉన్నా, వచ్చిన బ్యాటర్లు వచ్చినట్లు తలో సిక్సరో, బౌండరీనో బాది జట్టు గెలుపునకు దోహదపడ్డారు. చివర్లో ధృవ్ పరాషార్ (11), హైదర్ అలీ (15 నాటౌట్) జాగ్రత్తగా ఆడి యూఏఈకి రికార్డు విజయాన్ని అందించారు. యూఏఈ 18.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. బంగ్లా బౌలర్లలో షోరీఫుల్, నహీద్ రాణా, రిషద్ హొసేన్ తలో రెండు వికెట్లు తీయగా, తన్వీన్ ఇస్లాం, తంజిమ్ హసన్ చెరో వికెట్ పడగొట్టారు. కాగా ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో యూఏఈ 1-1తో సమంగా నిలిచింది. ఈ సిరీస్ కోసం యూఏఈలో (షార్జా) పర్యటిస్తున్న బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నిర్ణయాత్మక మైన మూడో టీ20 ఈ నెల 21న షార్జాలో జరుగనుంది.

# వాణిజ్యం

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 20:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి బలహీన సంకేతా లు, విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణ దీనికి తోడైంది. ఆరంభంలో లాభాల్లో కదలాడిన సూచీలు.. తర్వాత భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 800పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ 24,700 దిగువకు చేరింది. నిఫ్టీ ఆటో సూచీ 2 శాతానికి పైగా నష్టపోగా, నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు 1 శాతానికి పైగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్ 100 సూచీ 1.62 శాతం, స్మాల్‌క్యాప్ సూచి 0.94 శాతం చొప్పున క్షీణించాయి. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.50 లక్షలు క్షీణించి రూ.440.23 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,116.17 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 81,153.70 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 872.98 పాయింట్ల నష్టంతో 81,186.44 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 261.55 పాయింట్ల నష్టంతో 24,683.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.63గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఐటీసీ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అమెరికా ప్రభుత్వ అప్పులపై ఆందోళన నేపథ్యంలో యూఎస్ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ డౌన్‌గ్రేడ్ చేసింది. దీంతో అక్కడి 30 ఏళ్ల బాండ్ రాబడులు 2023 నవంబర్ తర్వాత గరిష్ఠ స్థాయి అయిన 5.03 శాతానికి చేరాయి. బాండ్ రాబడులు పెరగడంతో భారత్ వంటి వర్ధమాన దేశాల మార్కెట్లకు లిక్విడిటీ తగ్గొచ్చన్న భయాల తో మన మార్కెట్లు పడ్డాయి. గత కొన్ని రోజులుగా కొనుగోళ్లవైపు మొగ్గుచూపిన విదేశీ సంస్థా గత ఇన్వెస్టర్లు మే 19న అమ్మకాలకు దిగారు. రూ.526 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత సైతం రూ.238 కోట్లు విలువైన షేర్లను విక్రయించారు. భారత్-పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం స్టాక్ మార్కెట్ సూచీలు దూసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో 4 శాతం మేర లాభపడ్డాయి. ఈ క్రమంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ వంటి లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మళ్లీ కొవిడ్ కేసులు పెరుగుతుండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది.



## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముమ్మరం



**న్యూఢిల్లీ, మే 20:** భారత్, అమెరికా ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) మొదటి దశను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఇరు దేశాలు చర్చలను ముమ్మరంచేశాయి. ఈ మేరకు కేంద్ర వాణిజ్య,పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్‌తో సమావేశమయ్యారు. మొదటి దశ ఒప్పందాన్ని త్వరగా పూర్తి చేసే దిశగా తమ మధ్య ఫలప్రదమైన చర్చలు జరిగాయని ఎక్స్ వేదికగా తెలిపారు. మంత్రుల స్థాయి సమావేశాల అనంతరం రెండు దేశాల ప్రధాన సంధానకర్తల మధ్య చర్చలు ఈనెల 22 వరకు నిర్వహించను న్నారు. ఈ ఏడాది సెప్టెంబరు అక్టోబరు నాటికి తొలిదశ ఒప్పం దాన్ని ఖరారు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈచర్చల్లో ప్రధానంగా పరస్పర మార్కెట్ల వినియోగం.. స్థానికనిబంధనల అమలు, టారిఫ్ మినహాయింపులకు పరిమితులపై ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ ఒప్పం దంలో భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయ నాలు,రొయ్యలు, నూనె గింజలు, రసాయనాలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రోకెమికల్ ఉత్పత్తు లు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. ఈఒప్పందం కోసం రెండు దేశాలు నిబంధనల్ని ఖరారుచేశాయి. ఇందులో సుంకాలు, వస్తువులు, సేవలు, సుంకేతర అడ్డంకులు,కస్టమ్స్ వంటి అంశాలు ఉన్నాయి. అమెరికా, భారత్‌పై విధించిన అదనపు 26 శాతం సుంకాలను జులై 9 వరకు తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో ఈ 90 రోజుల వ్యవధిని ఉపయోగించుకొని చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఇక 10 శాతం బేస్‌లైన్ సుంకం యథాతథం గా కొనసాగుతుంది. విస్తృతమైన వాణిజ్య లోటును తగ్గించేందుకు టారిఫ్ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ఏప్రిల్ 2న ప్రకటించిన విషయం తెలిసిందే.


## నిస్సాన్ ప్లాంట్ల మూసివేత వార్తలపై కంపెనీ క్లారిటీ!

**న్యూఢిల్లీ, మే 20:** దేశంలోని కొన్ని తయారీ ప్లాంట్లను మూసివేస్తారని వస్తున్న వార్తలను నిస్సాన్ మోటార్ ఇండియా అధికారికంగా తోసిపుచ్చింది. తమ కార్యకలాపాలు, డీలర్లు, భాగస్వాములు, వినియోగదారులకు సేవ చేసేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ఇండియాలో తమ సర్వీసులపట్ల ఉన్నట్లు కంపెనీ ఇటీవల ఒక ప్రకటనలో తెలిపింది. నిస్సాన్ కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా మెక్సికోలో ఫ్రాంటియర్, నవరా పికప్స్ ఉత్పత్తి ఏకీకృతం చేస్తున్నట్లు ప్రకటించడంతో ఈ పుకార్లు వెలువడ్డాయి. అయితే ఈ మార్పుల వల్ల భారత తయారీ ప్లాంట్లు ప్రభావితం కావని నిస్సాన్ స్పష్టం చేసింది. భారత దేశంలో తమ వ్యాపార వ్యూహం బలంగాఉందని, ఏ కర్మాగారంలో కార్యకలాపాలను నిలిపి వేసే అధికారిక ప్రణాళికలు లేవని వాటాదారులకు హామీ ఇచ్చింది. మార్చి 2025లో రెనాల్ట్ గ్రూప్ రెనాల్ట్ నిస్సాన్ ఆటోమోటివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 51శాతం వాటాను కొనుగోలు చేస్తుందని నిస్సాన్ ప్రకటించింది. ఈ చర్య రెనాల్ట్-నిస్సాన్ ప్రపంచ భాగస్వామ్యాన్ని కీలకం కానుందని కంపెనీ తెలిపింది. ఇది చెన్నై ఆధారిత ఉత్పత్తి రెనాల్ట్ పూర్తి నియంత్రణను తీసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఇదిలా ఉండగా, నిస్సాన్ భారతదేశ వ్యాపారం పూర్తిగా పనిచేస్తుందని, కస్టమర్ నిమగ్నత, డీలర్‌షిప్ విస్తరణపై నిరంతరం దృష్టిపెడతామని కంపెనీ స్పష్టం చేసింది.





## బంగ్లాదేశ్‌లో స్టార్‌లింక్ పాగా

**వాషింగ్టన్, మే 20:** ఎలాన్‌మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ యాజమాన్యంలోని శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ స్టార్ లింక్ బంగ్లాదేశ్‌లో అధికారికంగా సేవలు ప్రారంభించిట్లు ప్రకటించింది. ఇది దేశ డిజిటల్ కనెక్టివిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో గణనీయమైన పురోగతిని సూచిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్, నెట్‌వర్క్ సమస్యలతో పోరాడుతున్న మారుమూల, వెనుకబడిన ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్టార్ లింక్ విభిన్న యూజర్ అవసరాలను తీర్చడానికి బంగ్లాదేశ్‌లో వివిధ సబ్‌స్క్రిప్షన్ ప్యాకేజీలను ప్రవేశ పెట్టింది. స్టార్ లింక్ రెసిడెన్స్ ప్లాన్‌లో భాగంగా నెలకు 6వేల టాకా ధర రూ.4,200తో ప్రామానిక గృహ వినియోగానికి ఇంటర్నెట్ అందిస్తున్నారు. రెసిడెన్సీ లైట్ ప్లాన్‌లో భాగం గా నెలకు 4,200 టాకా రూ.2,900 ధరతో నెట్ సేవలు అందిస్తున్నారు. వన్ టైమ్ సెటప్ ఫీజు కింద 47వేల టాకాలు రూ.32వేలు చెల్లించాల్సి ఉంటుంది. స్టార్ లింక్ డిష్, రౌటర్‌తో సహా పరికరాల ఖర్చులు ఇందులో కవర్ అవుతాయి.



## మహదేవ్ బెట్టింగ్‌యాప్ కుంభకోణంపై 'ఇడి' దర్యాప్తు

**ముంబై, మే 20:** మహదేశ్ బెట్టింగ్‌యాప్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఈజ్ మై ట్రిప్ సిఇఒ నిశాంత్ పిట్టిని విచారిస్తున్నట్లు తెలిపింది. అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో పిట్టి ప్రమేయం ఉందని ఇడి అనుమానిస్తోంది. ఈ వ్యవహారంతో స్టాక్ మానిప్యులేషన్, మనీలాండరింగ్‌పై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అసోసియేట్ ల్యాప్‌టాప్ నుంచి స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలు ద్వారా పిట్టిని అక్రమ బెట్టింగ్ ప్లాట్ ఫామ్ అయిన స్కై ఎక్ఛేంజ్‌కు ఏజెంట్‌గా గుర్తించినట్లు ఇడి వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా మహదేవ్ బెట్టింగ్‌యాప్ ఆపరేటర్లతో సంబంధం ఉన్న డొల్ల కంపెనీలకు ఈజ్ మై ట్రిప్ చెల్లింపులు చేసిందని దర్యాప్తు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడాది ఏప్రిల్‌లో ఇడి పిట్టి నివాసంలో సోదాలు నిర్వహించి రూ.7 లక్షలు స్వాధీనం చేసుకుంది. స్టాక్ ధరలను తారుమారు చేయడం, చట్టవిరుద్ధమైన ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయడం లక్ష్యంగా ఉన్న బిగ్ నెట్‌వర్క్‌లో భాగంగా ఈ లావాదేవీలు జరిగాయని అధికారులు భావిస్తున్నారు. నిషాంత్ పిట్టి ఈ ఆరోపణలను ఖండిస్తూ ఇడి సూచించిన వ్యక్తులు, కంపెనీల గురించి తనకు తెలియదని స్పష్టం చేశారు. 2017 నుంచి ఈజ్ మై ట్రిప్ ఏ సంస్థలకు చెల్లింపులు చేయలేదని, పారదర్శకత, చట్టబద్ధమైన కార్యకలాపాలకు తమ సంస్థ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నానని, అన్ని ఆర్థిక రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు.




## ప్రొటీన్ ఈగవ్ షేర్లు భారీ పతనం

**ముంబై, మే 20:** ఇ-గవర్నెన్స్ సేవలు అందించే ప్రొటీన్ ఈగవ్ టెక్నాలజీ షేర్లు భారీ గా పతనం అయ్యాయి. రెండు ట్రేడింగ్ సెషన్లలో ఈ స్టాక్ విలువ దాదాపు 30 శాతం మేర క్షీణించింది. సోమవారం ట్రేడింగ్ 20 శాతం మేర పతనం కాగా, మంగళవారంట్రేడింగ్ ఆరంభంలో 13 శాతం మేర నష్టాన్ని చవిచూసి తర్వాత కోలుకుంది. మధ్యాహ్నం 1.15 గంటల సమయానికి 8.76 శాతం నష్టంతో 1,043.00 వద్ద కొనసాగింది. కీలకమైన పాన్ 2.0 ప్రాజెక్టుకు ప్రొటీన్‌ఈగవ్ అర్హత సాధించక పోవడమే షేర్లు పతనానికి కారణం. పాన్‌కు కొనసాగింపుగా కేంద్ర ప్రభుత్వం పాన్ 2.0 ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్, డెవలప్‌మెంట్, ఆపరేషన్స్, మెయింటెయినెన్స్ కోసం ఆదాయపు పన్ను శాఖ బిడ్డింగ్‌లు ఆహ్వానించగా, ప్రాజెక్టును చేజిక్కించుకోవడంలో ప్రొటీన్ ఈగవ్ విఫలమైంది. మేనేజ్డ్ సర్వీస్ ప్రొవైడర్‌గా వ్యవహరించేందుకు బిడ్డింగ్‌లో పాల్గొనగా తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేదంటూ ఐటీవిభాగం నుంచి తమకు కమ్యూనికేషన్ అందినట్లు ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో ప్రొటీన్‌ఈగవ్ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న పాన్ ప్రక్రియపై పెద్దగా ప్రభావం ఉండబోదంటూ ఇన్వె స్టర్లకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేసింది. ఈ వ్యాఖ్యలేవీ మార్కెట్‌ను మెప్పించకపోవడం తో షేర్లు పతనం అవుతున్నాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14